ప్రభాతనవ

సింగిడి

SINGIDI
తెలుగు దినపత్రిక

ప్రతి రంగూ ఓ నిజం

singidinews.com

శుక్రవారం 30 అక్టోబర్ 2026 | సంపుటి: 1 | సంచిక: 134 | పేజీలు 12 | వెల: 6.50

Published from: Hyderabad, Karimnagar, Warangal, Khammam, Nizamabad,Mahabubnagar

ఎస్సీ, ఎస్టీలకు గుడ్ న్యూస్

1,300 ఎకరాల భూమి పంపిణీకి రంగం సిద్ధం!

సబ్‌ప్లాన్ నిధుల అమలుపై
డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క కీలక సమీక్ష



2



2

ర్యాలీ నిర్వహించి తీరుతాం

నిరసనను వాయిదావేసే ప్రసక్తే లేదు..
కాంగ్రెస్ పార్టీ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే



మీ పెట్టుబడులకు సంరక్షకుడిగా ఉంటా

మీ పెట్టుబడిని రెట్టింపు చేయండి

ఢిల్లీ వేదికగా అంతర్జాతీయ పారిశ్రామికవేత్తలకు
ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పిలుపు

2

డిసెంబర్ 7, 8, 9 తేదీల్లో హైదరాబాద్‌లోని భారత్ ఫ్యూచర్ సిటీలో జరగనున్న 'ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్'కు పారిశ్రామిక దిగ్గజాలకు సీఎం రేవంత్ రెడ్డి సాదర ఆహ్వానం. తెలంగాణలో పెట్టే ప్రతి పైసా పెట్టుబడికి సంరక్షకుడిగా ఉంటానని, లాభాలు, వృద్ధి అంచనాలను రెట్టింపు చేసుకునేలా ప్రభుత్వం పూర్తి సహకారం అందిస్తుందని హామీ. 2034 నాటికి 1 ట్రిలియన్ డాలర్లు, 'తెలంగాణ రైజింగ్ 2047' విజన్ ద్వారా 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా రాష్ట్రాన్ని తీర్చిదిద్దడమే అంతిమ లక్ష్యమని వెల్లడి. హైదరాబాద్ నుంచి బెంగళూరు, చెన్నై, పుణేలకు మూడు హైస్పీడ్ రైల్ కారిడార్లు, వరంగల్, ఆదిలాబాద్ ఎయిర్‌పోర్టులకు కేంద్రం నుంచి పూర్తి సహకారం అందుతోందని స్పష్టీకరణ.

-హైదరాబాద్, అక్టోబర్ 29 (సింగిడి)

వెంటనే బ్లాస్టింగ్ ఆపండి

మల్లన్నసాగర్ కూల్చాలని కుట్ర చేస్తున్నారా?: హరీశ్‌రావు

మల్లన్నసాగర్ రిజర్వాయర్‌ను పరిశీలన



మల్లన్నసాగర్ రిజర్వాయర్ కట్టకు సమీపంలో అనుమతులు లేకుండా బ్లాస్టింగ్‌లు చేస్తుండటంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయని మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎల్పీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీశ్‌రావు ఆరోపించారు.

2

-హైదరాబాద్, అక్టోబర్ 29 (సింగిడి)

కవిత నయా రాజకీయం... యువతే లక్ష్యంగా వ్యూహం

అధ్యయనంతో కూడిన ప్రసంగాలు | **సామాజిక న్యాయంపై దృష్టి**

స్వతంత్ర రాజకీయ గుర్తింపు దిశగా అడుగులు... బీసీ, బహుజన వర్గాల మద్దతు కూడగట్టే ప్రయత్నం

ఉద్యమకారుల ఆశయాలకు 'పాంచజన్యం' వేదిక... పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థిత్వంతో ఎన్నికల కార్యాచరణకు పదును

తెలంగాణ రాజకీయాల్లో కల్వకుంట్ల కవిత తన రాజకీయ పంథాను కొత్త దిశగా మలుచుకునే ప్రయత్నం చేస్తున్నారు. మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ కుమార్తెగా, మాజీ ఎంపీగా, మాజీ ఎమ్మెల్సీగా గుర్తింపు పొందిన ఆమె.. తెలంగాణ రక్షణ సేన ద్వారా స్వతంత్ర రాజకీయ అస్తిత్వాన్ని నిర్మించుకునే దిశగా అడుగులు వేస్తున్నారు. ప్రసంగాల్లో అంశాల ప్రస్తావన, ప్రజా సమస్యలపై స్పందన, యువతకు ప్రాధాన్యం, సామాజిక న్యాయంపై దృష్టి.. ఆమె ప్రస్తుత రాజకీయ శైలిలో ప్రధానంగా కనిపిస్తున్నాయి.

(కరీంనగర్ - సింగిడి)



అధ్యయనం.. ప్రసంగాల్లో స్పష్టత

కవిత ప్రసంగాల్లో విద్య, ఉపాధి, రైతాంగ సమస్యలు, మహిళల సాధికారత, బీసీల రాజకీయ ప్రాతినిధ్యం వంటి అంశాలకు ప్రాధాన్యం ఇస్తున్నారు. సమస్యలను ప్రస్తావించడంతోపాటు వాటి వెనుక ఉన్న సామాజిక, రాజకీయ పరిణామాలను వివరించే ప్రయత్నం చేస్తున్నారు. అంశాలపై అధ్యయనం, మేధావులతో చర్చలు, సమాచార సేకరణ, బృంద సహకారం ఆమె ప్రసంగాల రూపకల్పనలో కీలకంగా ఉంటున్నట్లు పార్టీ వర్గాలు చెబుతున్నాయి.రోజుకు పది నుంచి పదకొండు గంటల పాటు రాజకీయ అంశాలపై అధ్యయనం చేస్తున్నారనే సమాచారం కూడా ప్రచారంలో ఉంది. అయితే ఈ వివరాలకు స్వతంత్ర ధ్రువీకరణ అవసరం. ఏదేమైనా, తన రాజకీయ సందేశాన్ని స్పష్టంగా ప్రజల్లోకి తీసుకెళ్లడంపై ఆమె దృష్టి సారిస్తున్నట్లు కనిపిస్తోంది.

యువత, బీసీలు.. రాజకీయ అజెండాలో కీలకం

యువతకు ఉపాధి, ప్రభుత్వ ఉద్యోగ నియామకాలు, విద్య, మహిళల సమస్యలు, బీసీలకు రాజకీయ ప్రాతినిధ్యం వంటి అంశాలను తెలంగాణ రక్షణ సేన ప్రధానంగా ప్రస్తావిస్తోంది. ఈ అంశాల ద్వారా యువత, విద్యావంతులు, మహిళలు, బహుజన వర్గాలతో రాజకీయ సంబంధాలను విస్తరించుకోవాలనే వ్యూహం ఉందనే విశ్లేషణకు అవకాశం ఉంది.తెలంగాణ ఉద్యమ ఆకాంక్షలను ప్రస్తుత సామాజిక, ఆర్థిక సమస్యలతో అనుసంధానిస్తూ 'పాంచజన్యం' కార్యక్రమాన్ని ముందుకు తీసుకెళ్లడం కూడా ఈ రాజకీయ ప్రయత్నంలో భాగంగా కనిపిస్తోంది. అయితే ఉద్యమ వారసత్వాన్ని ప్రస్తావించడం ఒకటైతే, ఆ ఆశయాలను విధానాలుగా మార్చి ప్రజలకు ఫలితాలు అందించడం మరో అంశం. ఈ రెండింటి మధ్య ఉన్న అంతరాన్ని పూడ్చడమే రాజకీయంగా కీలకం కానుంది.

'అక్క' నుంచి 'అమ్మ'గా.. ఆత్మీయతకు ఆచరణ తోడైతేనే!

ప్రజలతో వ్యక్తిగత అనుబంధాన్ని కొనసాగించడం కవిత రాజకీయ శైలిలో మరో కోణం. కార్యకర్తలను గుర్తుపట్టి పలకరించడం, ప్రజల సమస్యలను తెలుసుకోవడం వంటి అంశాలు ఆమెను అభిమానించే వర్గాల్లో ప్రస్తావనకు వస్తున్నాయి.ఈ నేపథ్యంలో 'అక్క' నుంచి 'అమ్మ'గా ప్రజలకు మరింత చేరువ కావాలనే భావన కూడా చర్చకు వస్తోంది. అయితే ఇది కేవలం సంబోధనలో మార్పుతో సాధ్యమయ్యేది కాదు. నిరుద్యోగ యువత, మహిళలు, రైతులు, పేదల సమస్యలపై నిరంతర స్పందన, పరిష్కారాల కోసం కార్యాచరణ ఉన్నప్పుడే ఆత్మీయత రాజకీయ విశ్వాసనీయతగా మారుతుంది.

కుటుంబ రాజకీయ నీడ నుంచి స్వతంత్ర గుర్తింపు వైపు!

కవిత ముందున్న ప్రధాన రాజకీయ సవాళ్లలో ఒకటి కుటుంబ రాజకీయ గుర్తింపును సొంత నాయకత్వ గుర్తింపుగా మార్చుకోవడం. తెలంగాణ రక్షణ సేన ద్వారా ప్రత్యేక అజెండాను రూపొందించడం, బీసీ–బహుజన వర్గాల సమస్యలను ప్రస్తావించడం, యువతను రాజకీయాల్లో భాగస్వాములను చేయడం ఈ దిశగా సాగుతున్న ప్రయత్నాలుగా విశ్లేషించవచ్చు.అదే సమయంలో కొత్త పార్టీకి బహిరంగ సభలు, ప్రసంగాలు మాత్రమే సరిపోవు. జిల్లాలు, పట్టణాలు, గ్రామాల స్థాయిలో నాయకత్వాన్ని

-మిగతా 2లో

ఆ 550 ఎకరాలు తెలంగాణ ప్రభుత్వానివే

మియాపూర్ భూముల కేసులో సుప్రీం తీర్పు

2



రంగారెడ్డి జిల్లా శేరిలింగంపల్లి మండలం మియాపూర్ గ్రామ పరిధిలోని సర్వే నంబర్లు 100, 101కు సంబంధించిన భూ వివాదంలో సుప్రీంకోర్టు కీలకతీర్పు వెలువరించింది. సుమారు 550 ఎకరాలకిపైగా విస్తీర్ణంలో ఉన్న ప్రభుత్వ భూములపై హక్కులు కోరుతూ ప్రైవేట్ వ్యక్తులు దాఖలు చేసిన అప్పీళ్లను కొట్టివేసింది. దీంతో వేల కోట్ల రూపాయల విలువైన ప్రభుత్వ భూములపై సుదీర్ఘకాలంగా కొనసాగుతున్న న్యాయ వివాదానికి ముగింపు లభించింది.

-హైదరాబాద్, అక్టోబర్ 29 (సింగిడి)

ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి వ్యాఖ్యలపై

చర్యలు తప్పవు

టీపీసీసీ చీఫ్ మహేశ్ గౌడ్

సొంత పార్టీ ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి చేసిన వ్యాఖ్యలపై టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. అనిరుధ్ వ్యాఖ్యలను తీవ్రంగా పరిగణిస్తున్నామని, ఈ వ్యవహారాన్ని క్రమశిక్షణ కమిటీకి అప్పగిస్తామని ఆయన స్పష్టం చేశారు.



2

-హైదరాబాద్ (సింగిడి)

బాధితులను ఆదుకుంటాం

అర్నబ్ తుపాను ప్రభావిత ప్రాంతాల్లో సీఎం చంద్రబాబు ఏరియల్ సర్వే

రెండు రోజుల్లో 100% విద్యుత్ పునరుద్ధరణే లక్ష్యమని ప్రకటన

రూ.4600 కోట్ల ప్రాథమిక నష్టం జరిగిందని కేంద్రానికి నివేదిక

నష్టపోయిన రైతులకు పరిహారం, పునరావాస శిబిరాల నుంచి వెళ్లేవారికి ప్రత్యేక ప్యాకేజీ

"తుపానును మనం పూర్తిగా నివారించలేం. కానీ, మనకు ఉండే ప్రత్యేక పరిస్థితుల్లో దాన్ని సమర్థవంతంగా ఎదుర్కొని ప్రాణ, ఆస్తి నష్టాన్ని తగ్గించాలి. అర్నబ్ తుపానును సమర్థవంతంగా ఎదుర్కొని ఎవరికీ ఇబ్బంది లేకుండా చేసే బాధ్యత తీసుకుంటాను" అని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టం చేశారు. 'అర్నబ్' తుపాను సృష్టించిన బీభత్సం నేపథ్యంలో గురువారం ఆయన కృష్ణా, పశ్చిమ గోదావరి, డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లాల్లో ఏరియల్ సర్వే నిర్వహించారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ, ప్రభుత్వ చర్యలను, భవిష్యత్ ప్రణాళికలను సుదీర్ఘంగా వివరించారు.

ముందస్తు చర్యలతో ప్రాణనష్టం తగ్గించాం

గతంలో 1977 దివిసీమ తుపాను, 1996 కోనసీమ తుపాను సృష్టించిన విధ్వంసాలను గుర్తుచేసుకున్న చంద్రబాబు, ఆ అనుభవాలతో ఈసారి పటిష్టమైన ముందస్తు చర్యలు తీసుకున్నామని తెలిపారు.

-హైదరాబాద్, అక్టోబర్ 29 (సింగిడి)



2

క్రాప్ హాలిడే కాదు... కాంగ్రెస్‌కే హాలిడే ఇవ్వాలి

మూసీకి లక్షన్నర కోట్లు.. రైతులకు పాట్లు

పంటలు ఎండుతుంటే సుందరీకరణ ఎందుకు?

డీపీఆర్ లేకుండానే భారీ ప్రాజెక్టుకు స్కెచ్

అది గ్లోబల్ సమ్మిట్ కాదు.. గోబెల్స్ సమ్మిట్

పెట్టుబడులు, ఉద్యోగాలపై వైట్ పేపర్ విడుదల చేయాలి: కేటీఆర్

2



రైతులకు క్రాప్ హాలిడే.. పరిశ్రమలకు పవర్ హాలిడే.. ఉద్యోగులకు పీఆర్సీ, రిటైర్మెంట్ బెనిఫిట్స్ ఎగవేత.. ఆరు గ్యారెంటీల అమలులో జాప్యం. ఇలా అన్ని రంగాలకూ సెలవు ప్రకటించిన కాంగ్రెస్ ప్రభుత్వానికే ప్రజలు హాలిడే ఇవ్వాలని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పిలుపునిచ్చారు. ఎన్నికల ముందు రైతు డిక్లరేషన్లు ప్రకటించిన కాంగ్రెస్.. ఇప్పుడు రైతుల చేతే సెల్ఫ్ డిక్లరేషన్లు ఇప్పిస్తోందని విమర్శించారు. పంటలను కాపాడుకునేందుకు రైతులు జనరేటర్లు, ట్యాంకర్లను ఆశ్రయించాల్సిన దుస్థితి ఏర్పడిందని మండిపడ్డారు.

(హైదరాబాద్ బ్యూరో – సింగిడి)

తుపాను బాధితులకు వైసీపీ అండ

పార్టీ శ్రేణులకు జగన్ పిలుపు

ప్రభుత్వ సహాయక చర్యలు పూర్తిగా విఫలం

టీడీపీ నేతలు బియ్యం మాఫియాను ప్రోత్సహిస్తున్నారని ఆరోపణ

2

సోనా మసూరి బియ్యం ధర కేజీ రూ.90 దాటిందని వ్యాఖ్య

అర్నబ్ తుపాను బాధిత ప్రాంతాల్లో ప్రజలకు అండగా నిలవాలని వైసీపీ అధినేత జగన్ పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. రాష్ట్రంలో సహాయక చర్యలు విఫలమయ్యాయని విమర్శించారు. అధికార పార్టీ నేతలు 'బియ్యం మాఫియా'ను ప్రోత్సహిస్తూ కృత్రిమ కొరత సృష్టిస్తున్నారని ఆయన తీవ్ర ఆరోపణలు చేశారు.

-అమరావతి, అక్టోబర్ 29 (సింగిడి)

నేను అప్పుడు అలా మాట్లాడాల్సింది కాదు

కేటీఆర్‌కు సారీ చెప్పిన కొండా సురేఖ

బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌కు క్షమాపణ చెప్పిన కొండా సురేఖ

గతంలో చేసిన వ్యక్తిగత వ్యాఖ్యలను వెనక్కి తీసుకుంటున్నట్లు ప్రకటన

కొండా దంపతులు తిరిగి బీఆర్ఎస్‌లో చేరతారనే ఊహాగానాలకు బలం

2





వెంటనే బ్లాస్టింగ్ ఆపండి

పేలుళ్లతో కట్టకు ప్రకంపనలు వస్తున్నాయని, సమీపంలోని ఇళ్లకు పగుళ్లు ఏర్పడుతున్నాయని పేర్కొన్నారు. తక్షణమే బ్లాస్టింగ్‌లను నిలిపివేసి, కట్ట భద్రతపై అధికారులు సమగ్రంగా పరిశీలించాలని డిమాండ్ చేశారు. సిద్దిపేట జిల్లా కొండపాక మండలం తిప్పారం గ్రామం వద్ద మల్లన్నసాగర్ కట్టను దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి, ఎమ్మెల్సీ వంటేరు యాదవరెడ్డి, మాజీ కార్పొరేషన్ చైర్మన్లు వంటేరు ప్రతాపరెడ్డి, ఎర్రోళ్ల శ్రీనివాస్ తదితరులతో కలిసి ఆయన పరిశీలించారు.

బాధ్యులపై చర్యలు తీసుకోవాలి

పైప్‌లైన్ల పనుల కోసం జిలిటెన్ స్టిక్స్‌తో బ్లాస్టింగ్‌లు చేస్తున్నారని, ఇందుకు ఇరిగేషన్, రెవెన్యూ శాఖల అనుమతులు తీసుకోవాలని హరీశ్‌రావు అన్నారు. నిబంధనల ప్రకారం కట్టకు 400 మీటర్ల దూరంలో పేలుళ్లు జరపాల్సి ఉండగా, 200 మీటర్ల దూరంలోనే జరుగుతున్నాయని మండిపడ్డారు.
రాత్రివేళల్లో బ్లాస్టింగ్‌లతో స్థానికులకు నిద్ర ఉండటం లేదని, ఇళ్లకు పగుళ్లు వస్తున్నాయని పేర్కొన్నారు. లక్షల ఎకరాలకు సాగునీరు అందించే ఈ ప్రాజెక్టు భద్రత విషయంలో నిర్లక్ష్యం తగదని హెచ్చరించారు. ఇళ్లకు జరిగిన నష్టాన్ని అంచనా వేసి బాధితులకు పరిహారం అందించాలని, బాధ్యులపై చర్యలు తీసుకోవాలని హరీశ్ రావు డిమాండ్ చేశారు.
"మల్లన్నసాగర్ రిజర్వాయర్ కట్ట సమీపంలో బ్లాస్టింగ్‌లు చేస్తున్నారు. మల్లన్నసాగర్ కూల్చాలని కుట్ర చేస్తున్నారా?. మల్లన్నసాగర్ కట్ట పక్కనే అనధికారిక బ్లాస్టింగ్ చేస్తున్నారు. మేడిగడ్డను చేసినట్లు మల్లన్నసాగర్‌ను చేయాలని చేస్తున్నారా?తక్షణమే బ్లాస్టింగ్ నిలిపివేయాలి. కట్ట భద్రతపై నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి సమీక్ష చేయాలి" – హరీశ్‌రావు, మాజీ మంత్రి, బీఆర్ఎస్ఎల్పీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్

ఆ 550 ఎకరాలు తెలంగాణ ప్రభుత్వానివే

రంగారెడ్డి జిల్లా శేరిలింగంపల్లి మండలం మియాపూర్‌లోని సర్వే నంబర్ 100లో 277 ఎకరాల 5 గుంటలు, సర్వేనంబర్ 101లో 273 ఎకరాల 34 గుంటల ప్రభుత్వ భూమిగా రెవెన్యూ రికార్డుల్లో నమోదై ఉంది. ఆ భూములపై హక్కులు కోరుతూ ప్రైవేట్ వ్యక్తులు న్యాయస్థానాలను ఆశ్రయించారు. ఈ కేసుల్లో 1997లో ప్రత్యేక న్యాయస్థానం, 2003లో హైకోర్టు ప్రభుత్వానికి అనుకూలంగా తీర్పునిచ్చింది. ఆ తీర్పును సవాల్‌చేస్తూ ప్రైవేట్ వ్యక్తులు సుప్రీంకోర్టుకు వెళ్లారు. దాదాపు 23 ఏళ్లుగా ఈ కేసులు పెండింగ్‌లో ఉన్నాయి.
550 ఎకరాలకు పైగా విస్తీర్ణంలో ఉన్న ప్రభుత్వ భూములపై హక్కులు కోరుతూ ప్రైవేట్ వ్యక్తులు దాఖలు చేసిన అప్పీళ్లను కొట్టివేస్తూ జస్టిస్ సుందరేశ్, జస్టిస్ సతీశ్ చంద్రశర్మతో కూడిన ధర్మాసనం తీర్పు వెలువరించింది. ఆ భూములను జాగీర్దార్ కైసరుద్దీన్ చట్టబద్ధమైన వారసులైన అమీరున్నిషా, ఇతరుల నుంచి చట్టబద్ధంగా పొందామని తమ పేరిట ఉన్న జీపీఏ, సనద్ హక్కులకు ఆటంకం కలగకుండా చూడాలని పిటిషన్‌దారులు కోరారు. రిజిస్టర్డ్ పత్రాలని రద్దు చేసే అధికారం తహసీల్దార్‌కు లేదని వాదించారు.

23 ఏళ్ల భూ వివాదానికి తెర

ప్రభుత్వ పక్షాన వాదించిన సీనియర్ న్యాయవాది శ్రీ వైద్యనాథన్ మియాపూర్ భూములు సర్కారుకే చెందుతాయని స్పష్టం చేశారు. అందుకు సంబంధించిన రెవెన్యూ రికార్డులు, సేత్వార్, క్లాసర్ రిజిస్టర్ గత న్యాయస్థానాల తీర్పులను ఆధారాలుగా సమర్పించారు. ప్రైవేట్ వ్యక్తులు హక్కులు కోరుతూ చూపిన రెవెన్యూ ఎంట్రీల్లో అవకతవకలున్నాయని గత న్యాయస్థానాలు గుర్తించిన అంశాలను కోర్టు దృష్టికి తీసుకెళ్లారు.
ఇరుపక్షాల వాదనలు విన్న సుప్రీంకోర్టు ధర్మాసనం కోట్లాది రూపాయల విలువైన భూములు ప్రైవేట్‌వ్యక్తుల చేతుల్లోకి వెళ్లేందుకు కోర్టు అనుమతించబోదని స్పష్టంచేసింది. ఇలాంటి విషయాల్లో కోర్టు మౌనంగా ఉండలేదని పేర్కొంది. ఈ భూముల విషయంలో ప్రభుత్వం చూపిన చొరవని సుప్రీంకోర్టు ప్రశంసించింది. మియాపూర్ భూముల విషయంలో సుప్రీంకోర్టు తీర్పు ప్రభుత్వానికి అనుకూలంగా రావడంపై అధికారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఇన్నేళ్లుగా చేసిన పోరాటానికి ఫలితం దక్కిందని వ్యాఖ్యానించారు.

ర్యాలీ నిర్వహించి తీరుతాం

న్యూఢిల్లీ, అక్టోబర్ 29 (సింగిడి)

ఓటర్ల జాబితాల ప్రత్యేక సమగ్ర సవరణను నిరసిస్తూ ఎన్నికల సంఘానికి వ్యతిరేకంగా చేపట్టనున్న నిరసన కార్యక్రమాన్ని వాయిదావేసే ప్రసక్తేలేదని కాంగ్రెస్ పార్టీ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే స్పష్టంచేశారు. నవంబర్ 1న ఢిల్లీలోని రామ్‌లీలా మైదానంలో ఇండియా కూటమి ఆధ్వర్యంలో భారీ నిరసన ర్యాలీ కొనసాగుతుందని చెప్పారు. ప్రజల్లో చైతన్యం తీసుకురావడమే తమ పోరాట లక్ష్యమని పేర్కొన్నారు. ఎన్నికల సంఘం చేపడుతున్న 'ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్)' ప్రక్రియలో ఓట్ల చోరీ, అక్రమాలు జరుగుతున్నాయని ఆరోపిస్తూ కాంగ్రెస్ నేతృత్వంలోని ఇండియా కూటమి ఈ నిరసనకు పిలుపునిచ్చింది. ఎన్నికల సంఘం ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ వ్యవహరించిన తీరుపై కూడా ఖర్గే విమర్శలు చేశారు. ఓటర్ల హక్కులకు భంగం కలుగుతోందని ఆరోపిస్తూ ఈ అంశంపై తమ పోరాటం కొనసాగుతుందని చెప్పారు. అన్ని ప్రతిపక్ష పార్టీలు తమకు మద్దతుగా ఉన్నాయని వెల్లడించారు. పండుగల సీజన్‌లో భారీ ర్యాలీ నిర్వహిస్తే ఢిల్లీలో వ్యాపార కార్యకలాపాలు దెబ్బతింటాయని పలు వ్యాపార సంఘాలు ఆందోళన వ్యక్తంచేశాయి. ర్యాలీని మరో తేదీకి మార్చాలని రాహుల్‌గాంధీని కోరాయి. పెద్దఎత్తున జనసమీకరణ వల్ల వ్యాపార వాతావరణం దెబ్బతినడంతోపాటు తమ జీవనోపాధిపై ప్రభావం పడుతుందని వ్యాపారులు పేర్కొన్నారు. అయితే ఈ విజ్ఞప్తుల నేపథ్యంలోనూ నవంబర్ 1న నిరసన కొనసాగుతుందని ఖర్గే స్పష్టంచేశారు.
మరోవైపు లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ కూడా ప్రజలు పెద్ద సంఖ్యలో నిరసనలో పాల్గొనాలని పిలుపునిచ్చారు. ఈ మార్చ్ ఏ ఒక్క పార్టీకి సంబంధించినది కాదని, ప్రజాస్వామ్యాన్ని కాపాడటం, ఓట్ల చోరీని అడ్డుకోవడం, రాజ్యాంగాన్ని పరిరక్షించడం కోసమని అన్నారు. రాజకీయ భేదాలకు అతీతంగా విద్యార్థి సంఘాలు కూడా ఈ ఉద్యమంలో భాగస్వాములు కావాలని కోరారు. ప్రజాస్వామ్య స్ఫేచ్ఛలు, వ్యక్తిగత అభిప్రాయాలను వ్యక్తంచేసే హక్కులు ముప్పును ఎదుర్కొంటున్నాయని ఆయన ఆరోపించారు

ఎస్సీ, ఎస్టీలకు గుడ్ న్యూస్

1,300 ఎకరాల భూమి పంపిణీకి రంగం సిద్ధం

సచివాలయంలో డిప్యూటీ సీఎం భట్టి కీలక నిర్ణయాలు

హైదరాబాద్, అక్టోబర్ 29 (సింగిడి)

డాక్టర్ బీఆర్ అంబేద్కర్ రాష్ట్ర సచివాలయంలో వ్యవసాయ, ఇంధన, వైద్య, పంచాయతీరాజ్ తదితర శాఖలతో ఎస్సీ, ఎస్టీ సబ్ ప్లాన్ నిధులపై డిప్యూటీ సీఎం సమీక్ష. రాష్ట్రవ్యాప్తంగా కలెక్టర్ల ద్వారా గుర్తించిన సుమారు 1,300 ఎకరాల ఖాళీ భూమిని అర్హులైన పేద కుటుంబాలకు అందించేలా వెంటనే అనుమతులు పూర్తి చేయాలని ఆదేశం. సబ్సిడీ విత్తనాలు, రైతు భరోసా, వ్యవసాయ యాంత్రీకరణ ప్రయోజనాలపై పూర్తిస్థాయి లబ్ధిదారుల వివరాలతో డిజిటల్ డేటా సిద్ధం చేయాలని స్పష్టీకరణ. ఏజెన్సీ ప్రాంతాల్లో మొబైల్ మెడికల్ యూనిట్ల ఏర్పాటు, విద్యుద్దీకరణ, కమ్యూనిటీ హాళ్లు, శ్మశాన వాటికల అభివృద్ధికి కార్యాచరణ సిద్ధం చేయాలని మంత్రి అడ్లూరి లక్ష్మణ్ వెల్లడి. తెలంగాణలోని ఎస్సీ, ఎస్టీ వర్గాల సామాజిక, ఆర్థిక సమగ్ర వికాసానికి రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయాలు తీసుకుంటోంది. సబ్ ప్లాన్ ప్రత్యేక అభివృద్ధి నిధులు కేవలం కాగితాలకే పరిమితం కాకుండా, క్షేత్రస్థాయిలో అర్హులైన ప్రతీ లబ్ధిదారుడి గడపకూ చేరాలని ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క అధికారులను ఆదేశించారు. గురువారం డాక్టర్ బీఆర్ అంబేద్కర్ రాష్ట్ర సచివాలయంలో సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌తో కలిసి వ్యవసాయం, ఇంధనం, వైద్యారోగ్యం, పంచాయతీరాజ్, మున్సిపల్ శాఖల ఉన్నతాధికారులతో ఆయన ఉన్నత స్థాయి సమీక్ష నిర్వహించారు.

మీ పెట్టుబడులకు సంరక్షకుడిగా ఉంటా



తెలంగాణలో పెట్టుబడులు పెట్టేందుకు సిద్ధమవుతున్న దేశ, విదేశీ పారిశ్రామిక దిగ్గజాలకు ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి ఒక అద్భుతమైన భరోసా ఇచ్చారు. "తెలంగాణలో ఎంత పెట్టుబడి పెట్టాలనుకుంటున్నారో మీ మనసులో ఒక సంఖ్యను అనుకోండి.. దాన్ని వెంటనే రెట్టింపు చేయండి! మీ లాభాలనూ, వృద్ధి అంచనాలనూ రెట్టింపు చేసుకోండి. మీ పెట్టుబడులకు సెక్యూరిటీ కల్పించి, అవి వేగంగా వృద్ధి చెందేలా చూసే బాధ్యత నాది.. మీ పెట్టుబడులకు నేను సంరక్షకుడిగా ఉంటా" అని సంచలన ప్రకటన చేశారు. ఢిల్లీ వేదికగా గురువారం జరిగిన 'ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్' కర్టెన్ రైజర్ ఈవెంట్‌లో కేంద్ర వాణిజ్య శాఖ మంత్రి పీయూష్ గోయల్ సమక్షంలో సీఎం రేవంత్ రెడ్డి ఈ కీలక వ్యాఖ్యలు చేశారు.
డిసెంబర్ 7, 8, 9 తేదీల్లో హైదరాబాద్‌లోని సరికొత్త 'భారత్ ఫ్యూచర్ సిటీ' వేదికగా జరగనున్న మెగా ఇన్వెస్ట్‌మెంట్ సమ్మిట్‌కు రేవంత్ రెడ్డి పారిశ్రామికవేత్తలను సాదరంగా ఆహ్వానించారు.

హైదరాబాద్ డీఎన్‌ఏలోనే గ్లోబల్ విజన్ ఉంది

హైదరాబాద్‌కు 400 ఏళ్ల ఘనమైన వాణిజ్య చరిత్ర ఉందని సీఎం గుర్తుచేశారు. ఆనాటి చార్మినార్ వీధుల్లో ముత్యాలు, సుగంధ ద్రవ్యాల వ్యాపారం నుంచి నేటి గ్లోబల్ లీడర్ల వరకు భాగ్యనగరం ప్రపంచానికి దిక్సూచిగా నిలిచిందన్నారు. మైక్రోసాఫ్ట్ సీఈవో సత్య నాదెళ్ల, ప్రపంచ బ్యాంక్ అధ్యక్షుడు అజయ్ బంగా, అడోబ్ సీఈవో శంతను నారాయణ్ వంటి గ్లోబల్ లీడర్లను అందించిన ఘనత హైదరాబాద్ పబ్లిక్ స్కూల్‌దేనని కొనియాడారు.
దేశ ఆర్థిక పురోగతికి బాటలు వేసిన దివంగత ప్రధానులు రాజీవ్ గాంధీ, పీవీ నరసింహారావుల సేవలను స్మరించుకుంటూ.. దేశ సంస్కరణలకు ప్రతిరూపంగా నిలిచిన తెలంగాణ గడ్డ ఎప్పుడూ పెట్టుబడులకు పెద్దపీట వేస్తుందని చెప్పారు. రాజకీయ సిద్ధాంతాలు వేరైనా గత 30 ఏళ్లుగా హైదరాబాద్ అభివృద్ధికి పాలకులు అందించిన నిరంతర మద్దతును ఆయన శ్లాఘించారు.

పోటీ దేశీయ నగరాలతో కాదు.. న్యూయార్క్, లండన్‌లతోనే!

హైదరాబాద్ లక్ష్యం చిన్నది కాదని సీఎం తేల్చిచెప్పారు. "హైదరాబాద్ దేశంలోని ఢిల్లీ, ముంబై, బెంగళూరు, చెన్నై నగరాలతో పోటీ పడటం లేదు. న్యూయార్క్, లండన్, టోక్యో, సియోల్, దుబాయ్ వంటి అంతర్జాతీయ నగరాలతోనే మన పోటీ" అని కుండబద్దలు కొట్టారు. వ్యాపారవేత్తల ఎదుగుదలలో ప్రభుత్వం ఒక అడ్డంకిలా ఉండకూడదని, అనవసర జోక్యాలను తగ్గించి రెడ్ కార్పెట్ పరిచి అవకాశాలను విస్తరించడమే తమ ప్రభుత్వ విధానమని స్పష్టం చేశారు.

లక్ష్యం 3 ట్రిలియన్ డాలర్లు.. కేంద్రం నుంచి ఫుల్ సపోర్ట్

'వికసిత్ భారత్ 2047'లో తెలంగాణ కీలక పాత్ర పోషించనుందని రేవంత్ రెడ్డి తెలిపారు. "2047 నాటికి భారత్ 30 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా మారితే, అందులో తెలంగాణ వాటా కనీసం 10 శాతం (3 ట్రిలియన్ డాలర్లు) ఉండేలా 'తెలంగాణ రైజింగ్ 2047' విజన్ డాక్యుమెంట్‌ను సిద్ధం చేశాం. మధ్యంతరంగా 2034 నాటికే 1 ట్రిలియన్ డాలర్ల మార్కును చేరుకుంటాం" అని వివరించారు.
కేంద్ర, రాష్ట్ర సంబంధాలపై పెట్టుబడిదారులకున్న అనుమానాలను నివృత్తి చేస్తూ.. రాజకీయాలకు అతీతంగా అభివృద్ధి విషయంలో కేంద్ర ప్రభుత్వంతో కలిసి పనిచేస్తున్నామని వెల్లడించారు. దేశంలో తలపెట్టిన 7 హైస్పీడ్ బుల్లెట్ రైలు కారిడార్లలో 3 కారిడార్లు (హైదరాబాద్–బెంగళూరు, హైదరాబాద్–చెన్నై, హైదరాబాద్–పుణె) మన నగరానికే దక్కాయని, వీటికితోడు వరంగల్, ఆదిలాబాద్ ఎయిర్‌పోర్టులు, రీజినల్ రింగ్ రోడ్డు, మెట్రో విస్తరణ ప్రాజెక్టులకు కేంద్రం పూర్తి సహకారం అందిస్తోందని సీఎం స్పష్టం చేశారు.

బాధితులను అన్ని విధాలా ఆదుకుంటాం

"ఈసారి ఒకే ఒక్క టార్గెట్ పెట్టుకున్నాను, ప్రాణనష్టం సున్నాగా ఉండాలని లక్ష్యంగా పెట్టుకున్నా. దురదృష్టవశాత్తు ఏడుగురు ప్రాణాలు కోల్పోయారు. టెక్నాలజీని ఉపయోగించి తుపాను గమనాన్ని ఎప్పటికప్పుడు అంచనా వేశాం. రాత్రంతా యంత్రాంగాన్ని అప్రమత్తం చేశాం. ఎన్డీఆర్ఎఫ్, ఎస్డీఆర్ఎఫ్, పోలీస్, ఫైర్ విభాగాలను మోహరించాం. ఏ ప్రాంతంలో ఎంత తీవ్రత ఉంటుందో నిమిష నిమిషానికి సమాచారం అందించాం. దీనివల్ల అధికార యంత్రాంగం అప్రమత్తంగా వ్యవహరించి ప్రాణ నష్టాన్ని గణనీయంగా తగ్గించగలిగాం" అని ఆయన వివరించారు. కొంతమంది తుపాను హెచ్చరికలను ఎగతాళి చేశారని, కానీ తీవ్రత పెరిగాక వాస్తవం గ్రహించారని అన్నారు.
30 ఏళ్ల కిందటి జ్ఞాపకాలు కళ్లముందు..
ఈ సందర్భంగా 30 ఏళ్ల క్రితం 1996లో వచ్చిన తుఫాను నాటి భయానక పరిస్థితులను చంద్రబాబు గుర్తుచేసుకున్నారు.
"ఆ రోజు నా కళ్ల ముందు ఆ దృశ్యాలు ఇంకా కదలాడుతున్నాయి. అప్పుడు ప్రైవేట్ ఫ్లైట్స్ లేవు, డిఫెన్స్ విమానంలో వచ్చాను. ఆర్మీ హెలికాప్టర్ సిబ్బంది ప్రాణాపాయం ఉంటుందని నన్ను తీసుకెళ్లలేమని చెప్పినా, నేను బలవంతం చేసి వెళ్లాను. రోడ్డు మీద దిగి మత్స్యకార గ్రామాలను చూస్తే భయంకరమైన దృశ్యాలు కనిపించాయి. ముమ్మిడివరం, అమలాపురంలో దిగి ప్రజలకు ధైర్యం చెప్పి, రాజమండ్రి ఆర్డీవో ఆఫీసునే సెక్రటేరియట్‌గా మార్చి, ప్రతి మండలానికి ఒక సెక్రటరీని నియమించి వారం రోజుల్లో సాధారణ పరిస్థితులు తీసుకొచ్చాం. ఆనాటి పరిస్థితులతో పోలిస్తే, ఈరోజు టెక్నాలజీ సాయంతో వేగంగా స్పందించగలుగుతున్నాం" అని ఆయన తెలిపారు.
వెయ్యి మందిని పంపమని తెలంగాణ ప్రభుత్వాన్ని కోరాను
తుపాను కారణంగా రాష్ట్రవ్యాప్తంగా సుమారు 15,000 విద్యుత్ స్తంభాలు దెబ్బతింటాయని అంచనా వేయగా, ఒక్క కోనసీమలోనే 8,000 స్తంభాలు నేలకూలాయని చంద్రబాబు తెలిపారు.
"తుపాను తీరం దాటిన వెంటనే చెట్లను తొలగించే పనులు ప్రారంభించాం. ఈరోజు మారుమూల గ్రామాలకు కూడా రోడ్లు క్లియర్ చేశాం. విద్యుత్ పునరుద్ధరణే ఇప్పుడు మా ముందున్న ప్రధాన సవాలు. తెలంగాణ ప్రభుత్వంతో మాట్లాడి 1000 మంది సిబ్బందిని పంపమని కోరాను. అవసరమైతే తమిళనాడు, కర్ణాటక నుంచి కూడా అదనపు సిబ్బందిని తెప్పిస్తాం. ఎల్లుండిలోగా ప్రతి ఇంటికి 100% విద్యుత్ ఇచ్చే బాధ్యత తీసుకుంటాం" అని ఆయన హామీ ఇచ్చారు. టెలికమ్యూనికేషన్ సిగ్నల్స్‌కు అంతరాయం కలగకుండా జనరేటర్లు, డీజిల్ సిద్ధం చేసుకోవాలని ఆపరేటర్లకు సూచించినా, కొందరు నిర్లక్ష్యం చేశారని, వారికి అవసరమైతే ప్రభుత్వమే డీజిల్ ఖర్చులు భరిస్తుందని చెప్పామని అన్నారు.
నష్టపరిహారంపై స్పష్టమైన హామీ
తుపాను వల్ల ప్రాథమికంగా రూ. 4,600 కోట్లకు పైగా నష్టం వాటిల్లిందని ముఖ్యమంత్రి వెల్లడించారు.
"కేంద్ర హోం మంత్రి అమిత్ షాతో మాట్లాడాను. ఆయన స్వయంగా ఫోన్ చేసి శుక్రవారం కేంద్ర బృందాన్ని పంపిస్తానని చెప్పారన్నారు.



తుపాను బాధితులకు వైసీపీ అండ

తాడేపల్లిలోని పార్టీ కేంద్ర కార్యాలయం నుంచి జిల్లా అధ్యక్షులు, రీజనల్ కో-ఆర్డినేటర్లతో ఆయన వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా జగన్ మాట్లాడుతూ... 'గ్రామ, వార్డు సచివాలయాల నిర్వీర్యం, వాలంటీర్ల వ్యవస్థ రద్దు ప్రభావం తుపాను సహాయక చర్యలపై స్పష్టంగా కనిపిస్తోంది. ప్రభుత్వం విపత్తులను ఆదాయ వనరుగా మార్చుకోవాలనుకుంటోంది' అని విమర్శించారు. సోనా మసూరి బియ్యం ధర కేజీ రూ.90 దాటిందని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వంలోని కీలక నేతలే బియ్యం ధరల పెరుగుదలకు కారణమని ఆరోపించారు. 'మంత్రి పయ్యావుల వియ్యంకుడు సహా టీడీపీ నేతలు బియ్యాన్ని మార్కెట్లోకి రానీయకుండా బ్లాక్ చేసి, ఎక్స్‌పోర్టు చేస్తున్నారు. విపత్కర పరిస్థితుల్లోనూ బియ్యం మాఫియాను ప్రోత్సహిస్తున్నారు' అని జగన్ వ్యాఖ్యానించారు. తుపాను కారణంగా వరి, ఆక్వా, పండ్ల తోటలు తీవ్రంగా దెబ్బతిన్నాయని, ఈ క్లిష్ట సమయంలో బాధితులకు తోడుగా నిలవాలని పార్టీ శ్రేణులకు సూచించారు. ధాన్యం సేకరణలో రైతులకు అండగా ఉంటూ, ప్రతి గింజనూ ప్రభుత్వం కొనుగోలు చేసేలా ఒత్తిడి తీసుకురావాలని జగన్ స్పష్టం చేశారు.

కవిత నయా రాజకీయం... యువతే లక్ష్యంగా వ్యూహం

మొదటి పేజీ తరువాయి...

నిర్మించడం, కార్యకర్తలను సమన్వయం చేయడం, స్థానిక సమస్యలపై నిరంతరంగా పనిచేయడం అవసరం. హైదరాబాద్, సైబరాబాద్, మల్కాజిగిరి వంటి పట్టణ ప్రాంతాల్లో ఉపాధి, రవాణా, విద్య, గృహవసతి, మహిళల భద్రత వంటి అంశాలను అజెండాలోకి తీసుకురావడం ద్వారా పార్టీ తన పరిధిని విస్తరించుకునే అవకాశం ఉంది.

పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలు.. వ్యూహానికి పరీక్ష

వరంగల్–ఖమ్మం–నల్గొండ పట్టభద్రుల ఎమ్మెల్సీ నియోజకవర్గానికి డాక్టర్ నలమాస శ్రీకాంత్ గౌడ్‌ను అభ్యర్థిగా ప్రకటించడం ద్వారా తెలంగాణ రక్షణ సేన ఎన్నికల రంగంలో తన కార్యాచరణను విస్తరిస్తోంది. నిరుద్యోగం, ఉద్యోగ నియామకాలు, ఉన్నత విద్య, ఉపాధి అవకాశాలను కేంద్రంగా చేసుకుని విద్యావంతుల మద్దతు కూడగట్టడం ఈ అభ్యర్థిత్వం వెనుక ఉన్న రాజకీయ లక్ష్యాల్లో ఒకటై ఉండవచ్చు.అయితే అభ్యర్థిత్వం ప్రకటించడం మాత్రమే సరిపోదు. పట్టభద్రుల సమస్యలపై స్పష్టమైన కార్యాచరణ, ఓటర్లతో సంబంధాలు, క్షేత్రస్థాయి ప్రచారం, పార్టీ నిర్మాణం ఎంతవరకు సమన్వయంతో సాగుతాయన్నది ఈ ఎన్నికల్లో కీలకంగా మారనుంది.

అసలైన కొలమానం.. కార్యాచరణే

కవిత ప్రస్తుత రాజకీయ పంథాలో అధ్యయనం, ప్రసంగాల్లో స్పష్టత, సామాజిక న్యాయంపై దృష్టి, ప్రజలతో ఆత్మీయ సంబంధాలు ప్రధాన అంశాలుగా కనిపిస్తున్నాయి. వీటితోపాటు స్వతంత్ర రాజకీయ గుర్తింపును నిర్మించుకోవడం, యువతను ఆకర్షించడం, బీసీ–బహుజన వర్గాల్లో మద్దతును విస్తరించడం, ఎన్నికలకు ముందే పార్టీ యంత్రాంగాన్ని బలోపేతం చేయడం వంటి లక్ష్యాలు కూడా రాజకీయ చర్చలోకి వస్తున్నాయి.అయితే రాజకీయ సందేశానికి ప్రజా మద్దతు లభించాలంటే మాటలకు మించి కార్యాచరణ అవసరం. ప్రజా సమస్యలపై నిరంతర పోరాటం, విధానపరమైన స్పష్టత, క్షేత్రస్థాయి నాయకత్వం, ఎన్నికల్లో ప్రజల స్పందన.. ఇవే తెలంగాణ రక్షణ సేన భవిష్యత్తు రాజకీయ ప్రస్థానాన్ని ప్రభావితం చేసే అంశాలు. కవిత తన ఆలోచనలను ఎంత సమర్థంగా ప్రజా కార్యాచరణగా మలుస్తారన్నదే ఆమె కొత్త రాజకీయ పంథాకు అసలైన పరీక్షగా నిలవనుంది.

ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి వ్యాఖ్యలపై చర్యలు తప్పవు

అనిరుధ్ రెడ్డికి త్వరలోనే నోటీసులు జారీ చేసే అవకాశం ఉందని సూచించారు. "జడ్పర్లలో నేను చస్తేనే బిల్లులు వస్తాయంటే... నియోజకవర్గ అభివృద్ధి కోసం చనిపోవడానికైనా సిద్ధం" అని అనిరుధ్ రెడ్డి ఇటీవల తీవ్ర వ్యాఖ్యలు చేశారు. సొంత ప్రభుత్వాన్ని ఇరుకున పెట్టేలా ఉన్న ఈ వ్యాఖ్యలను పార్టీ అధిష్ఠానం సీరియస్ గా తీసుకుంది. ఈ వ్యాఖ్యలపై మహేశ్ గౌడ్ స్పందిస్తూ... నిధుల కొరత ఒక్క జడ్పర్లలోనే కాకుండా రాష్ట్రవ్యాప్తంగా పలుచోట్ల ఉందని, ఇలా మాట్లాడటం సరికాదని హితవు పలికారు. ఈ అంశాన్ని పార్టీ క్రమశిక్షణ కమిటీ క్షుణ్ణంగా పరిశీలిస్తుందని తెలిపారు. నవంబర్ 1న ఢిల్లీలో జరిగే కాంగ్రెస్ ర్యాలీకి కార్యకర్తలను తరలించేందుకు ప్రత్యేక రైళ్ల కోసం దరఖాస్తు చేస్తే, దక్షిణ మధ్య రైల్వే సాకులు చెప్పి తిరస్కరిస్తోందని మహేశ్ గౌడ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. రాహుల్ గాంధీ పేరు చెబితేనే బీజేపీ వణికిపోతోందని, ఎన్ని అడ్డంకులు సృష్టించినా తెలంగాణ నుంచి కార్యకర్తలను ఢిల్లీకి తీసుకెళ్లి తీరుతామని ఆయన ధీమా వ్యక్తం చేశారు.

నేను అప్పుడు అలా మాట్లాడాల్సింది కాదు

హైదరాబాద్, అక్టోబర్ 29 (సింగిడి)

తెలంగాణ రాజకీయాల్లో ఆసక్తికర పరిణామం చోటు చేసుకుంది. మాజీ మంత్రి, కాంగ్రెస్ నాయకురాలు కొండా సురేఖ.. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌కు క్షమాపణ చెప్పారు. గతంలో ఆయనపై చేసిన వ్యక్తిగత, నిరాధారమైన వ్యాఖ్యలను వెనక్కి తీసుకుంటున్నట్లు సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్ 'ఎక్స్' వేదికగా ప్రకటించారు. ఈ పరిణామంతో ఆమె తిరిగి బీఆర్ఎస్‌లో చేరతారనే ఊహాగానాలు జోరందుకున్నాయి. అప్పట్లో ప్రతిపక్షంపై చేసిన రాజకీయ విమర్శల్లో భాగంగానే ఆ వ్యాఖ్యలు చేశానని, కేటీఆర్‌ను గానీ, ఆయన కుటుంబ సభ్యులను గానీ ఉద్దేశపూర్వకంగా కించపరిచే ఉద్దేశం తనకు లేదని సురేఖ తన పోస్టులో స్పష్టం చేశారు. ఆ వ్యాఖ్యలను పూర్తిగా ఉపసంహరించుకుంటున్నట్లు ఆమె పేర్కొన్నారు. ఇటీవల ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తన క్యాబినెట్ నుంచి కొండా సురేఖను తొలగించిన కొన్ని రోజులకే ఈ పరిణామం జరగడం గమనార్హం. సరైన వివరణ ఇవ్వకుండా తనను మంత్రి పదవి నుంచి తొలగించడంపై ఆమె తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. బీసీ మహిళను కావడం వల్లే తనను తప్పించారా అని కూడా ప్రశ్నించారు. ఈ నేపథ్యంలో కొండా సురేఖ, ఆమె భర్త మురళి కాంగ్రెస్‌ను వీడి తిరిగి సొంత గూటికి (బీఆర్ఎస్) చేరవచ్చని రాజకీయ వర్గాల్లో జోరుగా చర్చ జరుగుతోంది. కేటీఆర్‌తో ఉన్న పాత విభేదాలను పరిష్కరించుకుని, పార్టీలో చేరేందుకు మార్గం సుగమం చేసుకోవడంలో భాగంగానే ఈ క్షమాపణ చెప్పారని విశ్లేషకులు భావిస్తున్నారు. అయితే, ఈ పరిణామంపై బీఆర్ఎస్ నాయకత్వం నుంచి ఇంకా ఎలాంటి స్పందన రాలేదు.



క్రాప్ హాలిడే కాదు... కాంగ్రెస్‌కే హాలిడే ఇవ్వాలి

పంటలు ఎండుతుంటే.. మూసీకి లక్షన్నర కోట్లు!

ఓవైపు సాగునీరు అందక పంటలు ఎండిపోతుంటే.. మరోవైపు మూసీ సుందరీకరణకు రూ.1.50 లక్షల కోట్లు ఖర్చు చేయాలనుకోవడం ఏమిటని కేటీఆర్ ప్రశ్నించారు. డీపీఆర్ లేకుండానే భారీ ప్రాజెక్టు పేరుతో దోపిడీకి స్కెచ్ వేశారని ఆరోపించారు. తాగు, సాగునీటి సమస్యలు పరిష్కరించకుండా సుందరీకరణకు ప్రాధాన్యం ఇవ్వడం ప్రభుత్వ ప్రాధాన్యతలపై అనుమానాలు కలిగిస్తోందన్నారు. మూసీ ప్రాజెక్టును నిలిపివేసి, ఆ నిధులను రైతుల ఉపశమనానికి, ప్రజా సంక్షేమానికి వినియోగించాలని డిమాండ్ చేశారు.మూసీ బాధితుల గోడు వినకుండా, ప్రజాభిప్రాయ సేకరణలో వారి గొంతు నొక్కుతున్నారని విమర్శించారు. మూసీ ప్రాజెక్టుపై ప్రభుత్వం సమగ్ర వివరాలు వెల్లడించాలని, ప్రజలకు జవాబుదారీగా వ్యవహరించాలని కోరారు.

ఇది ప్రకృతి కరువు కాదు.. కాంగ్రెస్ తెచ్చిన కరువు!

రైతుబంధు నిధులు పూర్తిస్థాయిలో అందకపోవడం, సాగునీటి కొరత, విద్యుత్ సమస్యలు రైతులను ఇబ్బందులకు గురిచేస్తున్నాయని కేటీఆర్ అన్నారు. రైతులు తమ పంటలను తామే కాపాడుకోవాల్సిన పరిస్థితి ప్రభుత్వ వైఫల్యానికి నిదర్శనమని పేర్కొన్నారు. పెండింగ్ రైతు

రక్తదానం ప్రాణదానంతో సమానం

ఎస్పీ స్నేహ మెహ్రో





వికారాబాద్ ప్రతినిధి, అక్టోబర్ 29(సింగిడి): పోలీస్ ఫ్లాగ్ డే కార్యక్రమాల్లో భాగంగా విధి నిర్వహణలో తమ ప్రాణాలను త్యాగం చేసిన పోలీస్ అమరవీరులకు ఘన నివాళులర్పిస్తూ వికారాబాద్ జిల్లా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో వికారాబాద్ పట్టణంలోని కొండ బాలకృష్ణారెడ్డి ఫంక్షన్ హాల్‌లో భారీ ఎత్తున మెగా రక్తదాన శిబిరాన్ని బుధవారం నిర్వహించారు. జిల్లా ఎస్పీ శ్రీమతి స్నేహ మెహ్రో ఈ కార్యక్రమంలో పాల్గొని రక్తదాన శిబిరాన్ని పరిశీలించి, రక్తదానం చేస్తున్న దాతలను అభినందించారు. సమాజంలో శాంతిభద్రతల పరిరక్షణ, ప్రజల ప్రాణాలు, ఆస్తుల రక్షణ కోసం విధులు నిర్వర్తిస్తూ అమరులైన పోలీసువీరుల త్యాగాలను స్మరించుకోవడం, వారి ఆశయాలకు అనుగుణంగా సామాజిక సేవా కార్యక్రమాలు చేపట్టడం ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశమని జిల్లా పోలీస్ శాఖ పేర్కొంది. పోలీస్ ఫ్లాగ్ డే సందర్భంగా అమరవీరుల త్యాగాలను ప్రజలకు గుర్తుచేస్తూ, ఆపదలో ఉన్నవారికి ప్రాణదానం చేసే రక్తదానం వంటి సేవా కార్యక్రమాల ద్వారా సమాజానికి ఉపయోగపడేలా ఈ శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ స్నేహ మెహ్రో మాట్లాడుతూ, విధి నిర్వహణలో తమ ప్రాణాలను సైతం లెక్కచేయకుండా ప్రజల రక్షణ కోసం పోరాడి అమరులైన పోలీసు వీరుల త్యాగాలు వెలకట్టలేనివని అన్నారు. వారి త్యాగాలను స్మరించుకోవడం అంటే కేవలం నివాళులు అర్పించడం మాత్రమే కాదని, వారు ఆశించిన సురక్షితమైన, శాంతియుతమైన సమాజ నిర్మాణానికి ప్రతి ఒక్కరూ తమ వంతు బాధ్యతగా కృషి చేయాలని సూచించారు. రక్తదానం ఒక గొప్ప మానవతా సేవ అని, ప్రమాదాలు, అత్యవసర వైద్య పరిస్థితులు, శస్త్రచికిత్సలు, ఇతర అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న రోగులకు సకాలంలో రక్తం అందించడం ద్వారా వారి ప్రాణాలను కాపాడవచ్చని ఎస్పీ అన్నారు. ఒక వ్యక్తి చేసే రక్తదానం అవసరంలో ఉన్నవారికి జీవించే అవకాశాన్ని కల్పిస్తుందని, ఆరోగ్య పరిస్థితులు అనుకూలంగా ఉన్న ప్రతి ఒక్కరూ స్వచ్ఛందంగా రక్తదానానికి ముందుకు రావాలని పిలుపునిచ్చారు.

పోలీస్ ఫ్లాగ్ డే కార్యక్రమాల ద్వారా పోలీసు అమరవీరుల త్యాగాలను స్మరించుకోవడంతో పాటు, ప్రజల్లో సామాజిక బాధ్యత, సేవాభావం, మానవతా విలువలను పెంపొందించడమే లక్ష్యమని తెలిపారు. పోలీస్ శాఖ ప్రజల భద్రతకే కాకుండా, ప్రజల సంక్షేమం కోసం కూడా నిరంతరం కృషి చేస్తుందని అన్నారు. ఈ సందర్భంగా రక్తదానం చేసిన వారిని జిల్లా ఎస్పీ ప్రత్యేకంగా అభినందించి, వారికి ప్రశంసాపత్రాలు అందజేశారు. అలాగే రక్తదాన శిబిరం విజయవంతం కావడానికి సహకరించిన వైద్యులు, వైద్య సిబ్బంది, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, విద్యార్థులు, యువతకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మొత్తం 467 యూనిట్ల రక్తాన్ని సేకరించడం జరిగింది. ఈ రక్తదాన శిబిరంలో రెడ్ క్రాస్, తలసేమియా, సికిల్ సెల్ సొసైటీ ప్రతినిధులతో పాటు, వికారాబాద్ ప్రభుత్వ ఆసుపత్రి, తాండూరు ప్రభుత్వ ఆసుపత్రి సిబ్బంది పాల్గొని సహకరించారు. ఈ కార్యక్రమం లో జిల్లా అదనపు ఎస్పీ రాజేష్ మీనా, వికారాబాద్ డిఎస్పి అంజయ్య, ఏఆర్ డిఎస్పి వీరేష్, వికారాబాద్ టౌన్ ఇన్స్పెక్టర్ రఘు కుమార్, మోమిన్ పేట్ సిఐ వెంకట్, ధరూర్ సిఐ రఘు రాములు, తాండూర్ ఇన్స్పెక్టర్ పరమేశ్వర్, కరణ్ కోట్ సిఐ ప్రవీణ్ కుమార్, ఎస్ఐ లు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

చివరి యాత్ర మజిలీల అభివృద్ధికి మరిన్ని ప్రణాళికలు

- స్మశాన వాటికలను అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తాం
- డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మల్లెపూల శ్రీకాంత్ యాదవ్



జవహర్ నగర్, అక్టోబర్ 29(సింగిడి): చివరి యాత్ర మజిలీల అభివృద్ధికి మరిన్ని ప్రణాళికలు రూపొందిస్తామని చంద్రపురి కాలనీ డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మల్లెపూల శ్రీకాంత్ యాదవ్ పేర్కొన్నారు. మల్కాజ్గిరి మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని కీసర సర్కిల్ జవహర్ నగర్ చంద్రపురి కాలనీ డివిజన్ వెంకటేశ్వర కాలనీలో హిందూ స్మశాన వాటికలో 11 లక్షల రూపాయలతో బుధవారం అభివృద్ధి పనులకు మాజీ సర్పంచ్ కారింగుల శంకర్ గౌడ్ తదితర పార్టీ శ్రేణులతో కలిసి శ్రీకాంత్ యాదవ్ శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా శ్రీకాంత్ యాదవ్ మాట్లాడుతూ స్మశాన వాటికలను(చివరి యాత్ర మజిలీలను) మరింతగా అభివృద్ధి చేసేందుకు ప్రణాళికలు రూపొందిస్తున్నామని తెలిపారు. జవహర్ నగర్‌లోని వైకుంఠధామాలలో తాగడానికి మంచినీరు, నీడనిచ్చే షెడ్లు మరుగుదొడ్లు, విద్యుత్ దీపాలు తదితర మౌలిక వసతుల కల్పనకు మా ప్రభుత్వం కట్టుబడి ఉందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ గొడుగు వేణు, సీనియర్ నాయకులు రజిత గోపాల్, మాజీ సర్పంచ్ కారింగుల శంకర్ గౌడ్, కారంగుల రాజు గౌడ్, ఉపాధ్యక్షుడు చిట్టిబాబు, సామాజిక సేవకులు ప్రధాన కార్యదర్శి బూడిద వెంకటేష్, జోగి సునీత, మాధవరెడ్డి, కోశాధికారి అశోక్ గుప్తా, ఎస్సీ సెల్ అధ్యక్షుడు రాహుల్ కదం, నాయకులు సాయికృష్ణ, బబ్లు ముదిరాజ్, భాస్కర్ గౌడ్, కిషోర్, మంజుల, రవి, శ్రీరామ్, రాజు నిర్వాహకులు యాదయ్య, యాదగిరి, ముత్యాలు పాల్గొన్నారు.

ఢిల్లీ ధర్నాకు నాయకులు హాజరు

- జాబితాను మహేష్ కుమార్ గౌడ్ కు అందజేసిన కొలన్ హన్మంత్ రెడ్డి



కుత్బుల్లాపూర్, అక్టోబర్ 29(సింగిడి): ఆల్ ఇండియా కాంగ్రెస్ కమిటీ (ఎఐసిసి) ఆధ్వర్యంలో నవంబర్ 1వ తేదీన ఢిల్లీలోని చారిత్రాత్మక రాంలీల మైదానంలో భారీ ఎత్తున జరగబోయే ఓట్ బచావో -- దేశ్ బచావో ధర్నా కార్యక్రమానికి కుత్బుల్లాపూర్ నియోజకవర్గం నుండి భారీగా క్యాడర్ తరలివెళ్తోంది. ఈ ధర్నాను విజయవంతం చేసేందుకు కుత్బుల్లాపూర్ నియోజకవర్గ ఇంచార్జి కొలన్ హన్మంత్ రెడ్డి, టీపీసీసీ మాజీ ప్రధాన కార్యదర్శి నర్స భూపతి రెడ్డి ఆధ్వర్యంలో ముమ్మర ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ క్రమంలో నియోజకవర్గం నుండి ఢిల్లీ ధర్నాలో పాల్గొనడానికి వెళ్తున్న 150 మంది కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, ముఖ్య కార్యకర్తల అధికారిక పేర్ల జాబితాను బుధవారం నాయకులు సిద్ధం చేశారు. ఈ లిస్ట్‌ను కుత్బుల్లాపూర్ నియోజకవర్గ ఇంచార్జి కొలన్ హన్మంత్ రెడ్డి టీపీసీసీ అధ్యక్షులు బొమ్మ మహేష్ కుమార్ గౌడ్ ను మర్యాదపూర్వకంగా కలిసి అందజేశారు. ఈ సందర్భంగా నియోజకవర్గంలో పార్టీ బలోపేతం, ఢిల్లీ ధర్నాకు సంబంధించిన ఏర్పాట్లపై టీపీసీసీ అధ్యక్షులతో వారు చర్చించారు. కుత్బుల్లాపూర్ నియోజకవర్గం నుండి కాంగ్రెస్ శ్రేణులు పెద్ద ఎత్తున తరలివచ్చి ఏఐసీసీ పిలుపునిచ్చిన ధర్నాను విజయవంతం చేస్తామని ఈ సందర్భంగా నాయకులు ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ కాంగ్రెస్ సీనియర్ నాయకులు, ముఖ్య కార్యకర్తలు పాల్గొన్నారు.

పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్ రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరిన నాయకులు



వికారాబాద్ ప్రతినిధి, అక్టోబర్ 29 (సింగిడి): జిల్లాలో పరిధిలోని కుల్కచర్ల మండలంలో బీఆర్ఎస్,బీజేపీ పార్టీలకు చెందిన నాయకులు కాంగ్రెస్ పార్టీలో చేరారు. మండలంలోని పటేల్ చెరువు తండాకు చెందిన బీఆర్ఎస్ సర్పంచ్ శాంతి తుల్జారాం తన అనుచరులతో కలిసి పరిగి ఎమ్మెల్యే,టీపీసీసీ ట్రైనింగ్ కమిటీ చైర్మన్ (సర్) డాక్టర్ టి.రామ్మోహన్ రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో బుధవారం చేరారు. అదేవిధంగా బీజేపీ కిసాన్ మోర్చా ఎగ్జిక్యూటివ్ మెంబర్ ఏదుల సంతోష్ గౌడ్ తన అనుచరులతో కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వారికి కాంగ్రెస్ పార్టీ కండువాలు కప్పి సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం కాంగ్రెస్ పార్టీలో చేరిన నాయకులు మాట్లాడుతూ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలకు ఆకర్షితులయ్యామని తెలిపారు. పరిగి నియోజకవర్గ అభివృద్ధి కోసం ఎమ్మెల్యే డాక్టర్ టి. రామ్మోహన్ రెడ్డి చేస్తున్న కృషిని గుర్తించి కాంగ్రెస్ పార్టీలో చేరాలని నిర్ణయించుకున్నట్లు చెప్పారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రజల సంక్షేమం,రాష్ట్ర అభివృద్ధికి పెద్దపీట వేస్తూ అనేక కార్యక్రమాలను అమలు చేస్తోందని తెలిపారు. ప్రజలకు మెరుగైన సేవలు అందించడంతో పాటు నియోజకవర్గంలోని గ్రామాల అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తున్నామని పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీ విధానాలు, ప్రభుత్వ సంక్షేమ పథకాల పట్ల ఆకర్షితులై పార్టీలో చేరుతున్న నాయకులు, కార్యకర్తలకు సముచిత గుర్తింపు ఉంటుందని తెలిపారు.

మాదకద్రవ్యాల రహిత సమాజ నిర్మాణమే యువత లక్ష్యం

రెడ్ క్రాస్ తెలంగాణ ఆధ్వర్యంలో కేఎం పాండు మెమోరియల్ కళాశాలలో ప్రతిజ్ఞ



కుత్బుల్లాపూర్, అక్టోబర్ 29(సింగిడి): కుత్బుల్లాపూర్ నియోజక వర్గం ఎస్ కే యం పి యం ప్రభుత్వ వృత్తి విద్య జూనియర్ కళాశాలలో బుధవారం ఇండియన్ రెడ్ క్రాస్ తెలంగాణ హైదరాబాద్ జిల్లా చైర్మన్ ఏవి రావు, ట్రెజరర్ నరసింహారెడ్డి , కోటి ధర్మ తేజ, రామకృష్ణ, రవికుమార్ ఆధ్వర్యంలో వెలుగు ఎడ్యుకేషన్ ట్రస్ట్ వ్యవస్థాపకులు నారాయణరావు, మాదకద్రవ్యాల వ్యతిరేక నినాదాలు, మాదకద్రవ్యాల రహిత సమాజం మన అందరి బాధ్యత అంటూ నినాదాలు చేశారు. మత్తు పదార్థాలకు దూరం, విజయానికి మార్గము, డ్రగ్స్ కి బానిస కావొద్దు, మీ జీవితాన్ని నాశనం చేసుకోవద్దు, డ్రగ్స్ ని వదిలివేయండి మీ కళలను నిజం చేసుకోండి ,అని కళాశాల విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు . ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ మైమున్ విద్యార్థిని విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ విద్యార్థి దశ అనేది జీవితానికి పునాది వేసుకునే అత్యంత విలువైన సమయం అన్నారు. మీ జీవితంలో ఎప్పుడైనా ఎవరు డ్రగ్స్ తీసుకోమని ప్రోత్సహించినా ధైర్యంగా నో అని చెప్పండి. చెడు స్నేహాలకు దూరంగా ఉండండి, మంచి స్నేహితులను ఎంచుకోండి, మన కళాశాల విద్యార్థులుగా మన అందరికీ ఒక బాధ్యత ఉంది. మత్తు పదార్థాలకు దూరంగా ఉండడమే కాకుండా, ఇతరులకు అవగాహన కల్పించాలని సూచించారు. మన కళాశాలను మన సమాజాన్ని మాదక ద్రవ్యాల రహితంగా మార్చడానికి కృషిచేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో వెలుగు ఎడ్యుకేషన్ ట్రస్ట్ వ్యవస్థాపకులు నారాయణరావు, కళాశాల అధ్యాపక బృందం పాల్గొన్నారు.

విద్యార్థులు చదువుతోపాటు క్రీడలు, మార్షల్ ఆర్ట్స్ లోనూ రాణించాలి

కరాటే గ్రాండ్ బెల్ట్ ఎగ్జామ్ సర్టిఫికెట్ల ప్రదానోత్సవంలో హీరో సుమన్‌తో కలిసి పాల్గొన్న ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి



కాప్రా, అక్టోబర్ 29(సింగిడి): కాప్రా సర్కిల్ చర్లపల్లి లో కరాటే మల్లికార్జున్ గౌడ్, సాయి కిరణ్ అధ్వర్యంలో నిర్వహించిన ఎస్ ఎస్ కే మార్షల్ ఆర్ట్స్ అకాడమీ ఆధ్వర్యంలోని గ్రాండ్ బెల్ట్ ఎగ్జామ్-సర్టిఫికెట్ల ప్రదానోత్సవ కార్యక్రమంకు ముఖ్య అతిదులుగా ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి, ప్రముఖ సినీ నటుడు హీరో సుమన్ లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కరాటే, మార్షల్ ఆర్ట్స్‌లో శిక్షణ పొందుతున్న విద్యార్థులకు బెల్టులు, సర్టిఫికెట్లు అందజేసి వారిని ప్రోత్సహించారు. మార్షల్ ఆర్ట్స్ ద్వారా విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసం, క్రమశిక్షణ, శారీరక దృఢత్వం, ఆత్మరక్షణ నైపుణ్యాలు పెంపొందుతాయని అన్నారు. విద్యార్థులు చదువుతో పాటు క్రీడలు, మార్షల్ ఆర్ట్స్‌లోనూ రాణించి ఉన్నత లక్ష్యాలను సాధించాలని ఆకాంక్షించారు. అనంతరం ఈ కార్యక్రమ నిర్వాహకులను అభినందిస్తూ, విద్యార్థుల భవిష్యత్తుకు, శుభాకాంక్షలు తెలిపారు.

గంగ కత్వ కాలువ ఆధునీకరణకు నిధులు మంజూరు

నవంబర్‌లో మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, దామోదర్ రాజనర్సింహా, వివేక్ ల చేతుల మీదుగా పనులకు శంకుస్థాపన

2028 జూన్ నెలలో సీఎం రేవంత్ రెడ్డితో ప్రారంభం



సంగారెడ్డి బ్యూరో, అక్టోబర్ 29(సింగిడి): గంగకత్వ ప్రాజెక్టు, కాలువ ఆధునీకరణకు రూ. 37 కోట్లు మంజూరయన నేపథ్యం లో జగ్గారెడ్డి గంగ కత్వ ప్రాజెక్ట్ ను పరిశీలించారు. సదాశివపేట మండలం సూరారం గ్రామం లోని గంగకత్వ ప్రాజెక్టును పరిశీలించిన ఆయన, సాగునీటి శాఖ అధికారులు, ఆయకట్టు గ్రామాల రైతులు, స్థానిక నాయకులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జగ్గారెడ్డి మాట్లాడుతూ గంగకత్వ కాలువ పరిధిలోని 11 గ్రామాల్లో 3,300 ఎకరాల ఆయకట్టుకు సాగునీరు అందించే అవకాశం ఉందన్నారు. సదాశివపేట మండలంలో సుమారు 16 కిలోమీటర్ల మేర విస్తరించిన కాలువకు 28 చెరువులు అనుసంధానమై ఉన్నాయని చెప్పారు. కాలువను ఆధునీకరించి, చివరి ఆయకట్టు వరకు నీరందించడమే లక్ష్యమని పేర్కొన్నారు. ఆధునీకరణ నిధుల కోసం రెండేళ్ల క్రితం మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డిని కోరానని, అధికారులతో పలుమార్లు సమీక్షలు నిర్వహించానని తెలిపారు. రూ. 37 కోట్లు మంజూరు చేస్తూ ఉత్తర్వులు జారీ చేసిన మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. తాను ఎమ్మెల్యేగా లేకపోయినా రైతుల ప్రయోజనాల కోసం నిధులు తీసుకువచ్చానన్నారు. ఏడో నిజాం కాలంలో నిర్మించిన కాలువను తిరిగి ఆధునీకరించే అవకాశం రావడం సంతోషంగా ఉందని పేర్కొన్నారు. రైతుల అవసరాలను దృష్టిలో ఉంచుకుని పనులు చేపట్టాలని, కాంట్రాక్టర్ల ప్రయోజనాలకు ప్రాధాన్యం ఇవ్వొద్దని అధికారులకు సూచించారు

-లీకేజీల నివారణకు చర్యలు..

కాలువ లైనింగ్, దెబ్బతిన్న భాగాల మరమ్మతులు, పక్కలకు సీసీ లైనింగ్, తూముల పునరుద్ధరణ, వంతెనల వెడల్పు పెంపు తదితర పనులపై సమీక్షించారు. కాలువ పొడవునా తనిఖీలకు ఉపయోగపడే దారిని పునరుద్ధరించాలని సూచించారు. కాలువ నీరు చెరువులకు సక్రమంగా చేరేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. వర్షాకాలంలో కాలువలు తెగిపోతున్నాయని చందాపూర్ గ్రామస్థులు తెలిపారు. మిలిగిరిపేట పరిధిలో వాగుల్లో పూడిక తొలగించాలని కోరారు. కాలువలు సరిగా లేక నీరు గ్రామంలోకి వస్తోందని పొట్పల్లి వాసులు వివరించారు. ప్రాజెక్టు చివరన ఉన్న తమ గ్రామానికి నీరందడం లేదని యెన్పేపల్లి రైతులు తెలిపారు. ప్రధాన కాలువ తూము వద్ద లీకేజీలతో నీరు వృథా అవుతోందని చెప్పారు. ఆత్మకూరు పరిధిలో లీకేజీలను అరికట్టి చెరువులకు నీరు మళ్లించాలని, అంకెన్‌పల్లిలో కాలువ ఆకృతి సవరణ, గట్ల బలోపేతం పనులు చేపట్టాలని స్థానికులు కోరారు. సమస్యలను పరిశీలించి అవసరమైన పనులకు అంచనాలు రూపొందించాలని జగ్గారెడ్డి అధికారులకు సూచించారు.

-వాగుపై ఏడు చెక్‌డ్యామ్‌లకు ప్రతిపాదనలు..

గంగకత్వ ఆధునీకరణకు అదనంగా వాగుపై ఏడు చోట్ల చెక్‌డ్యామ్‌ల నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధమవుతున్నాయని జగ్గారెడ్డి తెలిపారు. వికారాబాద్ జిల్లా మర్పల్లి ప్రాంతం నుంచి గంగకత్వకు వచ్చే వాగును అభివృద్ధి చేస్తే నీటి ప్రవాహం పెరిగే అవకాశం ఉందా అని అధికారులను అడిగి తెలుసుకున్నారు. వాగు, ప్రాజెక్టులో పూడిక తొలగింపునకు ప్రతిపాదనలు రూపొందించాలని సూచించారు. ప్రాజెక్టులో ఆరు నుంచి ఏడు అడుగుల మేర పూడిక తొలగించే అవకాశం ఉందని అధికారులు తెలపగా, సాంకేతికంగా ఎంత వరకు సాధ్యమో పరిశీలించాలని కోరారు. కొల్కూర్--నిజాంపూర్ మధ్య మంజీరా బ్యాక్‌వాటర్‌తో పంటలు మునుగుతున్నాయని రైతులు తెలిపారు. అక్కడ చెక్‌డ్యామ్ నిర్మించాలని కోరగా, సాధ్యాసాధ్యాలను పరిశీలించి అంచనాలు సిద్ధం చేయాలని అధికారులకు సూచించారు.

-2028 నాటికి పనుల పూర్తికి ప్రణాళిక..

దీపావళి తర్వాత శంకుస్థాపన జరిగేలా చూస్తామని జగ్గారెడ్డి తెలిపారు. డిసెంబర్‌లోపు టెండర్ల ప్రక్రియ పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించినట్లు చెప్పారు. 2028 నాటికి పనులు పూర్తి చేసేలా ప్రణాళికలు రూపొందిస్తున్నామని, పనులు పూర్తయ్యాక ముఖ్యమంత్రి చేతుల మీదుగా ప్రారంభించేందుకు కృషి చేస్తానన్నారు. డిసెంబర్‌లో మరోసారి ప్రాజెక్టును సందర్శించి పనుల పురోగతిని సమీక్షిస్తానని తెలిపారు. నిధులు, పనుల మంజూరు కోసం కృషి చేయడమే తన బాధ్యతని, శంకుస్థాపన, ప్రారంభోత్సవ కార్యక్రమాలను అధికారులు ప్రోటోకాల్ ప్రకారం నిర్వహిస్తారని పేర్కొన్నారు. చిన్నప్పటి నుంచి ఈ వాగుతో తనకు అనుబంధం ఉందని, తన భార్య స్వగ్రామం తాటిపల్లి కావడంతో తరచూ ఇక్కడికి వచ్చేవాడినని గుర్తుచేసుకున్నారు.

టిపిసిసి అధ్యక్షుడిని కలిసిన కాంగ్రెస్ పార్టీ నాయకులు



సిద్దిపేట ప్రతినిధి అక్టోబర్ 29(సింగిడి): టీపీసీసీ అధ్యక్షులు, ఎమ్మెల్సీ మహేష్ కుమార్ గౌడ్‌ని హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సన్మానించారు. టీ పిసిసి స్టేట్ జనరల్ సెక్రెటరీ గాడి పల్లి శ్రీనివాస్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ సిద్ధిపేట జిల్లా ఉపాధ్యక్షులు ఎల్లా శ్రీనివాస్ రెడ్డి,కార్యక్రమం లో బాలకిషన్, సురేందర్ రెడ్డి మధు,రాజు శ్రీహరి,చందు, ,శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజాభిమానమే కొండంత బలం

నర్సారెడ్డి శ్రీనివాస్ రెడ్డికి పలువురు జన్మదిన శుభాకాంక్షలు వెల్లువ



కుత్బుల్లాపూర్, అక్టోబర్ 29(సింగిడి): కుత్బుల్లాపూర్ నియోజకవర్గం, దుండిగల్ సర్కిల్ ఘౌరంపేట్ మాజీ కౌన్సిలర్ నర్సారెడ్డి శ్రీనివాస్ రెడ్డి జన్మదిన వేడుకలు కుటుంబ సభ్యులు ఆత్మీయులు అభిమానులు స్థానిక ప్రజల సమక్షంలో ఘనంగా నిర్వహించారు. నర్సారెడ్డి శ్రీనివాస్ రెడ్డి పుట్టినరోజు సందర్భంగా నియోజకవర్గ వ్యాప్తంగా శుభాకాంక్షలు వెల్లువెత్తాయి. బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, యువకులు, అభిమానులు, స్థానిక ప్రజలు ఆయనకు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ రెడ్డి ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో జీవిస్తూ రాబోయే కాలంలో మరిన్ని ఉన్నత పదవులు పొంది ప్రజా సేవలో మరెన్నో జన్మదిన వేడుకలు జరుపుకోవాలని, ప్రజలకు మరింత సేవ చేయాలని పలువురు ఆకాంక్షించారు.

హరీష్ రావు చేతుల మీదుగా హలో తెలంగాణ యాప్ ప్రారంభం

సిద్దిపేట ప్రతినిధి అక్టోబర్ 29(సింగిడి): తెలంగాణ ప్రాంత ప్రజలకు మరింత సమాచారాన్ని అందించడం కోసం ఉదయ్ కిరణ్ రెడ్డి తయారు చేసిన హలో తెలంగాణ సోషల్ మీడియా యాప్ ను మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీష్ రావు బుధవారం సిద్దిపేటలో ప్రారంభించారు. తెలంగాణ ప్రజలను, తెలంగాణ ప్రాంతాలను, తెలంగాణ ఆలోచనలను కలిపే సోషల్ మీడియా వేదిక యాప్ ను ఆయన ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్మన్ రాజనర్సు సుడా మాజీ చైర్మన్ రవీందర్ రెడ్డి ,బిఆర్ఎస్ రాష్ట్ర నాయకులు మచ్చ వేణుగోపాల్ రెడ్డి, గుండు భూపేష్ , పాల సాయిరాం, కొండం సంపత్ రెడ్డి, శ్రీహరి యాదవ్ , ఎడ్ల సోమిరెడ్డి కుంభం ఎల్లారెడ్డి, రమేష్ గౌడ్, తిరుపతి, కనకరాజు, జర్నలిస్టులు ఆకుల శ్రీనివాస్ రెడ్డి, కూతురు రాజిరెడ్డి రమణారావు, రంగ దాంపల్లి శ్రీనివాస్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.



సిద్దిపేటలో తెలంగాణ రక్షణ సేన తొలి జిల్లా కార్యాలయం

నవంబర్ 13న కల్వకుంట్ల కవిత చేతుల మీదుగా భూమిపూజ

సిద్దిపేట అక్టోబర్ 29(సింగిడి): తెలంగాణ రక్షణ సేన అధినేత్రి కల్వకుంట్ల కవిత త్వరలో సిద్దిపేటలో పర్యటించనున్నారు. ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్రంలోనే మొట్టమొదటి ూనా జిల్లా పార్టీ కార్యాలయ నిర్మాణానికి నవంబర్ 13న ఆమె భూమిపూజ నిర్వహించనున్నట్లు ూనా సిద్దిపేట జిల్లా అధ్యక్షుడు లోక రవిచంద్ర వెల్లడించారు. సిద్దిపేట ప్రెస్ క్లబ్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో ూనా నియోజకవర్గ ఇన్‌చార్జి చల్లారం మల్లారెడ్డితో కలిసి ఆయన మాట్లాడారు.

సామాజిక తెలంగాణే లక్ష్యం

సామాజిక తెలంగాణ సాధనే లక్ష్యంగా తెలంగాణ రక్షణ సేన ప్రజల్లోకి వెళ్తుందని లోక రవిచంద్ర తెలిపారు. సిద్దిపేట జిల్లాలో పార్టీ విస్తరణకు, ప్రజలకు సేవ చేసే అవకాశం కల్పించిన కల్వకుంట్ల కవితకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం కోసం ప్రజాక్షేత్రంలో నిరంతరం పోరాటం చేస్తామని స్పష్టం చేశారు. జిల్లాలో బీఆర్ఎస్ పాలనలో నిరుద్యోగులు, నిర్వాసితులు, వలసలు పెరిగిపోయాయన్నారు. పట్టుమని వందమందికి ఉపాధి కల్పించే చర్యలు తీసుకోలేదన్నారు. ప్రాజెక్టుల కోసం బలవంతంగా భూములు లాక్కున్నా ప్రాజెక్టుల నిర్మాణం పూర్తికాలేదని, నిర్వాసితులకు పరిహారం పూర్తిగా అందలేదని చెప్పారు. చదువుకున్న వాళ్లు అమెరికాకు, చదువుకోనోళ్లు దుబాయ్ కి, ఏమీ లేనివాళ్లు సిద్దిపేట లో ఆటోలు నడుపుకునే పరిస్థితి ఉందన్నారు. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను క్షేత్రస్థాయిలో గుర్తించి, వాటి పరిష్కారం కోసం పార్టీ తరఫున పోరాడుతామని తెలిపారు. TRS సిద్దిపేట జిల్లా అధ్యక్షుడిగా నూతనంగా ఎంపికైన లోక రవిచంద్రను ఈ సందర్భంగా పార్టీ నాయకులు, కార్యకర్తలు శాలువాలతో ఘనంగా సత్కరించారు. ఈ సమావేశంలో ూనా నాయకులు శివరాత్రి శ్రీనివాస్, రాజు, అనిల్, ఖాదర్, గౌస్, షేక్ అలీ తదితరులు పాల్గొన్నారు.

ఇంద్రవెల్లి సభకు భారీగా తరలిరావాలి

ఈ నెల 30న ఆదిలాబాద్ జిల్లా ఇంద్రవెల్లిలో ూనా పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించనున్న 'పాంచజన్య సభ'కు సిద్దిపేట జిల్లా నుంచి పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని లోక రవిచంద్ర పిలుపునిచ్చారు.

శాశ్వత పరిష్కారమే ధ్యేయం: తపాస్ పల్లిలో భూ రీ-సర్వే

- జిల్లా కలెక్టర్ హైమావతి క్షేత్రస్థాయిలో పరిశీలన



కొమురవెల్లి ,అక్టోబర్ 29(సింగిడి): ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన భూ భారతి భూముల రీసర్వే ప్రక్రియను మండలంలోని తపాస్‌పల్లి గ్రామంలో సిబ్బందితో కలిసి జిల్లా కలెక్టర్ కె. హైమావతి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. బుధవారం క్షేత్రస్థాయి పరిశీలన జరిపిన సర్వే వివరాలను అధికారులను అడిగితెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ హైమావతి మాట్లాడుతూ భూ రీ-సర్వేను ఎలాంటి తప్పులకు ఆస్కారం లేకుండా సర్వేను వేగవంతంగా పూర్తిచేయాలని సిబ్బందిని ఈ సందర్భంగా ఆదేశించారు. ఈ భూ రీ-సర్వే ప్రక్రియలో ప్రజలు కూడా భాగస్వాములై సిబ్బందికి సమాచారం అందించి, సహకరించాలని కోరారు. భూ భారతి రీ-సర్వే కి రైతులు సహకరించాలని, దీని ద్వారా హద్దులు, సర్వే నెంబర్ బై నంబర్

Editorial

ఎడిటోరియల్

కళా తపస్వి శాంతారామ్

శాంతారాం రాజారాం వణకుద్రే (నవంబరు 18, 1901 – అక్టోబరు 30, 1990) భారత దేశపు చలన చిత్ర రంగంలో చరిత్ర సృష్టించిన అద్భుత చిత్ర నిర్మాత, దర్శకుడు, నటుడు వి. శాంతారామ్. ఆయన ఒక కళా తపస్వి. శాంతారామ్ దాదాపు ఏడు దశాబ్దాలుగా చిత్ర నిర్మాతగా వృత్తిని కలిగి చలనచిత్ర మాధ్యమాన్ని సాంఘిక మార్పుకు సాధనంగా వినియోగించుకోవడానికి ప్రయత్నం చేశారు. ప్రారంభ చిత్రనిర్మాతలలో ఆయన ఒక వైపు మానవతావాదాన్ని సమర్థించడానికి, మరోవైపు మూర్ఖత్వం మరియు అన్యాయాన్ని బహిర్గతం చేయడానికి చిత్రాలను విజయవంతంగా ఉపయోగించారు.



ఆయన "డా.కోట్నిస్ కీ అమర్ కహానీ" (1946), "అమర్ భూపాలి" (1951), "దో ఆంఖె బారహ్ హాథ్" (1957), "నవరంగ్" (1959), "దునియా నా మానే" (1937),"పింజ్రా" (1972) వంటి చిత్రాలతో అందరికి పరిచితుడు.

ఆయన తీసిన చిత్రాలన్నీ ఆణిముత్యాలే. ప్రతీ చిత్రంలో ఎదో ఒక కళకు ప్రాముఖ్యత ఇచ్చి నిర్మించారు' ఝనక్ ఝనక్ పాయల్ బాజేలో' నృత్యానికి, 'నవరంగ్' లో కవిత్వానికి, 'గీత్ గాయా పత్తరోన్' చిత్రంలో (తెలుగులో 'అమరశిల్పి జక్కన' చిత్రానికి ఆధారం. సాంఘిక చిత్రంగా మలిచారు) శిల్పానికి, ఇలా ఎన్నో కళలని దృశ్య కావ్యాలుగా మనకి అందించారు. వారి చిత్రాలలో పాటలు అమృత గుళికలు. 'జల్ బిన్ మచిలీ' చిత్రంలో ఒక పాము డాన్స్ చాలా అద్భుతం గా ఉంటుంది. అది మన తెలుగుచిత్రం 'అగ్నిపూలు' లో జయప్రద చేశారు. అంతే కాదు వారి చిత్రాలు సందేశాత్మకంగా ఉండి ప్రజలని ఆలోచింప జేసేలా ఉంటాయి. ఉదాహరణకి 'తూఫాన్ అవుర్ దియా' చిత్రంలో ఎన్ని కష్టాలు వచ్చినా ఎదుర్కొని నిలబడాలని, 'దో ఆంఖేన్ బారా హాత్' చిత్రంలో మంచితనంతో ఎంత దుర్మార్గులనైనా మార్చ వచ్చనీ, 'సుభా క తారా' చిత్రంలో వితంతు వివాహ సంస్కరణ గురించి చెప్పారు.. ఇలా ఎన్నో అద్భుత చిత్రాలు ఆయన దర్శకత్వంలో వెలువడ్డాయి.

డా వి.శాంతారామ్ మహా రాష్ట్ర లోని కొల్హాపూర్‌కు సమీప గ్రామంలో తేదీ-18-11-1901వ సంవత్సరంలో జన్మించారు. 1921లో నటుడిగా చిత్ర రంగ ప్రవేశం చేసిన ఆయన మూకీ, టాకీలు అన్నీ కలిపి 25 చిత్రాల్లో నటించారు. సుమారు 90 సినిమాలు నిర్మించారు. వీటిలో 55 సినిమాలకు స్వయంగా ఆయనే దర్శకత్వం కూడా వహించారు. కళాత్మక, వ్యాపార దృక్పథాలను మేళవించిన విలక్షణ దర్శకునిగా పేరుగాంచారు. అమరజ్యోతి, ఆద్మీ, దునియా న మానే, పడోసీ, స్త్రీ, అమర్ భూపాలీ, డా కోట్నిస్ కీ అమర్ కహానీ మొదలగు సినిమాలు శాంతా రామ్ దర్శకత్వంలో వచ్చిన కొన్ని ఆణి ముత్యాలు. నవరంగ్, గీత్ గాయా పత్థరోనే, ఝనక్ ఝనక్ పాయల్ బాజే మొ చిత్రాల్లో కళాకారుడి అంతరంగాన్ని, ఆవేదనను ఆవిష్కరించారు. 'శాంతారామ' అనే పేరుతో తన ఆత్మకథను రాసుకున్నారు. చిత్రపరిశ్రమకు ఆయన చేసిన సేవలను గుర్తిస్తూ... 1985లో కేంద్ర ప్రభుత్వం 'దాదా సాహెబ్ ఫాల్కే' అవార్డును బహూక రించింది. ఉత్తమ దర్శకుడికి ఫిల్మ్‌ఫేర్ అవార్డు (1957); దాదాసాహెబ్ ఫాల్కే అవార్డు; పద్మ విభూషణ్; నాగపూర్ విశ్వ విద్యాలయం నుండి గౌరవ డాక్టరేట్ పొందిన ఆయన అక్టోబరు 30, 1990 వ సంవత్సరంలో మరణించాడు.

రామ కిష్టయ్య సంగన భట్ల, సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్ కాలమిస్ట్...
9440585494

సజీవ స్వరూపాలు... వడ్డాది పాపయ్య చిత్రాలు

నేడు వడ్డాది పాపయ్య వర్ధంతి



తెలుగు చిత్రకళా ప్రపంచంలో సాటిలేని ప్రతిభావంతుడు వడ్డాది పాపయ్య. తన అపురూప చిత్రాలతో తెలుగు ప్రజల మనసుల్లో నిలిచిపోయిన సహజ కళాకారుడు అనేక మంది స్ఫూర్తి ప్రదాత. ఆయన చిత్రాలు తెలుగు సాహిత్యం, పౌరాణిక కథానికలు, గ్రామీణ జీవనశైలిని చక్కగా ప్రతిబింబించేలా ఉంటాయి.

వడ్డాది పాపయ్య 1921 సెప్టెంబర్ 10న శ్రీకాకుళం జిల్లాలో జన్మించారు. తండ్రి రామమూర్తి డ్రాయింగ్ టీచర్ కావడంతో చిన్ననాటి నుంచే చిత్రకళ పట్ల ఆయనకు మక్కువ కలిగింది. పాపయ్య పెరిగిన వాతావరణంలో కుంచెలు, రంగులతో కలిసిపోయే కళాజీవితం ఉన్నది. ఇది ఆయనలోని సృజనాత్మకతను పెంచింది.

పాపయ్య చిన్నప్పటినుంచి చిత్రకళ పట్ల ఆసక్తి చూపిస్తూ, వివిధ రూపాల్లో తన శైలిని అభివృద్ధి చేసుకున్నారు. చిన్ననాటి నుంచే గ్రామీణ జీవితం, ప్రకృతి దృశ్యాలు ఆయన చిత్రాలకు ప్రేరణగా నిలిచాయి.



రాజా రవివర్మ, దామెర్ల రామారావు ల చిత్రకళా తపస్సును ఆదర్శంగా ఎంచుకున్న పాపయ్య, అడవి బాపిరాజు నుంచి గొప్ప భావుకతను అంది పుచ్చుకున్నారు.

వడ్డాది పాపయ్య చిత్రకళలో ఒక కొత్త శైలికి నాంది పలికారు. ఆయన చిత్రం ప్రతి చిన్న విషయాన్ని స్వచ్ఛమైన, సహజమైన రూపంలో తీసుకు వస్తుంది. ఆయా చిత్రాలలో ప్రతీ రేఖ, ప్రతి రంగు చిత్రాన్ని మరింత ముద్రించే విధంగా ఉంటుంది. ఆయన చరిత్ర, పురాణ కథలు, సామాజిక అంశాలను అద్భుతంగా చిత్రించడంలో దిట్ట. వడ్డాది పాపయ్య రచించిన చిత్రాలలో రామాయణం, పంచతంత్రం, మహాభారతం వంటి పురాణ ఇతిహాసాలకు సంబంధించిన కథానికలు ముఖ్యంగా నిలిచాయి.



ఎగురుతున్న హనుమంతుడు, గోపికాకృష్ణుల రాసలీల, పార్వతి, శకుంతల, లక్ష్మి, ధనలక్ష్మి, శివపార్వతులు, గంగావతరణం మొదలైన పౌరాణిక ఊహాత్మక బొమ్మలను గీచారు.

ఆయన చిత్రాలు తెలుగు సాహిత్యానికి ఒక సజీవ రూపాన్ని సంతరింప చేశాయి. ప్రత్యేకించి పంచతంత్రం చిత్రాలు, పిల్లల హృదయాలను ఆకర్షించే విధంగా ఉంటాయి. పాపయ్య పురాణ గాథలను చిత్రించిన విధానం ద్వారా కథలు కళాత్మకంగా జీవింప జేయబడ్డాయి.

వడ్డాది పాపయ్య చిత్రాలు చూడగానే ఆకర్షిస్తాయి. ఆయన చిత్రాలలోని రంగుల వాడకం, కాంతి–చాయా ప్రభావాలు చూపించే సామర్థ్యం అత్యద్భుతంగా ఉంటాయి. ప్రత్యేకంగా గ్రామీణ దృశ్యాల చిత్రణలో ఆయన చూపిన శైలి చక్కని నైపుణ్యాన్ని ప్రతిబింబిస్తుంది. ప్రతి వ్యక్తి ముఖాల్లో భావాలను ప్రతిబింబించడంలో ఆయనకు ఉన్ననైపుణ్యం, ప్రతి దృశ్యాన్ని సహజంగా చిత్రించడంలో ప్రతిఫలిస్తుంది.

చిత్రకారుడిగా మాత్రమే కాకుండా, పాపయ్య పత్రికా రంగంలో కూడా తన ప్రతిభను చాటారు. తెలుగు పత్రికలు, మాసపత్రికలు ఆయన చిత్రాలతో అలంకరించ బడ్డాయి. ఈ పత్రికా బొమ్మలు ప్రజల మనసుల్లో శాశ్వతంగా నిలిచిపోయేలా ఆయన వాటిని తీర్చిదిద్దారు. పత్రికల్లోని ఆయన బొమ్మలు, ప్రత్యేకించి పౌరాణిక పాత్రలు, సాంప్రదాయ వస్త్రధారణ, ప్రాచీన జీవనశైలికి ఆయన విన్నూత్న రూపాన్ని అందించారు. రేరాణి, అభిసారిక, భారతి పత్రికలలో ప్రచురితమైన బొమ్మలలో ఒక సంచలన చిత్రకారుడుగా పత్రికా ప్రపంచానికి చేరువయ్యారు. తళ్ళలితంగా తెలుగు సినీ ప్రముఖుడు చక్రపాణి తమ సంస్థ ప్రచురణలైన చందమామ, యువ పత్రికలలో బొమ్మలు వేసే ఉద్యోగం ఇచ్చారు. ఒక్క "చందమామ" పత్రికలోనే దాదాపు మూడు దశాబ్దాల పర్యంతం తన సహజ శైలిలో బొమ్మలు చిత్రిస్తూ, ఒకే పత్రికలో కొనసాగటం తెలుగు పత్రికా రంగంలో ఒక పెద్ద రికార్డు. వడ్డాది పాపయ్య సాధారణంగా సరళమైన వ్యక్తిగా, స్నేహపూర్వక స్వభావంతో కళాభిమానులతో మెలిగేవారు. సరళమైన జీవిత శైలిని అనుసరించిన పాపయ్య, కళాభిమానులతో గడపడంలో ప్రత్యేక ఆనందం పొందేవారు. వడ్డాది పాపయ్యకు తెలుగు చిత్రకళాభిమానుల నుండి ఎల్లప్పుడూ ప్రశంసలు అందాయి. అతని చిత్రాలలో భావాలను స్పష్టంగా చూపించడం, ప్రతి చిన్న విషయాన్ని చిత్రంలో ప్రతిబింబించ డంలో ఆయన ప్రతిభ అనన్యమైనది. అయితే కొందరు విమర్శకులు ఆయన చిత్రాల్లో మరింత లోతు ఉండాలని అభిప్రాయపడ్డారు. అయినప్పటికీ, పాపయ్య దశాబ్దాలుగా చిత్రకళా రంగానికి అందించిన సాయానికి ప్రజలు ఎల్లప్పుడూ ఆయనను ప్రశంసిస్తూనే ఉంటారు. వడ్డాది పాపయ్య సృజనాత్మకతను ప్రతిబింబించే అనేక చిత్రాలు ఆయన కుంచె నుంచి వెలువడినవి. ఈ చిత్రాలు అందరికీ కళా సౌందర్యాన్ని అందించడంలో ముఖ్యమైన పాత్ర పోషించాయి.

వడ్డాది పాపయ్య తెలుగు చిత్రకళలో ఒక అద్భుతమైన స్ఫూర్తి. ఆయన చిత్రాలు ఎల్లప్పుడూ కళాభిమానులకు స్ఫూర్తిగా నిలుస్తూ, తెలుగు చిత్రకళా రంగానికి సజీవ స్వరూపంగా నిలిచాయి.

రామ కిష్టయ్య సంగన భట్ల,
సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్ కాలమిస్ట్
...9440595494

గోదావరి పారుతోంది.. తెలంగాణ ఎందుకు ఎండుతోంది?

ప్రాజెక్టులున్నా రైతుకు నీటి కష్టాలా? జలాల లెక్కలు చెప్పాలి.. పాలన మేల్కొనాలి!

నీటి ఎద్దడి రాకముందే మేల్కొందాం!

ముందస్తు చర్యలతోనే జలభద్రత.. ప్రభుత్వ యంత్రాంగం ఇప్పటి నుంచే అప్రమత్తం కావాలి!

గోదావరి పారుతున్నా.. గొరంత నీటికైనా రైతు ఎదురుచూపులెందుకు? ప్రాజెక్టులున్నా పొలాలు ఎండిపోవడమెందుకు? జలాల లెక్కలు ప్రజలకు తెలియకపోవడమెందుకు? నదులున్న తెలంగాణలో రైతు కన్నీటికి పరిష్కారమెప్పుడు? కరువు ప్రకృతి పరీక్ష.. నీటి నిర్వహణ పాలనకు అగ్నిపరీక్ష! ఒకవైపు భారీ ప్రాజెక్టులు, బ్యారేజీలు, ఎత్తిపోతల పథకాలు.. మరోవైపు ఎండుతున్న పొలాలు, తగ్గుతున్న సాగు విస్తీర్ణం, ఆందోళనలో అన్నదాతలు! వర్షాన్ని నియంత్రించడం ప్రభుత్వానికి సాధ్యం కాకపోవచ్చు. కానీ అందుబాటులో ఉన్న నీటిని సమర్థంగా నిల్వ చేయడం, అవసరాలను బట్టి పంపిణీ చేయడం, నీటి కొరతను ముందుగానే అంచనా వేసి ప్రత్యామ్నాయాలు సిద్ధం చేయడం మాత్రం పాలనా బాధ్యత. ప్రాజెక్టుల నిర్మాణంతోనే బాధ్యత ముగియదు.. వాటి ప్రయోజనం రైతు పొలానికి చేరినప్పుడే సార్థకత!

2026 అక్టోబరు చివరి వారంలో వెలువడిన వార్తా నివేదికల ప్రకారం, తెలంగాణలోని 31 జిల్లాల్లో 365 మండలాలను వానాకాలం కరువు ప్రభావిత ప్రాంతాలుగా గుర్తించారు. వీటిలో 111 మండలాలు తీవ్ర కరువు, 254 మండలాలు మధ్యస్థ కరువు పరిస్థితులను ఎదుర్కొంటున్నట్లు పేర్కొన్నారు. జూన్ నుంచి సెప్టెంబరు వరకు రాష్ట్రంలో సాధారణ వర్షపాతం 740.6 మి.మీ. కాగా, 615.5 మి.మీ. మాత్రమే నమోదైంది. అంటే 17 శాతం లోటు. ఇదే సమయంలో వానాకాలం పంటల సాగు విస్తీర్ణం 139.28 లక్షల ఎకరాల నుంచి 126.06 లక్షల ఎకరాలకు తగ్గింది. వరి సాగు విస్తీర్ణం 69.19 లక్షల ఎకరాల నుంచి 57 లక్షల ఎకరాలకు పడిపోయింది. ఇవి కేవలం గణాంకాలు కావు.. రైతు ఎదుర్కొంటున్న ఆర్థిక ఒత్తిడికి సూచనలు. కరువు మండలాల్లో రైతులకు నీరు, పంట నష్టపరిహారం, పెట్టుబడి సాయం, పశువులకు మేత వంటి అవసరాలపై ప్రభుత్వం ఎంత వేగంగా స్పందిస్తుందన్నదే ఇప్పుడు ముఖ్యం.



తెలంగాణ నీటిపారుదల శాఖ అధికారిక వివరాల ప్రకారం, గోదావరి నదిలో రాష్ట్రానికి 967.94 టీఎంసీల నీటిని వినియోగించుకునే హక్కు ఉన్నట్లు పేర్కొన్నారు. అయితే ఈ హక్కు ప్రతి ఏడాది అంతే పరిమాణంలో నీరు అందుబాటులో ఉంటుందని అర్థం కాదు. నదీ ప్రవాహాలు, నీటి కేటాయింపులు, తాగునీటి అవసరాలు, పర్యావరణ పరిమితులు, ప్రాజెక్టుల నిల్వ సామర్థ్యాన్ని పరిగణనలోకి తీసుకోవాలి. శ్రీరాంసాగర్, ఎల్లంపల్లి, కాళేశ్వరం పరిధిలోని బ్యారేజీలు, దేవాదుల వంటి పథకాలు రాష్ట్ర జలవనరుల నిర్వహణలో కీలకమైనవి. అయితే ప్రాజెక్టు సామర్థ్యం వేరు.. ప్రస్తుత నిల్వ వేరు.. సాగునీటికి విడుదల చేయగల నీరు వేరు. ప్రతి ప్రాజెక్టులో ఎంత నీరు అందుబాటులో ఉంది? ఎంత సాగుకు విడుదల చేయవచ్చు? అనే వివరాలను ప్రభుత్వం తేదీతో సహా ప్రజలకు వెల్లడించాలి.

ప్రతి ప్రాజెక్టులో ప్రస్తుతం ఎంత నీరు ఉంది? ఈ వానాకాలంలో ఎంత వచ్చి చేరింది? ఎంత నీటిని సాగుకు, ఎంత తాగునీటికి విడుదల చేశారు? కాలువల చివరి ఆయకట్టు వరకు నీరు చేరిందా? ఎత్తిపోతల కేంద్రాలు, పంపింగ్ వ్యవస్థలు పనిచేస్తున్నాయా? నీటి కొరతతో ఇబ్బందులు పడుతున్న గ్రామాలు, చెరువులెన్ని? ఈ ప్రశ్నలకు గణాంకాలతో సమాధానాలు రావాలి. గోదావరి నీటిని ప్రతి చెరువుకూ నేరుగా మళ్లించడం సాధ్యం కాకపోవచ్చు. భౌగోళిక పరిస్థితులు, కాలువల మార్గాలు, విద్యుత్ ఖర్చు, నీటి కేటాయింపులు పరిమితులు విధిస్తాయి. అయినప్పటికీ ఇప్పటికే ఉన్న ప్రాజెక్టులు, కాలువలు, పంపింగ్ కేంద్రాలు, చెరువులను సమస్వయంతో ఉపయోగించి ఎక్కడ నీటిని అందించవచ్చో శాస్త్రీయంగా పరిశీలించాలి. మరమ్మతులతోనే నీరు చేరే కాలువలు, తూములు, పంపింగ్ కేంద్రాలకు ప్రాధాన్యం ఇవ్వాలి. చెరువుల కట్టలు, అలుగులు, అనుసంధాన కాలువలను పరిశీలించి వర్షపు నీటిని నిల్వ చేసుకునే సామర్థ్యాన్ని పెంచాలి.

జగిత్యాల జిల్లా వంటి శ్రీరాం సాగర్ ఆయకట్టు ప్రాంతాల్లో కాలువల చివరి వరకు నీరు అందని గ్రామాలను గుర్తించి, వాటి సమస్యలను విడిగా పరిశీలించాలి. ఎక్కడ నీటి విడుదల సరిపోవడం లేదు? ఎక్కడ కాలువల మరమ్మతులు అవసరం? ఎక్కడ ప్రత్యామ్నాయ నీటి వనరులు ఉపయోగపడతాయి? అన్న అంశాలపై స్థానిక రైతుల అభిప్రాయాలను కూడా పరిగణనలోకి తీసుకోవాలి. గోదావరి తెలంగాణ గుండా ప్రవహించడం ఒక్కటే రైతుకు నీటి భరోసా కాదు. ఆ జలాలను ఎక్కడ నిల్వ చేస్తున్నాం? ఎంత వినియోగిస్తున్నాం? ఏ ప్రాంతాలకు చేరుస్తున్నాం? ఎక్కడ అడ్డంకులు ఎదురవుతున్నాయి? అన్నదే అసలు లెక్క. ప్రాజెక్టుల ఘనతలు చాటుకోవడం, గత పాలకులపై నిందలు వేయడం మాత్రమే పరిష్కారం కాదు. కరువు ప్రకృతి వైపరీత్యం కావచ్చు.. కానీ అందుబాటులో ఉన్న నీటి వినియోగంపై ప్రణాళిక, పారదర్శకత, జవాబుదారీతనం ప్రభుత్వ బాధ్యత. గోదావరి ప్రవహిస్తుంటే పల్లె ఎందుకు ఎండిపోతోంది? ప్రాజెక్టులున్నా రైతు ఎందుకు బోర్లపై ఆధారపడాలి? ప్రభుత్వం ఈ ప్రశ్నలకు ఆధారాలతో సమాధానం చెప్పాలి. రైతుకు కావాల్సింది ప్రకటన కాదు.. పొలానికి చేరే నీరు! పాలనకు కావాల్సింది ప్రచారం కాదు.. ప్రజలకు కనిపించే ఫలితం!

– శ్రీశైలం దూడం
ఫ్రీలాన్స్ జర్నలిస్టు
9133947176



తెలంగాణ: ప్రకృతి ఎప్పుడు ఎలా మారుతుందో చెప్పలేని పరిస్థితులు నెలకొంటున్నాయి. వాతావరణ మార్పులు, వర్షపాతం తగ్గడం, భూగర్భ జలాలు అడుగంటడం వంటి పరిణామాలు భవిష్యత్తులో నీటి సమస్యలు తలెత్తే ప్రమాదాన్ని సూచిస్తున్నాయి. ఈ నేపథ్యంలో తెలంగాణ రాష్ట్రంలో రానున్న రోజుల్లో తాగునీటి కొరత ఏర్పడకుండా ప్రభుత్వం, సంబంధిత శాఖల అధికారులు ఇప్పటి నుంచే ముందస్తు ప్రణాళికతో అప్రమత్తం కావాల్సిన అవసరం ఎంతైనా ఉంది. నీటి ఎద్దడి ఏర్పడిన తర్వాత హడావుడిగా చర్యలు చేపట్టడం కంటే, సమస్య రాకముందే పరిష్కార మార్గాలను సిద్ధం చేసుకోవడం ఎంతో మేలు.

వర్షాలు తక్కువైతే.. నీటి సమస్యలు తప్పవా?

వర్షాలు సమృద్ధిగా కురిసినప్పుడు జలాశయాలు, చెరువులు, కుంటలు నిండటంతో పాటు భూగర్భ జలాలు కూడా పెరుగుతాయి. అయితే వర్షపాతం తక్కువగా నమోదైతే ఈ నీటి వనరులపై ప్రభావం పడే అవకాశం ఉంటుంది. గ్రామీణ ప్రాంతాల్లో బోరుబావుల నీటిమట్టాలు తగ్గడం, చేతిపంపులు పనిచేయకపోవడం, తాగునీటి సరఫరాలో అంతరాయాలు ఏర్పడటం వంటి సమస్యలు ప్రజలను ఇబ్బందులకు గురిచేయవచ్చు. ముఖ్యంగా వేసవి సమీపించే కొద్దీ తాగునీటి అవసరాలు పెరుగుతాయి. ఇప్పటి నుంచే పరిస్థితిని అంచనా వేసి చర్యలు తీసుకోకపోతే భవిష్యత్తులో గ్రామాలు, పట్టణాల్లో ప్రజలు నీటి కోసం ఇబ్బందులు పడే పరిస్థితి రావచ్చు. అందువల్ల నీటి లభ్యత, అవసరాలు, భవిష్యత్తులో ఎదురయ్యే పరిస్థితులపై అధికారులు సమగ్రంగా అధ్యయనం చేయాలి.

ముందస్తు ప్రణాళికే అసలైన పరిష్కారం!

నీటి సమస్యను ఎదుర్కోవడంలో ప్రభుత్వ ముందుచూపు కీలక పాత్ర పోషిస్తుంది. రాష్ట్రవ్యాప్తంగా తాగునీటి వనరుల పరిస్థితిని అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించాలి. ఏయే గ్రామాల్లో నీటి లభ్యత తక్కువగా ఉంది? ఎక్కడ బోరుబావులు ఎండిపోయే ప్రమాదం ఉంది? ఏ ప్రాంతాల్లో ప్రత్యామ్నాయ నీటి వనరులు అవసరం? అనే అంశాలపై ముందుగానే నివేదికలు రూపొందించాలి. అవసరమైన చోట్ల పైపులైన్ల మరమ్మతులు చేపట్టడం, నీటి ట్యాంకులను శుభ్రపరచడం, నిల్వ సామర్థ్యాన్ని వినియోగించుకోవడం, పనిచేయని బోరుబావులు, చేతిపంపుల పరిస్థితిని పరిశీలించడం వంటి చర్యలకు ప్రాధాన్యత ఇవ్వాలి. అత్యవసర పరిస్థితులు ఏర్పడే గ్రామాలను గుర్తించి, అక్కడ ట్యాంకర్ల ద్వారా నీటి సరఫరా చేసేందుకు అవసరమైన ఏర్పాట్లు ముందుగానే సిద్ధం చేసుకోవాలి.

జలాశయాల నీటి వినియోగంపై ప్రత్యేక దృష్టి

రాష్ట్రంలోని ప్రధాన జలాశయాలు, చెరువులు, కుంటల్లో అందుబాటులో ఉన్న నీటి నిల్వలను అధికారులు నిరంతరం పర్యవేక్షించాలి. తాగునీటి అవసరాలకు ప్రాధాన్యతనిస్తూ నీటి వినియోగంపై స్పష్టమైన ప్రణాళిక రూపొందించాలి. నీటి నిల్వలు, రాబోయే అవసరాలు, సరఫరా పరిస్థితులను బట్టి సంబంధిత శాఖలు సమన్వయంతో నిర్ణయాలు తీసుకోవాలి.

మిషన్ భగీరథ, గ్రామీణ నీటి సరఫరా, మున్సిపల్ శాఖల అధికారులు పరస్పర సమన్వయం చేసుకుంటూ ప్రజలకు నిరంతర తాగునీటి సరఫరా జరిగేలా చర్యలు చేపట్టాలి. నీటి సరఫరాలో సమస్యలు తలెత్తినప్పుడు వెంటనే స్పందించే విధంగా ప్రత్యేక పర్యవేక్షణ వ్యవస్థను ఏర్పాటు చేయాలి.

వర్షపు నీటి ప్రతి చుక్కను ఒడిసిపట్టాలి

వర్షాలు తగ్గినప్పుడు నీటి సంరక్షణ ప్రాధాన్యత మరింత పెరుగుతుంది. ప్రతి గ్రామంలో వర్షపు నీటిని నిల్వ చేసుకునే ఏర్పాట్లపై దృష్టి సారించాలి. చెరువులు, కుంటల్లో పూడికతీత పనులు అవసరమైన చోట చేపట్టాలి. ఇంకుడు గుంతల నిర్మాణం, ఇంటి పైకప్పులపై పడే వర్షపు నీటిని భూమిలోకి ఇంకించే విధానాలను ప్రోత్సహించాలి. ప్రభుత్వం చేపట్టే జల సంరక్షణ కార్యక్రమాలకు ప్రజలు కూడా భాగస్వాములు కావాలి. నీటిని వృథా చేయకుండా వినియోగించడం, లీకేజీలను వెంటనే సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లడం, స్థానిక నీటి వనరులను పరిరక్షించడం ప్రతి ఒక్కరి బాధ్యతగా మారాలి.

రైతుల ప్రయోజనాలనూ విస్మరించకూడదు

నీటి కొరత ప్రభావం కేవలం తాగునీటికే పరిమితం కాదు. వ్యవసాయం, పశుపోషణ, గ్రామీణ జీవనోపాధిపై కూడా ప్రభావం చూపే అవకాశం ఉంది. అందువల్ల వ్యవసాయ శాఖ అధికారులు రైతులకు అందుబాటులో ఉన్న నీటి వనరులపై అవగాహన కల్పించాలి. తక్కువ నీటితో సాగు చేయగల పంటలు, నీటిని పొదుపుగా వినియోగించే సాగు పద్ధతులపై సూచనలు అందించాలి. పశువులకు తాగునీరు అందుబాటులో ఉండేలా కూడా స్థానిక యంత్రాంగం చర్యలు తీసుకోవాలి. గ్రామీణ ప్రాంతాల్లో నీటి సమస్య తీవ్రమయ్యే సూచనలు కనిపిస్తే సంబంధిత శాఖలు సమన్వయంతో స్పందించాలి.

నిర్లక్ష్యానికి తావివ్వకుండా పర్యవేక్షణ అవసరం

ప్రజలకు తాగునీరు అందించడం ప్రభుత్వ ప్రాథమిక బాధ్యతల్లో ఒకటి. ఈ బాధ్యతను సమర్థంగా నిర్వహించేందుకు అధికారులు కేవలం కార్యాలయాలకే పరిమితం కాకుండా క్షేత్రస్థాయిలో పర్యటించాలి. గ్రామాల్లో నీటి సరఫరా పరిస్థితులను పరిశీలించి, ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులపై తక్షణమే స్పందించాలి.

నీటి సమస్యల పరిష్కారానికి కేటాయించే నిధులు సక్రమంగా వినియోగించబడుతున్నాయా? మరమ్మతు పనులు సమయానికి పూర్తవుతున్నాయా? ప్రజలకు నిర్ణీత సమయాల్లో నీరు అందుతోందా? అనే అంశాలపై ఉన్నతాధికారులు నిరంతరం సమీక్షలు నిర్వహించాలి. సమస్యలు ఉన్న ప్రాంతాలను గుర్తించి, వాటి పరిష్కారానికి గడువుతో కూడిన కార్యాచరణ రూపొందించాలి.

నీటి భద్రత.. అందరి బాధ్యత!

నీటి సమస్య వచ్చిన తర్వాత ట్యాంకర్ల కోసం ఎదురుచూడటం, అధికారుల చుట్టూ తిరగడం కంటే సమస్య రాకముందే అప్రమత్తం కావడం ఎంతో ఉత్తమం. వర్షపాతం తక్కువగా ఉన్న పరిస్థితుల్లో అందుబాటులో ఉన్న నీటి వనరులను జాగ్రత్తగా వినియోగించుకో వడం, భవిష్యత్తు అవసరాలకు తగిన ప్రణాళికలు రూపొందించడం అత్యవసరం. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఈ అంశంపై ప్రత్యేక దృష్టి సారించి, అన్ని జిల్లాల అధికారులను అప్రమత్తం చేయాలి. జిల్లా కలెక్టర్ల పర్యవేక్షణలో గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో తాగునీటి పరిస్థితులపై సమగ్ర నివేదికలు సిద్ధం చేయించి, అవసరమైన చోట్ల ముందస్తు చర్యలు చేపట్టాలి. నీటి ఎద్దడి ఏర్పడిన తర్వాత స్పందించడం కంటే.. నీటి ఎద్దడి రాకుండా చూడటమే సమర్థవంతమైన పాలనకు నిదర్శనం. ప్రజలకు తాగునీటి భరోసా కల్పించాలంటే నేటి నుంచే కార్యాచరణ ప్రారంభించాలి. నీటి ప్రతి చుక్కను కాపాడుకుందాం.. భవిష్యత్తు తరాలకు జలభద్రతను అందిద్దాం!



రవీందర్ కామారెడ్డి
సీనియర్ జర్నలిస్ట్.

విద్యార్థిని లాస్య మృతిపై సమగ్ర విచారణ జరిపించాలి



● దుబ్బాక ఎమ్మెల్యే ప్రభాకర్ రెడ్డి

సిద్దిపేట ప్రతినిధి, అక్టోబర్ 29, (సింగిడి): సిద్దిపేట ప్రభుత్వ ఆసుపత్రి మార్చురీలో తొగుట మండలం గుడికందుల గ్రామానికి చెందిన పదో తరగతి విద్యార్థిని లాస్య మృతదేహాన్ని ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి పరిశీలించి, ఆమె కుటుంబ సభ్యులను పరామర్శించారు. సిద్దిపేట మండలం రాఘవాపూర్‌లోని కస్తూర్బా గురుకుల పాఠశాలలో చదువుతున్న లాస్య అనుమానాస్పద మృతి పట్ల ఆయన తీవ్ర విచారం వ్యక్తం చేశారు. విద్యార్థిని మృతికి సంబంధించిన పలు అనుమానాలను ప్రస్తావిస్తూ, ఘటనపై సమగ్ర విచారణ జరిపి వాస్తవాలను వెలుగులోకి తీసుకురావాలని డిమాండ్ చేశారు. మార్చురీ ఎదుట జిల్లా కలెక్టర్ వెంటనే ఇక్కడికి రావాలని, బాధిత కుటుంబానికి ఘటనపై స్పష్టమైన సమాధానం చెప్పాలని కోరారు. మృతి చెందిన విద్యార్థిని కుటుంబానికి తగిన నష్టపరిహారం అందించాలని డిమాండ్ చేశారు. ఈ ఘటనలో బాధ్యులు ఎవరైనా ఉన్నట్లయితే వారిని గుర్తించి చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలని, విచారణ నిష్పక్షపాతంగా జరిపి బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని పోలీసు అధికారులకు సూచించారు. లాస్య మృతికి గల కారణాలను పూర్తిస్థాయిలో వెలికితీసి, కుటుంబ సభ్యులకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే కోరారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, పాల్గొన్నారు.

డిసి ఫిలిం బ్యానర్ పై (ఒక ఊరు కథ) నూతన చిత్రం..



● సిద్దిపేట కోమటి చెరువుపై షూటింగ్ ప్రారంభం

సిద్దిపేట ప్రతినిధి, అక్టోబర్ 29, (సింగిడి): తెలంగాణ పల్లెటూరు వాతావరణం అక్కడి సంస్కృతి మనోభావాల నేపథ్యంలో ఈ కథ ముందుకు సాగుతుందని ఈ చిత్రం ప్రతి ఒక్కరిని ఆకట్టుకునేలా సహజత్వానికి దగ్గరగా తెరకెక్కిస్తున్నామని చిత్ర యూనిట్ సభ్యులు వెల్లడించారు. ఈ చిత్రానికి నిర్మాత, దర్శకత్వం దేవేందర్ చందాపురం వహిస్తుండగా, సహ దర్శకత్వం శివ, యోగి, అసిస్టెంట్ గా పురుషోత్తం, క్యాస్టింగ్ తదితరులు పోషిస్తున్నారు.

చిత్ర సభ్యులు మాట్లాడుతూ... గ్రామీణ నేపథ్యంలో వినోదాత్మకంగా రాబోతున్న ఈ సినిమా మంచి విజయం సాధించి యూనిట్ లోని ప్రతి ఒక్కరికి మంచి పేరు తీసుకురావాలని పలువురు ఆకాంక్షించారు. త్వరలోనే ఈ చిత్రం షూటింగ్ పూర్తిచేసుకుని ప్రేక్షకుల ముందుకు రాబోతుందని ఈ చిత్రం లో నటీనటులు రఘు హీరోగా భవాని హీరోయిన్ గా గౌతమి దీపిక తదితరులు నటించనున్నారు. వీరందరితో పాటు తెలంగాణ ప్రాంత నటులకు పెద్ద పీట వేస్తూ నిర్మిస్తున్న ఈ చిత్రం లో సిద్దిపేట జిల్లా ఫిలిం టీవీ ఆర్టిస్టు అసోసియేషన్ (గాణఖీూూా) ఆధ్వర్యంలో ప్రధాన కార్యదర్శి ధాకూరి భాస్కర్ రెడ్డి పోలీసు నిఐ గా ఉపాధ్యక్షుడు ఎర్రమరాజు చరణ్ రాజు (గూజ=) గ్రామ సర్పంచ్ పాత్ర సీనియర్ నటుడు గౌట్ రాజు కరట బాలు ఉపాధ్యక్షుడు స్వామి శరణం కోశాధికారి నెమలి సుభాష్ నటీనటులు రాణి కీర్తి మంజుల మోజేష్ రాకేష్ మహేందర్ లో నూ కనిపించనున్నారని వీరి తో పాటు సిద్దిపేట జిల్లా కు చెందిన మరో పదిమంది ఆర్టిస్ట్ లు మరియు కరీంనగర్, మంచిర్యాల జిల్లా లకు చెందిన మరో పదిమంది ఆర్టిస్ట్ లు ఇతర పాత్రల్లో కనువిందు చేయనున్నారని నిర్మాత, దర్శకుడు దేవేందర్ చందాపురం పేర్కొన్నారు.

అనారోగ్య బాధితుడికి
ఎమ్మెల్యే మదన్ మోహన్ ఆర్థిక భరోసా
ఎల్ఓసీ ద్వారా రూ.1.50 లక్షల సహాయం..
బాధిత కుటుంబానికి ఊరట



కామారెడ్డి అక్టోబర్ 29 (సింగిడి): ప్రజల కష్టసుఖాల్లో తోడుగా నిలుస్తూ, ఆపద సమయంలో అండగా ఉండటమే నిజమైన ప్రజాసేవకు నిదర్శనమని ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్ మోహన్ మరోసారి చాటిచెప్పారు. తీవ్ర అనారోగ్యంతో బాధపడుతూ అత్యవసర శస్త్రచికిత్స అవసరమైన ఎల్లారెడ్డి పట్టణం న్యూ ఆబాదీకి చెందిన మొహమ్మద్ నజీరుద్దీన్‌కు రూ. 1,50,000 విలువైన ఎల్ఓసీ (లెటర్ ఆఫ్ క్రెడిట్) ఆర్థిక సహాయం అందేలా చర్యలు తీసుకున్నారు.

వైద్య ఖర్చులతో ఇబ్బందులు.. ఎమ్మెల్యేను ఆశ్రయించిన కుటుంబం

ఎల్లారెడ్డి పట్టణంలోని న్యూ ఆబాదీకి చెందిన మొహమ్మద్ నజీరుద్దీన్ తీవ్ర అనారోగ్యంతో బాధపడుతుండగా, అత్యవసరంగా శస్త్రచికిత్స చేయాలని వైద్యులు సూచించారు. ఇప్పటికే వైద్య ఖర్చులతో ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న ఆయన కుటుంబానికి శస్త్రచికిత్స ఖర్చులు భారంగా మారాయి. ఏం చేయాలో తెలియని పరిస్థితుల్లో కుటుంబ సభ్యులు ఎమ్మెల్యే మదన్ మోహన్‌ను ఆశ్రయించి తమ సమస్యను వివరించారు.

వెంటనే స్పందించిన ఎమ్మెల్యే

బాధిత కుటుంబ పరిస్థితిని తెలుసుకున్న ఎమ్మెల్యే మదన్ మోహన్ తక్షణమే స్పందించి, వైద్య చికిత్స కోసం రూ. 1.50 లక్షల ఎల్ఓసీ ఆర్థిక సహాయం మంజూరయ్యేలా కృషి చేశారు. ఈ సహాయంతో బాధితుడి చికిత్సకు అవసరమైన ఆర్థిక వెసులుబాటు కలగనుంది. ఆపదలో ఉన్న కుటుంబానికి అండగా నిలవడం ద్వారా ఎమ్మెల్యే తన మానవత్వాన్ని చాటుకున్నారు. కష్టకాలంలో తమకు అండగా నిలిచి, వైద్య చికిత్సకు ఆర్థిక సహాయం అందేలా కృషి చేసిన ఎమ్మెల్యే మదన్ మోహన్‌కు మొహమ్మద్ నజీరుద్దీన్ కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

చలో కరీంనగర్ సన్నాహక సమావేశం



రాజన్న సిరిసిల్ల ప్రతినిధి, అక్టోబర్ 29 (సింగిడి): వేములవాడ పట్టణం స్థానిక పద్మశాలి సంఘ. భవనంలో ఏర్పాటుచేసిన బీజేపీ పట్టణ సమావేశం ఘనంగా జరిగింది.నవంబర్ 5వ తేదీ గురువారం కరీంనగర్ లో బండి సంజయ్ ఆధ్వర్యంలో జరగనున్న మహా పాదయాత్రను విజయవంతం చేయాలని ఈ సందర్భంగా పిలుపునిచ్చారు.ఈ సమావేశంలో పట్టణ అధ్యక్షులు రావల్లి శ్రీధర్ మాట్లాడుతూ కరీంనగర్ లో జరిగే మహా పాదయాత్రకు ప్రతి ఒక్క కార్యకర్త, అభిమాని తరలిరావాలని కోరారు.ప్రతాప రామకృష్ణ మాట్లాడుతూ..దేశాన్ని విచ్ఛిన్నం చేసే విధంగా విద్రోహ శక్తులు చేస్తున్న ఆగడాలను తిప్పికొట్టేందుకు దేశవ్యాప్తంగా నిర్వహిస్తున్న పాదయాత్రలో భాగంగా 5వ తారీఖున కరీంనగర్ లో జరిగే కార్యక్రమానికి యువకులు పెద్ద ఎత్తున నరేంద్ర మోదీ మద్దతుగా తరలిరావాలని పిలుపునిచ్చారు.నూతన పదవుల్లో ఎన్నికైన వారికి సత్కారం. ఈ కార్యక్రమంలో నూతనంగా జిల్లా కిసాన్ మోర్చా కార్యవర్గ సభ్యులుగా ఎన్నికైన చిట్యాల రాజును, పట్టణ బీజేపీ ఉపాధ్యక్షులుగా ఎన్నికైన నేరెళ్ల సాయికుమార్ ను, పట్టణ ఎండోమెంట్ కమిటీ కన్వీనర్ గా ఎన్నికైన రేణికింద అశోక్, కో-కన్వీనర్ బిల్లా కృష్ణలను శాలువాతో సత్కరించి అభినందించారు. ఈ కార్యక్రమంలో నాయకులు.రాష్ట్ర ఎస్సీ మోర్చా కార్యదర్శి సంటి మహేష్,రాష్ట్ర కౌన్సిల్ మెంబర్ కోల కృష్ణస్వామి, నాయకులు రేగుల మల్లికార్జున్,కౌన్సిలర్ కొండ్లపు ముత్యం,నాయకులు రేగుల శ్రీకాంత్, వాసం మల్లేశం యాదవ్, రేగుల రాజకుమార్, తదితరులు పాల్గొన్నారు.

కుదేలైన కులవృత్తులు.. భారమైన బతుకులు!
బంగారం, వెండి ధరల పెరుగుదలతో విశ్వబ్రాహ్మణుల జీవన పోరాటం

సంప్రదాయ వృత్తులకు తగ్గిన ఆదరణ..

సన్నగిల్లిన ఉపాధి అవకాశాలు
పెరిగిన పెట్టుబడి.. పడిపోయిన ఆదాయం

అప్పులు, ఆర్థిక ఒత్తిళ్లతో
సతమతమవుతున్న వృత్తిదారులు.
జీసీ-బి నుంచి జీసీ-ఏలోకి
మార్చాలని డిమాండ్

రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే స్పందించాలని
విశ్వబ్రాహ్మణ సంఘం రాష్ట్ర నాయకుడు
రావుల రమేష్ విజ్ఞప్తి

ఒకప్పుడు చేతివృత్తులే జీవనాధారం.. తరతరాలుగా అందిపుచ్చుకున్ననైపుణ్యమే పెట్టుబడి.. తమ కళతో సమాజానికి అవసరమైన వస్తువులను అందిస్తూ కుటుంబాలను పోషించుకున్న వర్గం వారిది. కాలం మారింది.. జీవన విధానాలు మారాయి.. సంప్రదాయ వృత్తులకు ఆదరణ తగ్గింది. దీనికి తోడు ముడిసరుకుల ధరలు ఆకాశాన్నంటడంతో విశ్వబ్రాహ్మణుల బతుకులు భారంగా మారుతున్నాయి. వృత్తిని నమ్ముకుని బతకలేని పరిస్థితులు ఏర్పడుతుండటంతో అనేక కుటుంబాలు ఆర్థిక ఇబ్బందులను ఎదుర్కొంటున్నాయి.

(కరీంనగర్ జిల్లా -- సింగిడి ప్రతినిధి)



ధరల మంట.. వృత్తిదారులకు గుదిబండ!

విశ్వబ్రాహ్మణుల సంప్రదాయ వృత్తుల్లో బంగారం, వెండి ఆభరణాల తయారీతోపాటు వడ్రంగం, శిల్పకళ, లోహ పనులు తదితర చేతివృత్తులు కీలకమైనవి. ఆయా వృత్తుల స్వభావాన్ని బట్టి ముడిసరుకుల ధరలు, పనిముట్ల ఖర్చులు, ఇతర నిర్వహణ వ్యయాలు పెరగడం వృత్తిదారులపై అదనపు భారాన్ని మోపుతోంది. ముఖ్యంగా బంగారం, వెండి ధరల పెరుగుదలతో ఆభరణాల తయారీ రంగంలో కొనుగోలుదారులపై వ్యయం పెరుగుతోంది. ఫలితంగా ఆర్డర్లు తగ్గడం, పనులు మందగించడం వంటి పరిణామాలు వృత్తిదారుల ఆదాయాన్ని దెబ్బతీస్తున్నాయి.ముడిసరుకుల ధరలు పెరిగినా అందుకు అనుగుణంగా ఆదాయం పెరగడం లేదు. మరోవైపు ఆధునిక యంత్రాలు, మార్కెట్ మార్పులు, మారుతున్న వినియోగదారుల అభిరుచులు సంప్రదాయ చేతివృత్తులకు సవాళ్లుగా మారుతున్నాయి. నైపుణ్యం ఉన్నా తగిన పని దొరకని పరిస్థితులు నెలకొనడంతో వృత్తిదారులు జీవనోపాధి కోసం నానా అవస్థలు పడుతున్నారు.

అప్పుల ఊబిలో కుటుంబాలు.

వృత్తే జీవనాధారంగా ఉన్న కుటుంబాలకు పనులు తగ్గితే ఇంటి ఖర్చులు, పిల్లల చదువులు, వైద్య అవసరాలు భారంగా మారుతున్నాయి. వచ్చిన ఆదాయం రోజువారీ అవసరాలకే సరిపోకపోవడంతో కొందరు అప్పులపై ఆధారపడాల్సి వస్తోంది. అప్పులు తీర్చలేని పరిస్థితులు, కుటుంబ పోషణపై ఆందోళన, ఆర్థిక అనిశ్చితి వృత్తిదారులను మానసిక ఒత్తిడికి గురిచేస్తున్నాయి. ఆర్థిక ఇబ్బందులకు తోడు అనారోగ్య సమస్యలు ఎదురైతే పరిస్థితి మరింత దుర్భరంగా మారుతోంది.తరతరాలుగా వస్తున్న వృత్తిని వదులుకోలేక.. కొనసాగించడానికి అవసరమైన పెట్టుబడులు సమకూర్చుకోలేక పలువురు సతమతమవుతున్నారు. యువతలోనూ సంప్రదాయ వృత్తుల పట్ల ఆసక్తి తగ్గితే, నైపుణ్యంతో కూడిన ఈ కళలు, వాటి వెనుక ఉన్న అనుభవం, వారసత్వం భవిష్యత్తులో కనుమరుగయ్యే ప్రమాదం ఉందనే ఆందోళన వ్యక్తమవుతోంది.

వృత్తుల పరిరక్షణకు ప్రభుత్వ చేయూత ఏదీ?

సంప్రదాయ వృత్తులను కాపాడటంతోపాటు వాటిపై ఆధారపడిన కుటుంబాలకు స్థిరమైన జీవనోపాధి కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉంది. వృత్తిదారులకు తక్కువ వడ్డీ రుణాలు, పనిముట్ల కొనుగోలుకు ఆర్థిక సాయం, ఆధునిక శిక్షణ, మార్కెటింగ్ సదుపాయాలు కల్పించాల్సిన అవసరం ఉంది. వృత్తినైపుణ్యాన్ని తర్వాతి తరాలకు అందించేలా ప్రత్యేక కార్యక్రమాలు చేపట్టాలి. ఆర్థికంగా వెనుకబడిన కుటుంబాలకు సామాజిక భద్రత, ఆరోగ్య పరిరక్షణ, ఉపాధి అవకాశాలు కల్పించే దిశగా చర్యలు తీసుకోవాలి.

బీసీ-ఏలోకి మార్చాలన్న డిమాండ్

విశ్వబ్రాహ్మణులను ప్రస్తుతం ఉన్న బీసీ-బీ నుంచి బీసీ-ఏ వర్గంలోకి మార్చాలనే డిమాండ్‌ను ఆ సంఘం నాయకులు ముందుకు తెస్తున్నారు. తమ సామాజిక, ఆర్థిక పరిస్థితులను పరిగణనలోకి తీసుకుని ఈ అంశాన్ని పరిశీలించాలని కోరుతున్నారు. అయితే వర్గీకరణ మార్పుపై ప్రభుత్వం సంబంధిత గణాంకాలు, నిబంధనలు, సామాజిక పరిస్థితులను సమగ్రంగా పరిశీలించి నిర్ణయం తీసుకోవాల్సి ఉంది. ఈ నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే స్పందించి విశ్వబ్రాహ్మణుల జీవన స్థితిగతులపై సమగ్ర అధ్యయనం చేపట్టాలని రాష్ట్ర విశ్వబ్రాహ్మణ సంఘం నాయకుడు రావుల రమేష్ విజ్ఞప్తి చేశారు. సంప్రదాయ వృత్తుల పరిరక్షణకు ప్రత్యేక పథకాలు రూపొందించడంతో పాటు వృత్తిదారుల ఆర్థికాభివృద్ధికి అవసరమైన చర్యలు చేపట్టాలని కోరారు. కళను నమ్ముకుని బతికే చేతులకు భరోసా.. తరతరాల వారసత్వాన్ని కాపాడే వృత్తులకు చేయూత.. విశ్వబ్రాహ్మణుల జీవన పోరాటానికి ప్రభుత్వ అండ లభించినప్పుడే సంప్రదాయ వృత్తులకు పునరుజ్జీవం కలుగుతుంది. లేకపోతే నైపుణ్యం ఉన్నా ఉపాధి కరువై, వృత్తి ఉన్నా బతుకు భారమయ్యే పరిస్థితులు మరింత తీవ్రమయ్యే ప్రమాదం ఉంది.

ఆరోగ్య కేంద్రాలలో రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలి
కలెక్టర్ అనురాగ్ జయంతి



ఉమ్మడి నల్గొండ బ్యూరో అక్టోబర్ 29 (సింగిడి): ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి వచ్చే పేషెంట్లకు వైద్యాధికారులు,సిబ్బంది అందుబాటులో లో ఉండి మెరుగైన వైద్య చికిత్సలు అందించాలని జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి అన్నారు. గురువారం వలిగొండ మండలం వెలువర్తి గ్రామంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి సందర్శించి, అక్కడ అందిస్తున్న వైద్య సేవలను, రోగులకు కల్పిస్తున్న సౌకర్యాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆరోగ్య కేంద్రంలో పనిచేస్తున్నసిబ్బంది వివరాలను, వారి హాజరు రిజిస్టర్లను తనిఖీ చేశారు. సిబ్బంది ప్రతిరోజూ విధులకు హాజరవుతున్నారా, రోజువారీ హాజరును ప్రమాణ్ యాప్‌లో నమోదు చేస్తున్నారా అనే విషయాలను వైద్య సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. ఆరోగ్య కేంద్రానికి ప్రతిరోజూ ఎంతమంది రోగులు వస్తున్నారని, వారికి సంబంధించిన వివరాలను ఏ విధంగా నమోదు చేస్తున్నారని , రోగుల వివరాలను అభా యాప్‌లో కూడా నమోదు చేస్తున్నారా అని ఆరా తీశారు. రోగులకు అవసరమైన వైద్య సేవలను సకాలంలో అందించాలని సూచించారు. అనంతరం ల్యాబ్‌ను పరిశీలించి, అక్కడ నిర్వహిస్తున్న వైద్య పరీక్షలు, సేకరించిన నమూనాలను తదుపరి పరీక్షల కోసం ఎక్కడికి పంపిస్తున్నారు అనే వివరాలను అడిగి తెలుసుకున్నారు. గర్భిణులకు సంబంధించిన ఏఎన్‌సీ (ూచీజ) రిపోర్టులను పరిశీలించి, వారికి క్రమం తప్పకుండా వైద్య పరీక్షలు నిర్వహిస్తున్నారా, ప్రసవాల కోసం ఏయే ఆసుపత్రులకు వెళ్తున్నారనే వివరాలను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. పుట్టిన శిశువులకు షెడ్యూల్ ప్రకారం టీకాలు వేస్తున్నారా అని ఆరా తీశారు. అలాగే, 14 సంవత్సరాల బాలికలకు హెచ్‌పీవీ టీకాలు వేస్తున్నారా అని అమలు తీరును పరిశీలించి, అర్హులైన బాలికలకు టీకాలు అందుతున్నాయా అనే వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఆరోగ్య కేంద్ర పరిధిలో డెంగ్యూ జ్వర కేసులు ఏమి అయినా నమోదయ్యాయా అని ఆరా తీశారు, కేసులు ఉంటే బాధితులకు ఎలాంటి వైద్య చికిత్స అందిస్తున్నారని వైద్య సిబ్బందిని అడిగిఆ తెలుసుకున్నారు. సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని, వ్యాధుల లక్షణాలతో వచ్చే వారికి సకాలంలో పరీక్షలు నిర్వహించి తగిన చికిత్స అందించాలని సూచించారు. ఈ కార్యక్రమం లో సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

కాలం తెచ్చిన కరువు కాదు... కాంగ్రెస్ తెచ్చిన కరువు!
బోయినపల్లి మండలాన్ని వెంటనే కరువు మండలంగా ప్రకటించాలి
బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు కత్తెరపాక కొండయ్య డిమాండ్



రాజన్న సిరిసిల్ల ప్రతినిధి, అక్టోబర్ 29 (సింగిడి): జిల్లాలో బోయినపల్లి మండలాన్ని వెంటనే కరువు మండలంగా ప్రకటించి, వర్షాభావంతో పంటలు నష్టపోయిన రైతాంగాన్ని ఆదుకోవాలని డిమాండ్ చేస్తూ బీఆర్ఎస్ పార్టీ బోయినపల్లి మండల అధ్యక్షుడు కత్తెరపాక కొండయ్య ఆధ్వర్యంలో స్థానిక తహశీల్దార్ వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా కత్తెరపాక కొండయ్య మాట్లాడుతూ... ఎల్‌నినో ప్రభావం, వర్షాభావ పరిస్థితుల కారణంగా రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో వ్యవసాయం తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటోందని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం కొన్ని మండలాలను మాత్రమే కరువు మండలాలుగా ప్రకటించి, తీవ్ర వర్షాభావ పరిస్థితులను ఎదుర్కొంటున్న బోయినపల్లి మండలాన్ని జాబితాలో చేర్చకపోవడం బాధాకరమని ఆవేదన వ్యక్తం చేశారు.బోయినపల్లి మండలంలోని అనేక గ్రామాల్లో రైతులు సాగు చేసిన పంటలకు సరిపడా వర్షాలు కురవకపోవడంతో పంటల ఎదుగుదల దెబ్బతిని, పెట్టుబడులు కూడా తిరిగి వచ్చే పరిస్థితి లేకుండా పోతోందని పేర్కొన్నారు. విత్తనాలు, ఎరువులు, పురుగుమందులు, కూలీల ఖర్చుల కోసం అప్పులు చేసి సాగు చేస్తున్న రైతులు ఇప్పుడు తీవ్ర ఆర్థిక ఇబ్బందులను ఎదుర్కొంటున్నారని తెలిపారు. ఇలాంటి పరిస్థితుల్లో ప్రభుత్వం రైతులకు అండగా నిలవాల్సిన అవసరం ఉందన్నారు.కరువు మండలాల ప్రకటనలో రాజకీయాలకు తావివ్వకుండా, క్షేత్రస్థాయిలో వంద్నపాతం, పంటల పరిస్థితి, సాగునీటి లభ్యత, పంట నష్టాలను సమగ్రంగా పరిశీలించి అర్హత ఉన్న ప్రతి మండలాన్ని చేర్చాలని డిమాండ్ చేశారు. బోయినపల్లి మండలాన్ని వెంటనే కరువు మండలంగా ప్రకటించి, నష్టపోయిన రైతులకు ప్రభుత్వ నిబంధనల ప్రకారం పరిహారం అందించాలని కోరారు.చొప్పదండి నియోజకవర్గంలోని బోయినపల్లి మండల రైతాంగం ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించడంలో స్థానిక ప్రజాప్రతినిధులు చొరవ చూపాలని అన్నారు. స్థానిక ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడిగా కూడా కొనసాగుతున్నప్పటికీ, చొప్పదండి నియోజకవర్గంలోని మండలాల రైతుల కరువు సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి తగిన చర్యలు తీసుకునేలా కృషి చేయాలని సూచించారు. రైతులు పంటలు వేయాలా వద్దా అనే ఆందోళనలో ఉండే పరిస్థితి రావడం వ్యవసాయ రంగం ఎదుర్కొంటున్న సంక్షోభానికి నిదర్శనమని వ్యాఖ్యానించారు.రైతులకు భరోసా ఇవ్వాల్సిన సమయంలో ప్రభుత్వం నిర్లక్ష్యం వహించకూడదు. కరువు పరిస్థితులను ఎదుర్కొంటున్న రైతులను ఆదుకోవడం ప్రభుత్వ బాధ్యత. బోయినపల్లి మండలాన్ని కరువు మండలంగా ప్రకటించి, పంట నష్టపోయిన రైతులకు తక్షణ న్యాయం చేయాలి. లేనిపక్షంలో రైతుల పక్షాన బీఆర్ఎస్ పార్టీ పోరాటాన్ని మరింత ఉధృతం చేస్తుందని కత్తెరపాక కొండయ్య హెచ్చరించారు.ఇట్టి కార్యక్రమంలో పాల్గొన్న బిఆర్ఎస్ పార్టీ ప్రధాన కార్యదర్శి గుంటి శంకర్ మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ లెంకల సత్యనారాయణ రెడ్డి మాజీ వైస్ ఎంపీపీ కొనుకటి నాగయ్య సర్పంచులు అనుముల భాస్కర్ నిమ్మ శ్రీనివాస్ రెడ్డి మాజీ సర్పంచుల పోరం రాష్ట్ర అధ్యక్షుడు అక్కనేపల్లి కర్ణాకర్ మాజీ సర్పంచులు చిందం రమేష్, రాజు,ముద్దం రవి. కవ్వంపెల్లి రాములు కొంకటి శేఖర్, బత్తిని కమల్ గౌడ్, కన్నం సాగర్, బోయినీ రాజు,నాగుల శ్రీనివాస్ గౌడ్ బుర్ర పూర్ణ చందు,బొజ్జ ప్రభాకర్ ,ఏడాపెల్లి తిరుపతి మల్లరపు చెందు, పెగ్గర్ల శేఖర్ , దూస మధు,గంద్ర సత్యనారాయణ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాద బాధితులు పీఎం రహత్ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలి: జిల్లా ఎస్పీ
జిల్లాలోని 07 ఆసుపత్రుల్లో రూ.1.5 లక్షల వరకు నగదు రహిత వైద్య సేవలు

రాజన్న సిరిసిల్ల ప్రతినిధి, అక్టోబర్ 29 (సింగిడి): రోడ్డు ప్రమాదాల్లో గాయపడిన బాధితులకు సకాలంలో వైద్య చికిత్స అందించి, వారి ప్రాణాలను కాపాడే లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పీఎం రహత్ పథకంపై ప్రజలు అవగాహన కలిగి ఉండాలని జిల్లా ఎస్పీ మహేష్ బి. గితే సూచించారు. జిల్లా పరిధిలో మొత్తం 07 ఆసుపత్రుల్లో ఈ పథకం కింద వైద్య సేవలు అందుబాటులో ఉన్నాయని అర్హత నిబంధనలకు అనుగుణంగా రూ. 1. 5 లక్షల వరకు గరిష్ఠంగా ఏడు రోజుల పాటు నగదు రహిత వైద్య చికిత్స పొందవచ్చని పేర్కొన్నారు. రోడ్డు ప్రమాదం జరిగిన వెంటనే బాధితులకు వీలైనంత త్వరగా వైద్య సహాయం అందించడం అత్యంత కీలకమని ప్రమాదంలో గాయపడిన వారిని సమీపంలోని ఆసుపత్రికి తరలించి, అత్యవసర వైద్య చికిత్స అందేలా సహకరించాలని ప్రజలకు సూచించారు.
ప్రమాద బాధితులకు సకాలంలో చికిత్స అందించడం ద్వారా ప్రాణాపాయ పరిస్థితులను నివారించవచ్చని తెలిపారు.రోడ్డు ప్రమాద బాధితులకు సహాయం చేయడానికి ప్రజలు ముందుకు రావాలని, ప్రమాదం జరిగినప్పుడు క్షతగాత్రులను ఆదుకోవడంలో నిర్లక్ష్యం చేయవద్దని అత్యవసర పరిస్థితుల్లో 112కు కాల్ చేసి పోలీసుల సహాయం పొందాలని సూచించారు. అదేవిధంగా, ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని, ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించాలని, కార్లలో ప్రయాణించేవారు సీటు బెల్ట్ పెట్టుకోవాలని, అతివేగం, మద్యం సేవించి వాహనాలు నడపడం వంటి ప్రమాదకర చర్యలకు దూరంగా ఉండాలని ఎస్పీ సూచించారు.



రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్‌గా కూరాకుల శ్రీనివాస్ యాదవ్



మానకొండూర్,అక్టోబర్ 29(సింగిడి): తెలంగాణ గ్రామ పంచాయతీ ఎంప్లాయిస్ యునైటెడ్ అసోసియేషన్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్‌గా కరీంనగర్ జిల్లా మానకొండూరు మండలం పచ్చునూరు గ్రామానికి చెందిన కూరాకుల శ్రీనివాస్ యాదవ్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. హైదరాబాద్‌లోని సంఘం రాష్ట్ర కార్యాలయంలో నిర్వహించిన ముఖ్య సమావేశంలో సభ్యులు నూతన రాష్ట్ర కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కూరాకుల శ్రీనివాస్ యాదవ్,రాష్ట్ర అధ్యక్షుడు సాదుల శ్రీకాంత్,రాష్ట్ర కార్యదర్శి సత్తు వెంకన్న, అధ్యక్షుడు వెంకటేష్ ఇంద్రవెల్లి, ఈ సందర్భంగా సంఘం అధ్యక్షుడు వెంకటేష్ ఇంద్రవెల్లి మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా గ్రామ పంచాయతీల్లో రేయింబవళ్లు శ్రమిస్తున్న సుమారు 50 వేల మంది ఉద్యోగుల సమస్యలను ప్రభుత్వం ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్ళి,వాటి పరిష్కారానికి శక్తివంచన లేకుండా కృషి చేస్తామని హామీ ఇచ్చారు. నూతన వర్కింగ్ ప్రెసిడెంట్ కూరాకుల శ్రీనివాస్ యాదవ్ మాట్లాడుతూ విధుల్లో ఉన్న గ్రామ పంచాయతీ ఉద్యోగులను ఎవరైనా మానసికంగా వేధించినా లేదా ఇబ్బందులకు గురిచేసినా సహించేది లేదని హెచ్చరించారు. బాధ్యులపై చట్టపరమైన కఠిన చర్యలు తీసుకునేలా సంఘం తరపున పోరాడుతామని స్పష్టం చేశారు. ఉద్యోగుల హక్కుల పరిరక్షణ, వారి న్యాయమైన సమస్యల పరిష్కారమే ఈ సంఘం ప్రధాన లక్ష్యమని ఆయన పేర్కొన్నారు. ఈ నూతన కార్యవర్గ ఎన్నికల సమావేశంలో రాష్ట్రంలోని వివిధ జిల్లాల నుండి విచ్చేసిన సంఘం ముఖ్య నాయకులు, జిల్లా ప్రతినిధులు, పెద్ద సంఖ్యలో సభ్యులు పాల్గొన్నారు. నూతనంగా ఎన్నికైన కార్యవర్గానికి వారు శుభాకాంక్షలు తెలిపారు.

బిజెపి ఎస్టీ మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శిగా మొగిలి శ్రీనివాస్ నియామకం



మానకొండూర్, అక్టోబర్29(సింగిడి): మానకొండూర్ మండలం ముంజంపల్లి గ్రామానికి చెందిన మొగిలి శ్రీనివాస్ బిజెపి ఎస్టీ మోర్చా కరీంనగర్ జిల్లా ప్రధాన కార్యదర్శిగా నియమితులయ్యారు. ఈ మేరకు బిజెపి ఎస్టీ మోర్చా జిల్లా అధ్యక్షులు రమావత్ శ్రీనివాస్ నాయక్ ఉత్తర్వులు జారీ చేశారు.
ఈ సందర్భంగా మొగిలి శ్రీనివాస్ మాట్లాడుతూ తన నియామకానికి సహకరించిన కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్, బిజెపి జిల్లా అధ్యక్షులు సాయిని మల్లేశం, ఎస్టీ మోర్చా జిల్లా అధ్యక్షులు రమావత్ శ్రీనివాస్ నాయక్, బిజెపి జిల్లా ఉపాధ్యక్షులు గుర్రాల వెంకటరెడ్డి, సీనియర్ నాయకులు రంగు భాస్కరాచారి, రాపాక ప్రవీణ్, బిజెపి మానకొండూరు మండల అధ్యక్షులు కంది రాజిరెడ్డిలకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. పార్టీ బలోపేతానికి, ఎస్టీల సంక్షేమానికి తన శాయశక్తులా కృషి చేస్తానని

గంజాయి సరఫరా మూలాలపై ఉక్కుపాదం..

అక్రమ సంపాదనతో కూడిన ఆస్తుల సీజ్‌కు సీపీ ఆదేశాలు

వ్యసనాల బారిన పడిన 55 మంది యువతకు కౌన్సెలింగ్..

డ్రగ్స్ రహిత కమిషనరేట్‌గా రామగుండం రూపుదిద్దడమే లక్ష్యం: సీపీ అంబర్ కిషోర్ ఝా



గోదావరిఖని, అక్టోబర్ 29 (సింగిడి): యువత భవిష్యత్తును బలితీసుకుంటున్న మాదకద్రవ్యాల మహమ్మారిపై రామగుండం పోలీస్ కమిషనరేట్ యుద్ధం ప్రకటించింది. గంజాయి అక్రమ రవాణా, విక్రయాల వెనుక ఉన్న కీలక వ్యక్తులను గుర్తించి, సరఫరా వ్యవస్థను సమూలంగా నిర్మూలించేందుకు పోలీస్ యంత్రాంగం కార్యాచరణను వేగవంతం చేసింది. డ్రగ్స్ వ్యాపారంతో అక్రమంగా ఆర్జించిన ఆస్తులను గుర్తించి చట్టపరంగా సీజ్ లేదా ఫ్రీజ్ చేయాలని పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా అధికారులను ఆదేశించారు. కమిషనరేట్ కార్యాలయంలో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఎన్‌డీపీఎస్ కేసుల దర్యాప్తు పురోగతి, పెండింగ్ కేసులు, గంజాయి సరఫరా మార్గాలు, అక్రమ వ్యాపారంలో కీలక పాత్ర పోషిస్తున్న వ్యక్తులపై చర్చించారు. కేవలం మాదకద్రవ్యాలను స్వాధీనం చేసుకోవడం, చిన్నస్థాయి విక్రేతలను అరెస్టు చేయడానికే పరిమితం కాకుండా.. సరఫరా వెనుక ఉన్న ప్రధాన సూత్రధారులను గుర్తించి వారి నెట్‌వర్క్‌ను ఛేదించాలని సీపీ స్పష్టం చేశారు.డ్రగ్స్ అక్రమ వ్యాపారంలో ప్రత్యక్షంగా, పరోక్షంగా పాల్గొంటున్న వ్యక్తుల కదలికలపై నిఘా పెంచాలని, సరఫరా గొలుసులోని ప్రతి కీలక లింక్‌ను గుర్తించి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అక్రమ సంపాదనతో కూడిన ఆస్తులను గుర్తించి, సంబంధిత చట్టాల ప్రకారం జప్తు లేదా ఫ్రీజ్ చేసే చర్యలు చేపట్టాలని సూచించారు. ఈగిల్ టీమ్ ఎస్పీ గిరిధర్ కూడా మాదకద్రవ్యాల సరఫరాదారులు, విక్రేతలు, కీలక నిందితులపై నిరంతర నిఘా కొనసాగించాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు.మాదకద్రవ్యాల వినియోగం యువత జీవితాలపై చూపుతున్న ప్రతికూల ప్రభావాన్ని గుర్తించిన పోలీసులు.. గంజాయి వ్యసనానికి అలవాటుపడిన 55 మంది యువతకు కౌన్సెలింగ్ నిర్వహించారు. వ్యసనాలకు బానిసలై విలువైన జీవితాన్ని నాశనం చేసుకోవద్దని, చెడు అలవాట్లను విడనాడి విద్య, నైపుణ్యాభివృద్ధి, ఉపాధి అవకాశాలపై దృష్టి సారించాలని సూచించారు. అవసరమైన వారికి తగిన మార్గదర్శకత్వం, పునరావాస సహకారం అందించేందుకు సిద్ధంగా ఉన్నామని భరోసా కల్పించారు. మాదకద్రవ్యాల నిర్మూలన పోలీసుల ఒక్కరి బాధ్యత మాత్రమే కాదని, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, విద్యాసంస్థలు, ప్రజలు సమష్టిగా భాగస్వాములు కావాలని అధికారులు పిలుపునిచ్చారు. యువత ప్రవర్తనలో అనుమానాస్పద మార్పులు కనిపించినప్పుడు అప్రమత్తంగా ఉండాలని, గంజాయి లేదా ఇతర మాదకద్రవ్యాల అక్రమ విక్రయాలపై సమాచారం తెలిస్తే పోలీసులకు తెలియజేయాలని సూచించారు. రామగుండం కమిషనరేట్ పరిధిని మాదకద్రవ్యాల రహిత ప్రాంతంగా తీర్చిదిద్దేందుకు కఠినమైన నిఘా, సమర్థవంతమైన దర్యాప్తు, ప్రజల సహకారంతో ముందుకు సాగుతామని పోలీస్ ఉన్నతాధికారులు స్పష్టం చేశారు.ఈ సమీక్ష సమావేశంలో మంచిర్యాల డీసీపీ ఎ. భాస్కర్, అడిషనల్ డీసీపీ కె. శ్రీనివాస్, ఏసీపీలు, ఈగిల్ టీమ్, టాస్క్‌ఫోర్స్ అధికారులు, సీఐలు, ఎస్ఐలు పాల్గొన్నారు.

సత్యమ్మ మృతి పట్ల ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతరావు సంతాపం



కామారెడ్డి అక్టోబర్ 29 (సింగిడి): కామారెడ్డి జిల్లా జుక్కల్ నియోజకవర్గం పిట్లం మండలం చిన్నకొడప్గల్ గ్రామానికి చెందిన మాజీ ఎంపీటీసీ సుగు రెడ్డి వెంకట్రాంరెడ్డి మాతృమూర్తి సుగు రెడ్డి సత్యమ్మ అనారోగ్యంతో మృతి చెందడం పట్ల జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతరావు, కామారెడ్డి జిల్లా కాంగ్రెస్ కమిటీ (డీసీసీ) అధ్యక్షుడు ఏలే మల్లికార్జున్ తీవ్ర సంతాపం వ్యక్తం చేశారు. సత్యమ్మ మృతి విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతరావు, డీసీసీ అధ్యక్షుడు ఏలే మల్లికార్జున్ గురువారం చిన్నకొడప్గల్ గ్రామంలోని వెంకట్రాంరెడ్డి నివాసానికి వెళ్లారు. ఈ సందర్భంగా సత్యమ్మ చిత్రపటానికి నివాళులర్పించి, ఆమె మృతి పట్ల తమ ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. అనంతరం మాజీ ఎంపీటీసీ సుగు రెడ్డి వెంకట్రాంరెడ్డితో పాటు కుటుంబ సభ్యులను పరామర్శించి, వారి కుటుంబానికి అండగా ఉంటామని భరోసా కల్పించారు. ఆప్తురాలిని కోల్పోయిన కుటుంబ సభ్యులకు మనోధైర్యం కలగాలని ఆకాంక్షించారు. సత్యమ్మ ఆత్మకు శాంతి చేకూరాలని, ఆమె కుటుంబ సభ్యులకు భగవంతుడు ఈ విషాదాన్ని తట్టుకునే శక్తిని ప్రసాదించాలని ప్రార్థించారు. ఈ కార్యక్రమంలో పిట్లం పీఏసీఎస్ చైర్మన్, అడ్వకేట్ ధర్మారెడ్డి గారి రాంరెడ్డి, పిట్లం మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ కృష్ణారెడ్డి, పిట్లం మండల కాంగ్రెస్ అధ్యక్షుడు రవీందర్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

యువతలో నైతిక విలువలకు ఎన్‌టీపీసీ పెద్దపీట!

విద్యార్థుల్లో నిజాయితీ, పారదర్శకతపై అవగాహనకు వినూత్న కార్యక్రమాలు..

వ్యాసరచన, చిత్రలేఖనం, వక్తృత్వ పోటీల విజేతలకు సత్కారం



గోదావరిఖని అక్టోబర్ 29 (సింగిడి): విద్యార్థి దశ నుంచే నిజాయితీ, నైతిక విలువలు, జవాబుదారీతనం పట్ల అవగాహన పెంపొందించడమే లక్ష్యంగా ఎన్‌టీపీసీ రామగుండం ఆధ్వర్యంలో విజిలెన్స్ అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ప్రివెంటివ్ విజిలెన్స్ అవేర్‌నెస్ క్యాంపెయిన్--2026లో భాగంగా రామగుండం టౌన్‌షిప్‌లోని కేంద్రీయ విద్యాలయం (కేవీ), సెయింట్ క్లేర్ స్కూల్, చిన్మయ స్కూల్‌లలో విద్యార్థులకు వివిధ పోటీలు నిర్వహించి నైతిక విలువల ప్రాధాన్యతను వివరించారు. విద్యార్థుల్లో సృజనాత్మకతను వెలికితీస్తూ, అవినీతి నివారణ, పారదర్శకత, సమగ్రత, నిజాయితీ వంటి అంశాలపై అవగాహన కల్పించేందుకు చిత్రలేఖనం, వ్యాసరచన, వక్తృత్వ పోటీలను ఏర్పాటు చేశారు. ఈ పోటీల ద్వారా విద్యార్థులు వ్యక్తిగత జీవితంలోనే కాకుండా సమాజంలోనూ నైతిక ప్రమాణాలను పాటించాల్సిన అవసరాన్ని తెలియజేశారు. ఈ కార్యక్రమాలు ఎన్‌టీపీసీ విజిలెన్స్ విభాగం ఏజీఎం రాజిత్ కుమార్ గుండా మార్గదర్శకత్వంలో జరిగాయి. పోటీల్లో ప్రతిభ కనబరిచి విజయం సాధించిన విద్యార్థులను గురువారం అభినందించి సత్కరించారు. అనంతరం నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ముందస్తు విజిలెన్స్ చర్యల ప్రాముఖ్యతను, అవినీతిని అరికట్టడంలో ప్రతి ఒక్కరి బాధ్యతను వివరించారు. విద్యార్థులు, కార్యక్రమంలో పాల్గొన్న వారితో సమగ్రత ప్రతిజ్ఞ చేయించి, నిజాయితీ, పారదర్శకత, నైతిక ప్రవర్తనకు కట్టుబడి ఉండాలని పిలుపునిచ్చారూ. విద్యార్థుల్లో చిన్ననాటి నుంచే విలువలతో కూడిన ఆలోచనా విధానాన్ని పెంపొందించడం ద్వారా బాధ్యతాయుత పౌరులను తీర్చిదిద్దవచ్చని ఎన్‌టీపీసీ రామగుండం భావిస్తోంది. ఇలాంటి కార్యక్రమాల ద్వారా యువతలో నైతిక చైతన్యాన్ని పెంపొందిస్తూ, పారదర్శకమైన పాలనకు, జవాబుదారీతనానికి, అవినీతి రహిత సమాజ నిర్మాణానికి దోహదపడుతోంది. విద్యార్థుల భాగస్వామ్యంతో నిర్వహించిన ఈ కార్యక్రమాలు నైతిక విలువల పట్ల వారిలో అవగాహన పెంపొందించేందుకు దోహదపడ్డాయి.

ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగులను వెంటనే రెగ్యులర్ చేయాలి

సమాన పనికి సమాన వేతనం, ఆరోగ్య భద్రత కల్పించాలని డిమాండ్



జమ్మికుంట, అక్టోబర్ 29(సింగిడి): జాతీయ ఆరోగ్య మిషన్ (ఎన్‌హెచ్‌ఎం) పథకం కింద కాంట్రాక్టు, అవుట్‌సోర్సింగ్ పద్ధతుల్లో పనిచేస్తున్న ఉద్యోగులను వెంటనే క్రమబద్ధీకరించాలని స్థానిక ఏఎన్‌ఎంలు ఎండీ సాజిదా పర్వీన్, శ్యామల, రజిత రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం జమ్మికుంట పట్టణంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్రంలో ఎన్‌హెచ్‌ఎం పథకం కింద వివిధ కేటగిరీలకు చెందిన 17,541 మంది ఉద్యోగులు కాంట్రాక్టు, అవుట్‌సోర్సింగ్ పద్ధతుల్లో విధులు నిర్వహిస్తున్నారని తెలిపారు. ఈ నెల 13వ తేదీ నుంచి రాష్ట్రవ్యాప్తంగా నిరవధిక సమ్మె చేపట్టినట్లు పేర్కొన్నారు. ఈ సమ్మెలో 78 కేడర్లకు చెందిన వైద్యులు, నర్సులు, ఏఎన్‌ఎంలు, ల్యాబ్ టెక్నీషియన్లు పాల్గొంటున్నారని వివరించారు. ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగులను రెగ్యులర్ చేయడంతో పాటు సమాన పనికి సమాన వేతనం అందించాలని కోరారు. గత 20 ఏళ్లుగా కాంట్రాక్టు, అవుట్‌సోర్సింగ్ విధానంలో పనిచేస్తున్నప్పటికీ ఉద్యోగ భద్రత లేకపోవడంతో తమ కుటుంబాలు ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఇదే పథకం కింద ఇతర రాష్ట్రాల్లో పనిచేస్తున్న కొందరు ఉద్యోగులను క్రమబద్ధీకరించినట్లు పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం తమ సమస్యలపై స్పందించి ఉద్యోగాలను క్రమబద్ధీకరించాలని, తమకు ఉద్యోగ భద్రత కల్పించి కుటుంబాలను ఆదుకోవాలని వారు కోరారు. ఈ సమావేశంలో ఏఎన్‌ఎంలు తిరుమల, కవిత, సంధ్య, హైమ, రమ, మణి తదితరులు పాల్గొన్నారు.

గనుల నుంచి కార్యాలయాల వరకు.. బీసీ హక్కుల పోరు!

ఆర్‌జీ-1 ఏరియాలో పది విభాగాలకు నూతన పిట్ కార్యదర్శులు

రోస్టర్ ఆధారిత పదోన్నతులే లక్ష్యం.. బీసీ, ఓబీసీ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కార్యాచరణ

ఆర్ జి-1 ఏరియా వైస్ ప్రెసిడెంట్ పెంచాల తిరుపతి



గోదావరిఖని, అక్టోబర్ 29 (సింగిడి): సింగరేణి బొగ్గు గనుల్లో పనిచేస్తున్న బీసీ, ఓబీసీ ఉద్యోగుల హక్కుల పరిరక్షణతో పాటు వారికి న్యాయంగా అందాల్సిన పదోన్నతులు, ఇతర ప్రయోజనాల సాధన దిశగా బీసీ, ఓబీసీ సంఘం కార్యాచరణకు శ్రీకారం చుట్టింది. సంఘాన్ని క్షేత్రస్థాయిలో మరింత పటిష్టం చేయడమే లక్ష్యంగా ఆర్‌జీ-1 ఏరియా పరిధిలోని పది గనులు, వివిధ విభాగాలకు పిట్ కార్యదర్శులను నియమించింది. ఈ నియామకాలతో ఉద్యోగుల సమస్యలను గుర్తించి, వాటి పరిష్కారానికి సమష్టిగా పోరాడేందుకు సంఘం నాయకత్వం ప్రణాళిక సిద్ధం చేసింది.బీసీ, ఓబీసీ సంఘం అధ్యక్షుడు నాగేశ్వరరావు, ప్రధాన కార్యదర్శి నల్లపూరి రమేష్ ఆదేశాల మేరకు ఆర్‌జీ-1 ఏరియా వైస్ ప్రెసిడెంట్ పెంచాల తిరుపతి, సెక్రటరీ బత్తుల పోశం, లైజన్ ఆఫీసర్ పెరుమాళ్ల శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఈ నియామకాలు చేపట్టారు. వివిధ గనులు, కార్యాలయాలు, సాంకేతిక విభాగాల్లో పనిచేస్తున్న ఉద్యోగులకు సంఘ బాధ్యతలు అప్పగిస్తూ సంస్థాగత నిర్మాణాన్ని బలోపేతం చేసే దిశగా అడుగులు వేశారు.

ఆర్‌జీ-1 ఏరియా పరిధిలో నియమితులైన పది మంది కార్యదర్శులు వీరే:

1. జీడీకే-1 ఇంక్లైన్: రాదండి బాలయ్య
2. జీడీకే-2 ఇంక్లైన్: బండోజు సాయికుమార్ -- ఓవర్‌మెన్
3. జీడీకే-2ఏ ఇంక్లైన్: పల్లె ప్రసాద్ యాదవ్ -- జనరల్ అసిస్టెంట్
4. జీడీకే ఓసీ-5: జనగామ శ్రీనివాస్ -- ఈపీ ఆపరేటర్
5. జీడీకే-11 ఇంక్లైన్: పడాల వినయ్ కుమార్ -- ఓవర్‌మెన్
6. జీడీకే-1 సీఎస్‌పీ: పి. మురళి -- వెల్డర్
7. జీడీకే సివిల్ డిపార్ట్‌మెంట్: తోట చంద్రయ్య -- పీవోపీ
8. జీడీకే ఏరియా ఆసుపత్రి: అడప కుమారస్వామి -- వార్డ్ అసిస్టెంట్
9. జీడీకే ఏరియా వర్క్‌షాప్: ఇండ్ల మల్లయ్య -- టెండల్
10. ఆర్‌జీ-1 జనరల్ మేనేజర్ కార్యాలయం: కొత్తవల్ల రాంబాబు -- డివ్యూటీ సూపరింటెండెంట్

రోస్టర్ విధానంతో పదోన్నతుల సాధనకు కృషి

సింగరేణిలో బీసీ, ఓబీసీ ఉద్యోగులకు రావాల్సిన న్యాయబద్ధమైన ప్రయోజనాలను సాధించడమే తమ ప్రధాన లక్ష్యమని సంఘం నాయకులు స్పష్టం చేశారు. ముఖ్యంగా రోస్టర్ విధానం ఆధారంగా అర్హులైన బీసీ ఉద్యోగులకు పదోన్నతులు కల్పించే అంశంపై ప్రత్యేక దృష్టి సారిస్తామని తెలిపారు. ఉద్యోగులకు ఎదురవుతున్న సమస్యలను గుర్తించి, వాటిని సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారం కోసం కృషి చేస్తామని పేర్కొన్నారు.

ఒక్కటిగా ముందుకు.. హక్కుల కోసం పోరాటం

గనులు, విభాగాల స్థాయిలో సంఘాన్ని బలోపేతం చేయడంతో పాటు బీసీ, ఓబీసీ ఉద్యోగులందరినీ ఒకే వేదికపైకి తీసుకురావడమే నూతన కార్యదర్శుల నియామకాల వెనుక ప్రధాన ఉద్దేశమని నాయకులు తెలిపారు. ఉద్యోగుల హక్కులు, పదోన్నతులు, సంక్షేమం వంటి అంశాల్లో కార్యదర్శులు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సూచించారు. సంఘటిత శక్తితో ముందుకు సాగుతూ బీసీ, ఓబీసీ ఉద్యోగులకు న్యాయం జరిగే వరకు నిరంతరం కృషి చేస్తామని వారు వెల్లడించారు.

విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకొని, పట్టుదలతో కృషి చేయాలి

సురక్షిత్ బచ్పన్ అభియాన్ బాలలపై లైంగిక నేరాల నిరోధానికి పాఠశాలల్లో అవగాహన కార్యక్రమం

పోక్సో చట్టంపై విద్యార్థులకు అవగాహన

సిరిసిల్ల రెండవ అదనపు జూనియర్ సివిల్ జడ్జి కుమారి గడ్డం మేఘన





రాజన్న సిరిసిల్ల, ప్రతినిధి అక్టోబర్ 29 (సింగిడి): విద్యార్థులు జీవితంలో ఉన్నతమైన లక్ష్యాలను నిర్దేశించుకొని, వాటిని సాధించేందుకు పట్టుదలతో, క్రమశిక్షణతో, నిరంతరం కృషి చేయాలని సిరిసిల్ల రెండవ అదనపు జూనియర్ సివిల్ జడ్జి కుమారి గడ్డం మేఘన అన్నారు.గురువారం రోజున జిల్లా కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత బాలికల పాఠశాల, గీతానగర్ లో తెలంగాణ రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ, హైదరాబాద్ ఆదేశాలతో, జిల్లా ప్రధాన న్యాయమూర్తి జిల్లా న్యాయ సేవాధికార సంస్థ అధ్యక్షురాలు.పి.నీరజ సూచనలతో బాలల హక్కులపై అవగాహన పెంపొందించడం లక్ష్యంగా "సురక్షిత్ బచ్పన్ అభియాన్" పేరుతో జిల్లా వ్యాప్తంగా నిర్వహిస్తున్న పాఠశాలల స్థాయి అవగాహన కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. పోక్సో చట్టం ప్రకారం, పిల్లలపై లైంగిక వేధింపులు లేదా అనుచిత ప్రవర్తనకు సంబంధించిన సంఘటనలు జరిగినప్పుడు వాటిని నిర్భయంగా సంబంధిత అధికారుల దృష్టికి తీసుకురావాలని, బాధిత పిల్లలకు తక్షణ రక్షణ, న్యాయ సహాయం అందించడంలో ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా వ్యవహరించాలని తెలిపారు. పిల్లలపై లైంగిక నేరాలు జరిగినప్పుడు వాటిని దాచిపెట్టకుండా, చట్టప్రకారం సంబంధిత అధికారులకు సమాచారం అందించాలని, బాధిత పిల్లల వ్యక్తిగత వివరాల గోప్యతను కాపాడుతూ వారికి మానసిక ధైర్యం, భరోసా కల్పించాలని సూచించారు. ఈ అవగాహన కార్యక్రమంలో ఇంచార్జి హెడ్ మాస్టర్ యం.తిరుపతి, లోక్ అదాలత్ సభ్యులు చింతోజు భాస్కర్, న్యాయవాదులు ఆడెపు వేణు, కళ్యాణి, కుంట శ్రీనివాస్, ఉపాధ్యాయులు మరియు విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

ఇంటి దొంగతనాల ముఠా అరెస్ట్..

లక్షల విలువైన బంగారు, వెండి ఆభరణాలు స్వాధీనం



పెద్దపల్లి ప్రతినిధి, అక్టోబర్ 29 (సింగిడి): ఇంటి దొంగతనాలకు పాల్పడుతున్న ముగ్గురు సభ్యుల ముఠాను జూలపల్లి పోలీసులు ఎంతో చాకచక్యంగా పట్టుకున్నారు. బుధవారం వారిని అరెస్ట్ చేసి వారి నుంచి 10 గ్రాముల బంగారు ముద్ద, ఒక జత బంగారు కమ్మలు (2.9 గ్రాములు), ఒక జత వెండి పట్టీలను (58 గ్రాములు) స్వాధీనం చేసుకున్నారు. సబ్ ఇన్స్పెక్టర్ బి మల్లేష్ తెలిపిన వివరాల ప్రకారం... పెద్దాపూర్ బస్ స్టాప్ వద్ద దొంగిలించిన ఆభరణాలను అమ్మకానికి తీసుకెళ్తుండగా పక్కా సమాచారంతో నిందితులను అదుపులోకి తీసుకున్నారు. అరెస్ట్ అయిన వారిలో కుమ్మరికుంటకు చెందిన ఎక్కిరాల రాకేశ్ (20), పెద్దాపూర్ గ్రామానికి చెందిన కళ్ళెపెల్లి జాన్ (21), కళ్ళెపెల్లి సాయి చరణ్ (19) ఉన్నారు. వీరు తాళాలు వేసి ఉన్న ఇళ్లను లక్ష్యంగా చేసుకుని, యజమానులు లేని సమయంలో తాళాలు పగలగొట్టి చోరీలకు పాల్పడేవారు. దొంగిలించిన బంగారాన్ని మహారాష్ట్రకు తీసుకెళ్లి కరిగించడం లేదా గుర్తుతెలియని వ్యక్తులకు విక్రయించేవారని విచారణలో తేలిందని తెలిపారు. వీరు జూలపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలోని కుమ్మరికుంటలో ఒక చోట, పెద్దాపూర్ గ్రామంలో రెండు చోట్ల దొంగతనాలకు పాల్పడినట్లు తెలిపారు. ప్రజలు ఇళ్లను విడిచి వెళ్లేటప్పుడు నాణ్యమైన తాళాలు వేసుకోవాలని, అనుమానాస్పద వ్యక్తులు కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని జూలపల్లి ఎస్ ఐ మల్లేష్ కోరారు.

గిరిజన సమస్యల పరిష్కారానికి కృషి చేస్తా

జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యుడు హుస్సేన్‌నాయక్ హామీ



కామారెడ్డి అక్టోబర్ 29 (సింగిడి): కామారెడ్డి జిల్లా గాంధారి మండలంలోని గిరిజన తండాల ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యుడు హుస్సేన్ నాయక్ దృష్టికి తీసుకెళ్లారు. గిరిజనుల ఇబ్బందులను ఆయనకు వివరించి, ఆయా సమస్యలను పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని నాయకులు కోరారు. దీనిపై ఆయన సానుకూలంగా స్పందిస్తూ, సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చినట్లు వారు తెలిపారు. గాంధారి మండలంలోని గిరిజన ప్రాంతాల్లో నెలకొన్న పోడు భూముల సమస్యలు, గ్రామ పంచాయతీలకు సంబంధించిన సమస్యలు, రహదారుల ఇబ్బందులు తదితర అంశాలను కమిషన్ సభ్యుడి దృష్టికి తీసుకెళ్లారు. గిరిజన కుటుంబాలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను వివరించి, వాటికి తగిన పరిష్కార మార్గాలు చూపాలని విజ్ఞప్తి చేశారు. గిరిజన తండాల్లో మౌలిక సదుపాయాల అభివృద్ధి, రహదారుల నిర్మాణం, గ్రామ పంచాయతీలకు సంబంధించిన సమస్యల పరిష్కారంతో పాటు పోడు భూముల అంశంపై సంబంధిత అధికారులు స్పందించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. గిరిజనులకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు, అభివృద్ధి ఫలాలు అందేలా చూడాలని విన్నవించారు. ఈ సందర్భంగా జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యుడు హుస్సేన్ నాయక్ సమస్యలపై సానుకూలంగా స్పందించి, వాటి పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చినట్లు నాయకులు వెల్లడించారు. గిరిజన ప్రాంతాల్లోని సమస్యలను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి, పరిష్కారానికి కృషి చేయాల్సిన అవసరం ఉందని వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో గుజ్జుల్ తండా సర్పంచ్ ఖట్రోత్ రవీందర్, మాజీ సర్పంచ్ బాధావత్ వసంత్ రావు, లోంక తండా మాజీ సర్పంచ్ తేజావత్ ప్రేమ్ సింగ్, ఎస్టీ సెల్ అధ్యక్షుడు సకరం నాయక్ తదితరులు పాల్గొన్నారు. గిరిజనుల సమస్యలను జాతీయ స్థాయి కమిషన్ దృష్టికి తీసుకెళ్లేందుకు సహకరించిన ప్రతి ఒక్కరికీ నాయకులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

నూతన వస్త్రాలంకరణ వేడుకకు ఎమ్మెల్యే కవ్వంపల్లి హాజరు



మానకొండూర్, అక్టోబర్29(సింగిడి): మండలంలోని రంగపేట గ్రామంలో కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు కొమ్ము అంజలి--చంద్రయ్య దంపతుల కుమార్తె లాస్య నూతన వస్త్రాలంకరణ వేడుకకు మానకొండూర్ ఎమ్మెల్యే, టీపీసీసీ ఎస్సీ సెల్ చైర్మన్ డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ హాజరయ్యారు. ఈ సందర్భంగా లాస్యను ఆశీర్వదించి, శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ అధ్యక్షుడు ద్యావ శ్రీనివాస్ రెడ్డి, కరీంనగర్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ ఆకుల నర్సయ్య, మానకొండూర్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ రేవెల్లి రాజలింగం, వైస్ చైర్మన్ రేమిడి శ్రీనివాస్ రెడ్డి, మాజీ చైర్మన్, వైస్ చైర్మన్లు మర్రి ఓదెలు యాదవ్,రామిడి తిరుమల్ రెడ్డి,సర్పంచ్ కొత్త రాంరెడ్డి,ఉప సర్పంచ్ వేల్పుల కొమురయ్య యాదవ్,పీఏసీఎస్ చైర్మన్ ముద్దసాని శ్రీనివాస్ రెడ్డి, పార్టీ గ్రామశాఖ అధ్యక్షుడు గుడాల మహేందర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు బుర్ర శ్రీధర్ గౌడ్, గోపు శ్రీనివాస్ రెడ్డి హాజరై శుభాకాంక్షలు తెలిపారు.

ఇందిరమ్మ ఇండ్లు త్వరితగతిన పూర్తి చేయించాలి

- **ఆర్థిక సహాయం సద్వినియోగం చేసుకునేలా అవగాహన కల్పించాలి**
- **ఇందిరమ్మ ఇండ్ల పురోగతిలో ఉత్తమ ప్రతిభ చూపిన బోయినపల్లి, ఇల్లంతకుంట అధికారులకు అభినందనలు**
- **జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్**



రాజన్న సిరిసిల్ల ప్రతినిధి, అక్టోబర్ 29 (సింగిడి): రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలను త్వరితగతిన పూర్తి చేయించాలని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆదేశించారు. ఇందిరమ్మ ఇండ్ల మంజూరు, నిర్మాణం తదితర అంశాలపై జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్. మండల ప్రత్యేక అధికారులు, ఎంపీడీఓలు, హౌసింగ్ ఏఈలతో జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయం నుంచి గురువారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష సమావేశం నిర్వహించారు. ముందుగా ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పురోగతిపై మండలాల వారిగా సమీక్ష చేశారు. జిల్లాలో ఇప్పటిదాకా 6,465 ఇండ్లకు ముగ్గు పోశామని, 5,479 ఇండ్లు బేస్మెంట్ లెవెల్లో, 4, 858 ఇండ్లు గోడల లెవెల్ లో, 4,585 స్లాబ్ లెవెల్ లో, 3,934 ఇండ్లు పూర్తి అయ్యాయని జిల్లా కలెక్టర్ వెల్లడించారు. ముగ్గు పోసిన వారితో ఇంటి నిర్మాణ పనులు మొదలు పెట్టించాలని, బేస్మెంట్ వరకు పూర్తి చేసిన వారిని గోడల వరకు, అక్కడి నుంచి స్లాబ్ లెవెల్ కు, తుది దశ పనులు పూర్తి చేసేలా. ప్రభుత్వ ఆర్థిక సహాయాన్ని సద్వినియోగం చేసుకునేలా చూడాలని ఆదేశించారు. జిల్లాలో గుడిసెల్లో ఉంటున్న వారికి ఇందిరమ్మ ఇండ్లు మంజూరు అయ్యాయని, త్వరితగతిన నిర్మాణ ప్రక్రియ మొదలు పెట్టాలని సూచించారు. రెండో విడత ఇందిరమ్మ ఇండ్ల కింద మంజూరు అయిన ఇండ్ల పై ఆరా తీసి.. వాటి పురోగతిపై అడిగి తెలుసుకున్నారు. ప్రతి ఎంపీడీఓ ఇండ్ల పురోగతిని పరిశీలించాలని సూచించారు. పురోగతిలో ఉన్న ఇండ్ల ఫోటోలు ఎప్పటికప్పుడు హౌసింగ్ ఏఈలు ఆన్లైన్ లో అప్ లోడ్ చేయాలని, లబ్దిదారుల బ్యాంక్ ఖాతాల్లో డబ్బులు జమ అవుతున్నాయని వెల్లడించారు.ఇందిరమ్మ ఇండ్ల లబ్దిదారులతో ఎంపీడీఓలు, హౌసింగ్ అధికారులు సమావేశమై వేగంగా ఇండ్ల నిర్మాణాలు పూర్తి చేసుకునేలా అవగాహన కల్పించాలని, ప్రభుత్వ ఆర్థిక సహాయాన్ని సద్వినియోగం చేసుకునేలా వివరించాలని ఆదేశించారు. మండల ప్రత్యేక అధికారులు, ఎంపీడీఓలు, హౌసింగ్ అధికారులు సమన్వయంతో ఇండ్ల నిర్మాణాలను ప్రణాళిక ప్రకారం పూర్తి చేయాలని సూచించారు. ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణంలో ఉత్తమ పనితీరు ప్రదర్శించిన బోయినపల్లి, ఇల్లంతకుంట మండలాల అధికారులు, సిబ్బందిని జిల్లా కలెక్టర్ అభినందించారు. వీడియో కాన్ఫరెన్స్ లో ఇంచార్జి హౌసింగ్ ప్రాజెక్ట్ డైరెక్టర్ ఖాజా ముజాఫరుద్దీన్, జిల్లా పంచాయతీ అధికారి వీర భద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

అతివ Athiva

సింగిడి

అరటితో అద్భుత మార్పులు ఇవే!



చాలా సులభంగా లభించే పోషకాల ఖజానా అయిన అరటిపండును ప్రతిరోజూ క్రమం తప్పకుండా తీసుకోవడం వల్ల శరీరానికి అద్భుతమైన ప్రయోజనాలు కలుగుతాయి. నిరంతరం 45 రోజుల పాటు రోజుకో అరటిపండు తింటే జీర్ణక్రియ మెరుగవుతుంది. మలబద్ధకం సమస్య దూరమవుతుంది. ఇందులో ఉండే పొటాషియం రక్తపోటును అదుపులో ఉంచడంతో పాటు గుండె ఆరోగ్యాన్ని పరిరక్షిస్తుంది. అంతేకాకుండా మరెన్నో లాభాలు ఉన్నాయి.. అవేంటో వివరంగా తెలుసుకుందాం..



రక్తపోటు నియంత్రణ, గుండె ఆరోగ్యం:
అరటిపండ్లలో పొటాషియం పరిమాణం చాలా ఎక్కువగా ఉంటుంది. ఇది శరీరంలో సోడియం ప్రభావాన్ని తగ్గించి, రక్తపోటును ఆరోగ్యకరమైన స్థాయిలో ఉంచడానికి సహాయపడుతుంది. అంతేకాకుండా, గుండె కండరాల పనితీరును మెరుగుపరచడం ద్వారా గుండె జబ్బుల ముప్పును తగ్గిస్తుందని వైద్య నిపుణులు పేర్కొంటున్నారు.

మెరుగైన జీర్ణక్రియ:
అరటిపండులో ఉండే డైటరీ ఫైబర్ జీర్ణ వ్యవస్థను సక్రమంగా ఉంచడంలో కీలక పాత్ర పోషిస్తుంది. దీన్ని 45 రోజుల పాటు క్రమం తప్పకుండా ఆహారంలో చేర్చుకోవడం వల్ల మలబద్ధకం వంటి సమస్యలు క్రమంగా తగ్గిపోతాయి. ఇది గట్ ఆరోగ్యానికి మేలు చేసే మంచి బ్యాక్టీరియాను వృద్ధి చేస్తుంది.

తక్షణ శక్తి, మెరుగైన మనస్థితి:
ఉదయం పూట అల్పాహారంగా లేదా వర్కౌట్ చేసే ముందు ఒక అరటిపండు తింటే శరీరానికి తక్షణ శక్తి లభిస్తుంది. ఇందులో ఉండే విటమిన్ బి6 మెదడు ఆరోగ్యానికి తోడ్పడటంతో పాటు, సెరోటోనిన్ హార్మోన్ ఉత్పత్తిని ప్రేరేపించి మానసిక ఆందోళనను తగ్గించి ఉల్లాసంగా ఉంచుతుంది.

తీసుకోవాల్సిన చిన్న జాగ్రత్తలు:
అరటిపండ్లు ఎన్నో ఆరోగ్య ప్రయోజనాలను కలిగి ఉన్నప్పటికీ, ఇప్పటికే అధిక బరువుతో బాధపడేవారు లేదా రోజువారీ క్యాలరీల పై శ్రద్ధ పెట్టేవారు వీటిని పరిమితంగా తీసుకోవాలి. అలాగే, తీవ్రమైన కిడ్నీ సంబంధిత సమస్యలు ఉన్నవారు పొటాషియం మోతాదు ఎక్కువగా ఉండే కారణంగా వైద్యుల సలహా తీసుకున్న తర్వాతే అరటిపండ్లను తినడం మంచిది. సమతుల్య ఆహారంలో భాగంగా రోజుకో అరటిపండును మితంగా తీసుకోవడం ద్వారా సంపూర్ణ ఆరోగ్యాన్ని సొంతం చేసుకోవచ్చు.

భారతదేశ అణు శక్తి పితామహుడు

హోమీ జహంగీర్ భాభా
అక్టోబర్ 30... హెచ్ జె భాభా జయంతి



హోమీ జహంగీర్ భాభా భారతదేశ అణు శక్తి రంగానికి పునాది వేసిన గొప్ప శాస్త్రవేత్త. భారత దేశం స్వాతంత్ర్యం పొందిన తరువాత, అణుశక్తిని శాంతియుత విధానాల్లో వాడేలా మార్గదర్శకత్వం చేసిన శాస్త్రవేత్తగా గుర్తింపు పొందాడు. ఆయన భారత దేశపు అణు శక్తి పితామహుడు అని సత్కరించ బడ్డాడు.

హోమీ భాభా 1909 అక్టోబరు 30 న బొంబాయి లోని (ముంబై) సంపన్న పార్సీ కుటుంబంలో జన్మించాడు. చిన్నప్పటి నుంచే ఆయనకు చదువు, శాస్త్రాల మీద ఆసక్తి ఉండేది. కుటుంబ సభ్యుల ప్రోత్సాహంతో ఆయన చదువులో ప్రతిభ చూపాడు.

హోమీ భాభా తన ఉన్నత విద్య కోసం ఇంగ్లాండ్‌లోని కేంబ్రిడ్జ్ విశ్వ విద్యాల యానికి వెళ్లాడు. అక్కడ రాధర్‌ఫోర్డ్ లేబొరేటరీలో శాస్త్రవేత్తలతో కలిసి కేంద్రక భౌతిక శాస్త్రం (చీబఎశ్రీమ్ఘతీ స్ఘ్మంఅఎం) రంగంలో తన పరిశోధనలను ప్రారంభిం చాడు. కేంబ్రిడ్జ్‌లో ఉన్నత స్థాయి విద్యను పొందిన తరువాత, ఆయన పరిశోధనల్లో అంతర్జాతీయ గుర్తింపు పొందాడు.

రెండవ ప్రపంచ యుద్ధం సమయంలో, భాభా అమెరికాలోని మాంహట్టన్ ప్రాజెక్ట్‌లో కూడా పాల్గొన్నాడు. ఈ ప్రాజెక్ట్ ప్రపంచపు మొట్టమొదటి అణుబాంబు అభివృద్ధికి సంబంధించింది. ఈ ప్రాజెక్ట్ ద్వారా ఆయనకు అణు శక్తి రంగంలో ఉన్న విస్తృత అవకాశాలపై అవగాహన పెరిగింది.

రెండవ ప్రపంచ యుద్ధం తర్వాత భాభా భారత దేశానికి తిరిగి వచ్చాడు. దేశానికి సేవ చేయాలనే తపనతో, భారత దేశంలో శాస్త్రీయ పరిశోధనలు అభివృద్ధి చెందాలన్న ఆశయంతో ముందుకు సాగాడు. దేశంలో సాంకేతిక రంగాన్ని అభివృద్ధి చేయడం కోసం భాభా తాటా ట్రస్ట్ సహకారంతో టాటా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫండమెంటల్ రీసెర్చ్ (ంఅఖీ=)ను 1945లో స్థాపించాడు. ంఅఖీ= భారతదేశంలో ప్రాథమిక శాస్త్ర, భౌతిక శాస్త్ర, అంతరిక్ష పరిశోధనలు మొదలైన రంగాల్లో ముఖ్య భూమికను పోషించింది.

1948లో భారత దేశం అణు శక్తి రంగంలో ముందుండాలని భావించి అణుశక్తి కమిషన్ను స్థాపించాడు. ఈ కమిషన్ ద్వారా అణుశక్తి పరిశోధనలకు బలమైన పునాది వేసి, శాంతియుత ప్రయోజనాల కోసం అణుశక్తి వినియోగం ఎలా ఉండాలో ప్రణాళికలు రూపొందించాడు. ఆయన అణుశక్తిని విద్యుత్ ఉత్పత్తి, వైద్యం, వ్యవ సాయం వంటి రంగాల్లో వినియోగించడానికి మార్గదర్శకత్వం అందించాడు.

1954లో, ముంబై సమీపంలోని ట్రాంబేలో భాభా అటామిక్ రీసెర్చ్ సెంటర్ (దీూా=జ)ను స్థాపించాడు. ఈ సంస్థ అణుశక్తి పరిశోధనలకు కేంద్రంగా మారింది. దీూా=జ ద్వారా స్వదేశీ అణు శక్తి పరిజ్ఞానాన్ని అభివృద్ధి చేయడానికి ఆయా విధానాలను అనుసరించి, అణు శక్తిని విద్యుత్ ఉత్పత్తిలో వినియోగించే విధంగా ప్రణాళికలు రూపొందించాడు.

భాభా అణుశక్తి రంగంలో స్వయం సమృద్ధిని కోరుకున్నాడు. ఆయన ప్రణాళికలు భారతదేశం అణుబాంబును అభివృద్ధి చేయడానికి బాటలు వేశాయి. భారత దేశానికి అత్యవసర సమయంలో సైనిక శక్తిని ప్రదర్శించడానికి అణు శక్తి అవసరమని, అలాగే దీన్ని శాంతియుత కార్యక్రమాల్లో కూడా ఉపయోగించవచ్చని ఆయన భావించాడు.

భారత దేశానికి అణు శక్తి రంగంలో ఆయన చేసిన సేవలకు గుర్తింపుగా భారత ప్రభుత్వం ఆయనను పద్మభూషణ్ పురస్కారంతో గౌరవించింది. ఇది భారత శాస్త్రజ్ఞులకు ఆయన అందించిన ప్రేరణకు గుర్తింపు లాంటిది.

భారతదేశపు అణు శక్తి కార్యక్రమానికి చేసిన కృషిని గుర్తిస్తూ, ఆయనను భారతదేశపు అణు శక్తి పితామహుడు అని సత్కరించారు. ఆయన నిరంతరం శాస్త్రీయ అభివృద్ధి కోసం ప్రయత్నించి, దేశానికి శక్తి స్వావలంబనను అందించే ప్రయత్నం చేశారు.

భాభా స్థాపించిన ంఅఖీ= మరియు దీూా=జ సంస్థలు ఇప్పటికీ భారతదేశంలో శాస్త్రీయ పరిశోధనలకు ప్రధాన కేంద్రాలుగా ఉన్నాయి. ఆయన అభిప్రాయాలే దేశానికి శక్తి, శాస్త్ర సాంకేతిక రంగాల్లో ఉన్నత స్థితిని తెచ్చాయి. భారతదేశం అణు శక్తి రంగంలో ప్రగతిని సాధించడానికి ఆయన చూపిన మార్గం నేటి వరకు మార్గదర్శకంగా నిలిచింది.

హోమీ జహంగీర్ భాభా భారతదేశంలో అణు శక్తి రంగంలో విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చాడు. ఆయన దృష్టి, పట్టుదల, మరియు శాస్త్రీయ దార్శనికత భారతదేశాన్ని అణు శక్తి రంగంలో ప్రపంచ పటంలో నిలిపింది.

రామ కిష్టయ్య సంగన భట్ల,
సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్
కాలమిస్ట్...9440595494

తొలి టచ్‌స్క్రీన్ మ్యాక్‌బుక్ ప్రో లాంచ్ చేసిన యాపిల్

గ్లోబల్ టెక్ దిగ్గజం యాపిల్ చరిత్రలో తొలిసారిగా అత్యంత శక్తివంతమైన 'ప్రోలెడ్ ఎక్స్‌డిఆర్' టచ్‌స్క్రీన్‌తో మ్యాక్‌బుక్ ప్రో మోడ ళ్లను మార్కెట్లోకి విడుదల చేసింది. 14-అంగుళాలు (రూ. 3,49,900), 16-అంగుళాలు (రూ. 4,09,900) ఆప్షన్ లతో మార్కెట్లోకి రానున్న ఈ డివైజ్ ఎం5 ప్రో, ఎం5 మ్యాక్స్ ప్రాసెసర్‌లతో పనిచేస్తుంది. ఈ ల్యాప్‌టాప్‌లలో 2,000 నిట్స్ బ్రైటెనెస్ అందిం చడమే కాకుండా, ఐఫోన్‌లోని 'డైనమిక్ ఐలాండ్' ట్యూప్, స్వైప్, పించ్ ఆప్షన్లను నేరుగా డిస్‌ప్లే ప్యానెల్‌లోనే సపోర్ట్ చేస్తుంది. ఎం5 ప్రో, ఎం5 మ్యాక్స్ ప్రాసెసర్‌లతో పనిచేసే ఈ ల్యాప్‌టాప్‌లలో 230 నుండి 320 గ్రాముల వరకు బరువు తగ్గించి, 24 గంటల సుదీర్ఘ బ్యాటరీ లైఫ్‌ను అందించారు. అంతేకాకుండా క్రియేటర్ల కోసం అడోబ్ ఆర్ జీబీ కలర్ సపోర్ట్, మ్యాగ్‌సేఫ్ 3, థండర్‌బోల్ట్ 5 పోర్టు లతో పాటు 2016 తర్వాత తొలిసారిగా బ్యాక్‌లిట్ 'గ్లోయింగ్ యాపిల్ లోగో'ను తిరిగి తీసుకురావడం విశేషం. బ్యాంక్ కార్డులపై రూ. 15,000 వరకు క్యాష్‌బ్యాక్‌తో నవంబర్ 9 నుండి భారత్‌లో అమ్మకాలు మొదలవుతాయని కంపెనీ వెల్లడించింది.

దీపావళి బోనస్ వచ్చిందా?

పోస్టాఫీస్‌లో ఈ 4 పథకాలలో పెట్టుబడి పెడితే మంచి రాబడి!

మీకు దీపావళికి ఆఫీసు నుండి బోనస్ వచ్చి, దానిని ఖర్చు చేయకుండా పెట్టుబడి పెట్టాలనుకుంటే, పోస్ట్ ఆఫీస్ పొదుపు పథకాలు ఒక మంచి ఎంపిక కావచ్చు. మీ అవసరాలు, పెట్టుబడి కాలపరిమితి, రిస్క్ భరించగల సామర్థ్యం ఆధారంగా మీరు ఈ పథకాలలో పెట్టుబడి పెట్టవచ్చు. కొన్ని పోస్ట్ ఆఫీస్ పథకాలు స్థిర వడ్డీ రేట్లను అందిస్తుండగా, మరికొన్ని స్థిరమైన ఆదాయాన్ని సంపాదించే అవకాశాన్ని కల్పిస్తాయి. మీ బోనస్ డబ్బును పెట్టుబడి పెట్టే ముందు అది మీకు కొన్ని సంవత్సరాలలో అవసరమవుతుందా లేదా మీరు దానిని దీర్ఘకాలం పాటు పెట్టుబడిగా పెట్టగలరా అని నిర్ణయించు కోవడం ముఖ్యం. మీరు పరిగణించగల నాలుగు పోస్ట్ ఆఫీస్ ప్లాన్‌లు ఇక్కడ ఉన్నాయి.

1. జాతీయ పొదుపు సర్టిఫికేట్ (NSC):
పెట్టుబడి కాలపరిమితి 5 సంవత్సరాలు:

మీ దీపావళి బోనస్ మొత్తాన్ని ఐదు సంవత్సరాల పాటు పెట్టుబడిగా పెట్టగలిగితే, మీరు నేషనల్ సేవింగ్స్ సర్టిఫికేట్ (చీూజ)ను పరిగణించవచ్చు. ఇది తపాలా కార్యాలయం అందించే చిన్న పొదుపు పథకాలలో ఒకటి. ఈ పెట్టుబడిపై స్థిరమైన వడ్డీ రేటు లభిస్తుంది. ఇది ఏటా చక్రవడ్డీ పద్ధతిలో లెక్కిస్తారు. అక్టోబర్-డిసెంబర్ 2026తో ముగిసే త్రైమాసికానికి ఎన్ఎస్‌సి వడ్డీ రేటు సంవత్సరానికి 7.7%గా ఉంది. మీరు



కనీసం రూ. 1,000 నుండి పెట్టుబడి పెట్టడం ప్రారంభించ వచ్చు. ఆదాయపు పన్ను మినహాయింపును పొందే ముందు, ప్రస్తుత పన్ను నిబంధనలను, మీ అర్హతను సరిచూసుకోండి.

2. కిసాన్ వికాస్ పత్ర (KVP) **– పెట్టుబడి కాలం: 115 నెలలు:**

మీ డబ్బును దీర్ఘకాలంలో సురక్షితంగా పెంచుకోవాలనుకుంటే కిసాన్ వికాస్ పత్ర (KVP) ఒక గొప్ప ఎంపిక. ఈ పథకం అక్టోబర్-డిసెంబర్ 2026 త్రైమాసికానికి 7.5% వార్షిక వడ్డీ రేటును అందిస్తుంది. ప్రస్తుత నిబంధనల ప్రకారం, పెట్టుబడి మొత్తం 115 నెలల్లో అంటే 9 సంవత్సరాల 7 నెలల్లో రెట్టింపు అవుతుంది. తక్షణమే డబ్బు అవసరం లేని పెట్టుబడిదారులకు ఈ పథకం ఉపయోగపడుతుంది. పెట్టుబడి పెట్టే ముందు లాక్-ఇన్ పీరియడ్, ముందస్తు ఉపసంహరణ నిబంధనలను అర్థం చేసుకోండి.

3. పోస్ట్ ఆఫీస్ నెలవారీ ఆదాయ పథకం (MIS) – పెట్టుబడి కాలపరిమితి: 5 సంవత్సరాలు:

మీ బోనస్ మొత్తాన్ని పెట్టుబడిగా పెట్టి నెలవారీ ఆదాయం సంపాదించాలనుకుంటే, పోస్ట్ ఆఫీస్ నెలవారీ ఆదాయ పథకాన్ని పరిగణించండి. ఈ పథకం అక్టోబర్-డిసెంబర్ 2026 త్రైమాసికానికి 7.4% వార్షిక వడ్డీ రేటును అందిస్తుంది. వడ్డీని నెలవారీగా చెల్లిస్తారు. ఈ పథకం కింద మీరు వ్యక్తిగత ఖాతాలో గరిష్టంగా రూ. 9 లక్షలు, ఉమ్మడి ఖాతాలో రూ. 15 లక్షలు జమ చేయవచ్చు. ఉదాహరణకు మీరు రూ. 5 లక్షలు పెట్టుబడి పెడితే, 7.4% వార్షిక వడ్డీ రేటుతో మీకు రూ. 37,000 లభిస్తాయి. దీని ప్రకారం నెలకు సుమారు రూ. 3,083 వస్తాయి. మీరు ఖాతా తెరిచేటప్పుడు అసలు ఛార్జీలు, నిబంధనలను నిర్ధారించుకోండి.

4. ఐదేళ్ల పోస్ట్ ఆఫీస్ టర్మ్ డిపాజిట్ పథకం – పెట్టుబడి కాలపరిమితి: 5 సంవత్సరాలు

బ్యాంకు ఫిక్స్‌డ్ డిపాజిట్ (FD) మాదిరిగానే, మీరు పోస్ట్ ఆఫీసులో ఒకేసారి పెద్ద మొత్తంలో డబ్బు జమ చేయాలనుకుంటే ఐదేళ్ల టర్మ్ డిపాజిట్ పథకం కూడా ఒక ఎంపికగా ఉంది. ఇది అక్టోబర్-డిసెంబర్ 2026 త్రైమాసికానికి 7.5% వార్షిక వడ్డీ రేటును అందిస్తుంది. వడ్డీని త్రైమాసిక ప్రాతిపదికన చక్రవడ్డీ పద్ధతిలో లెక్కిస్తారు. అయితే చెల్లింపు నిబంధనలు మారవచ్చు.

మీరు ఈ పథకంలో ఒకేసారి పెద్ద మొత్తంలో పెట్టుబడి పెట్టవచ్చు. ఐదేళ్ల టర్మ్ డిపాజిట్‌లో పెట్టుబడి పెట్టడం ద్వారా పాత పన్ను విధానం కింద వర్తించే నిబంధనల ప్రకారం మీరు పన్ను మినహాయింపులను కూడా పొందవచ్చు. అయితే పెట్టుబడి పెట్టే ముందు మీ పన్ను స్థితిని, అర్హతను సరిచూసుకోవడం ముఖ్యం.

బోనస్‌ను పెట్టుబడిగా పెట్టే ముందు ఈ విషయాలను గుర్తుంచుకోండి:

మీ దీపావళి బోనస్ మొత్తాన్ని పెట్టుబడి పెట్టే ముందు మీ అవసరాలను అంచనా వేసుకోండి. అత్యవసర అవసరాలకు మీకు తగినంత పొదుపు లేకపోతే, మొత్తం బోనస్ మొత్తాన్ని ఎక్కువ కాలం పాటు జమ చేయడం మానుకోండి. పెట్టుబడి ఎంపికను ఎంచుకునేటప్పుడు, వడ్డీ రేటు, మెచ్యూరిటీ కాలం, ముందస్తు ఉపసంహరణ నియమాలు, పన్నులను పరిగణించండి.

పైన పేర్కొన్న వడ్డీ రేట్లు అక్టోబర్ 1, 2026 నుండి డిసెంబర్ 31, 2026 వరకు వర్తిస్తాయని గమనించండి. ప్రభుత్వం ప్రతి త్రైమాసికంలో చిన్న పొదుపు పథకాల వడ్డీ రేట్లను సమీక్షిస్తుంది. అందువల్ల ఖాతా తెరిచే ముందు, దయచేసి పోస్ట్ ఆఫీస్ లేదా ఇండియా పోస్ట్ అధికారిక వెబ్‌సైట్‌తో తాజా రేట్లను నిర్ధారించుకోండి.



డంపింగ్ యార్డు సమస్య పరిష్కారానికి రూ.17 కోట్లు

తొలి విడత నిధుల మంజూరుపై కోతిరాంపూర్‌లో సంబరాలు కేంద్ర మంత్రులకు కార్పొరేటర్ మాసం గణేశ్ కృతజ్ఞతలు



కరీంనగర్, అక్టోబర్29(సింగిడి): నగర ప్రజలను దశాబ్దకాలంగా వేధిస్తున్న డంపింగ్ యార్డు కాలుష్య సమస్య పరిష్కారానికి ముందడుగు పడింది. వ్యర్థాల తొలగింపు, పారిశుధ్య వ్యవస్థ ఆధునీకరణ కోసం స్వచ్ఛ భారత్ మిషన్ కింద కేంద్ర ప్రభుత్వం తొలి విడతగా రూ. 17 కోట్లు మంజూరు చేసింది. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాసం గణేశ్ ఆధ్వర్యంలో కోతిరాంపూర్ చౌరస్తాలో స్థానికులు, వివిధ పార్టీల నాయకులు సంబరాలు నిర్వహించారు. నిధుల మంజూరుకు కృషి చేసిన కేంద్ర మంత్రులు మనోహర్‌లాల్ ఖట్టర్, బండి సంజయ్‌కుమార్, మేయర్ కొలగాని శ్రీనివాస్‌లకు గణేశ్ కృతజ్ఞతలు తెలిపారు. రానున్న రోజుల్లో రూ. 80 కోట్లతో డంపింగ్ యార్డు సమస్యకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. గత బీఆర్ఎస్ పాలనలో సమస్య పరిష్కారానికి నిర్లక్ష్యం వహించారని గణేశ్ విమర్శించారు. నగర ప్రజల ఆరోగ్యం, పర్యావరణ పరిరక్షణకు ప్రాధాన్యమివ్వాలని సూచించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ కార్పొరేటర్లు, నాయకులు, స్థానిక ప్రజలు, ఆటో యూనియన్ ప్రతినిధులు పాల్గొన్నారు.

భూ పునఃసర్వే పనులను నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలి

జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష



పెద్దపల్లి ప్రతినిధి, అక్టోబర్ 29 (సింగిడి): భూ పునఃసర్వే పనులను నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష అధికారులను ఆదేశించారు. గురువారం సుల్తానాబాద్ తహసీల్దార్ కార్యాలయాన్ని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కార్యాలయంలోని రెవెన్యూ రికార్డులను పరిశీలించడంతో పాటు, భూ భారతి దరఖాస్తుల పరిష్కార ప్రక్రియ తీరుపై సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. భూ పునఃసర్వే మొదటి విడతలో ఎంపిక చేసిన గ్రామాల్లో సర్వే ప్రక్రియను షెడ్యూల్ ప్రకారం పూర్తి చేయాలని అధికారులకు స్పష్టం చేశారు. క్షేత్రస్థాయిలో సర్వే పనుల్లో ఎలాంటి జాప్యం జరగకుండా చూడాలని, తలెత్తే సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరిస్తూ పనులను వేగవంతం చేయాలని సూచించారు. భూ భారతి పోర్టల్ ద్వారా అందిన దరఖాస్తులను పెండింగ్‌లో ఉంచకుండా, సమయానుకూలంగా పరిశీలించి పరిష్కరించాలని ఆదేశించారు. గడువు దాటిన దరఖాస్తులు ఏవీ ఉండకూడదని, పరిష్కార ప్రక్రియపై అధికారులు నిరంతరం పర్యవేక్షణ వహించాలని పేర్కొన్నారు. తమ భూ సమస్యల పరిష్కారం కోసం ప్రజలు కార్యాలయాల చుట్టూ తిరిగే పరిస్థితి రానివ్వకూడదని, ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా పనిచేయాలని కలెక్టర్ హితవు పలికారు. ప్రజల ఫిర్యాదులను సత్వరమే పరిష్కరిస్తూనే, ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా రికార్డులను పక్కాగా నిర్వహించాలని ఆదేశించారు. ఈ తనిఖీ కార్యక్రమంలో ట్రైనీ డిప్యూటీ కలెక్టర్ వనజ, సుల్తానాబాద్ తహసీల్దార్ బషిరుద్దీన్ తో పాటు ఇతర రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

తిమ్మాపూర్‌ను వెంటనే కరువు మండలంగా ప్రకటించాలి

బీజేపీ నేత ఇనుకొండ నాగేశ్వర్‌రెడ్డి



కరీంనగర్,అక్టోబర్29(సింగిడి): తీవ్ర వర్షాభావం, సాగునీటి కొరతతో ఇబ్బందులు పడుతున్న తిమ్మాపూర్ మండలాన్ని వెంటనే కరువు మండలంగా ప్రకటించి, రైతులను ఆదుకోవాలని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఇనుకొండ నాగేశ్వర్‌రెడ్డి డిమాండ్ చేశారు. మండల బీజేపీ అధ్యక్షుడు చింతం శ్రీనివాస్ ఆధ్వర్యంలో గురువారం రాజీవ్ రహదారిపై తహసీల్దార్ కార్యాలయం ఎదుట రాస్తారోకో నిర్వహించి, అనంతరం అధికారులకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా నాగేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ, ప్రభుత్వం ప్రకటించిన కరువు మండలాల జాబితాలో తిమ్మాపూర్‌ను చేర్చకపోవడం అన్యాయమన్నారు. పంటలు ఎండిపోతూ రైతులు ఇబ్బందులు పడుతున్నా ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ స్పందించడం లేదని విమర్శించారు. మండలంలో క్షేత్రస్థాయి పరిస్థితులను పరిశీలించి కరువు మండలంగా ప్రకటించాలని, పంట నష్టపరిహారంతో పాటు ప్రత్యామ్నాయ సాగునీటి సౌకర్యాలు కల్పించాలని కోరారు. ప్రభుత్వం స్పందించకపోతే పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు, కార్యకర్తలు, రైతులు పాల్గొన్నారు.

విపత్తుల వేళ ప్రజల రక్షణకు సిద్ధంగా ఉండాలి

డీఆర్ఎఫ్ సిబ్బందికి రక్షణ కిట్లు అందించిన కమిషనర్ ప్రఫుల్ దేశాయ్

కరీంనగర్, అక్టోబర్29(సింగిడి): విపత్తులతో పాటు అత్యవసర సమయాల్లోనూ నగర ప్రజలకు మెరుగైన సేవలందించాలని నగరపాలక సంస్థ కమిషనర్ ప్రఫుల్ దేశాయ్ డీఆర్ఎఫ్ సిబ్బందికి సూచించారు. గురువారం నగరపాలక సంస్థ కార్యాలయంలో శిక్షణ పూర్తి చేసుకున్న 23 మంది సిబ్బందికి రక్షణ కిట్లు, ధ్రువపత్రాలను అందజేశారు. నగరంలోని క్రీడా పాఠశాలలో వారం రోజులపాటు నిర్వహించిన శిక్షణలో సిబ్బంది విపత్తుల నిర్వహణలో మెలకువలు నేర్చుకున్నారు. రక్షణ కిట్లలో ప్రాణరక్షక జాకెట్లు, బూట్లు, శిరస్త్రాణాలు, చేతి దీపాలు, ప్రథమ చికిత్స పెట్టెలు తదితర సామగ్రి ఉన్నాయి. శిక్షణలో నేర్చుకున్న నైపుణ్యాలను క్షేత్రస్థాయిలో వినియోగిస్తూ ప్రజల ప్రాణ, ఆస్తుల రక్షణకు బాధ్యతాయుతంగా పనిచేయాలని కమిషనర్ ఆదేశించారు. విపత్తులు సంభవించినప్పుడు తక్షణమే స్పందించి సేవలందించేందుకు సిద్ధంగా ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో బండారి లక్ష్మణ్, బాబు, తిరుమలై, ఈ బాబు, మధుకర్, ప్రణయ్, వీర్ల లక్ష్మీనారాయణ, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

ఎన్ హెచ్ ఎం ఉద్యోగుల సమ్మెకు మాల మహానాడు సంపూర్ణ మద్దతు.

17వ రోజుకు చేరిన నిరవధిక సమ్మె

ఉద్యోగుల సమస్యలను వెంటనే పరిష్కరించాలి: కొంపెల్లి విజయ్ కుమార్.



రాజన్న సిరిసిల్ల, ప్రతినిధి అక్టోబర్ 29 (సింగిడి): జిల్లా కలెక్టరేట్ ధర్నా చౌక్ వద్ద జాతీయ ఆరోగ్య మిషన్ ఎన్ హెచ్ ఎం ఉద్యోగులు చేపట్టిన నిరవధిక సమ్మె గురువారం 17వ రోజుకు చేరుకుంది. ఈ సమ్మెకు మాల మహానాడు సంపూర్ణ మద్దతు ప్రకటించింది. ఉమ్మడి జిల్లా మాల మహానాడు అధ్యక్షులు కొంపెల్లి విజయ్ కుమార్ నిరసన కార్యక్రమంలో పాల్గొని ఉద్యోగులకు సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా విజయ్ కుమార్ మాట్లాడుతూ. ప్రజలకు వైద్య సేవలు అందించడంలో కీలక పాత్ర పోషిస్తున్న ఎన్ హెచ్ ఎం ఉద్యోగుల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని కోరారు. ఉద్యోగాల క్రమబద్ధీకరణ, సమాన పనికి సమాన వేతనం, ఉద్యోగ భద్రతతో పాటు పెండింగ్ సమస్యలను పరిష్కరించి ఉద్యోగులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. దీర్ఘకాలంగా సేవలందిస్తున్న ఎన్ హెచ్ ఎం ఉద్యోగుల న్యాయమైన డిమాండ్లపై ప్రభుత్వం సానుకూలంగా స్పందించి, వెంటనే చర్చలు జరిపి సమ్మెను విరమింపజేసే దిశగా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఉద్యోగుల హక్కుల సాధన కోసం మాల మహానాడు వారికి అండగా నిలుస్తుందని ఆయన స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో శేఖర్, సంతోష్, ఉపేందర్, వివేకానంద, సంతోష, రేణుక, సంధ్య, చందు, తదితరులు పాల్గొన్నారు.

కామారెడ్డిలో నూతన ఆధార్ సేవా కేంద్రం ప్రారంభం

జిల్లా కేంద్రంలోనే ఆధార్‌కు సంబంధించిన ప్రత్యేక సేవలు

ప్రజలకు సమయం, ప్రయాణ ఖర్చులు ఆదా: కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్



కామారెడ్డి,ప్రతినిధి అక్టోబర్ 29 (సింగిడి): ప్రజలకు ఆధార్ సేవలను మరింత చేరువ చేయడంతో పాటు, ఆధార్‌కు సంబంధించిన సమస్యలను సులభంగా పరిష్కరించేందుకు కామారెడ్డి జిల్లా కేంద్రంలో నూతన ఆధార్ సేవా కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. గురువారం జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ ఈ కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ కేంద్రం హైదరాబాద్‌లోని ప్రాంతీయ కార్యాలయానికి అనుబంధంగా పనిచేస్తుందని, ప్రజలకు ఆధార్ నమోదు, వివరాల సవరణతో పాటు పలు ప్రత్యేక సేవలు అందుబాటులోకి వస్తాయని అధికారులు తెలిపారు.

జిల్లా ప్రజలకు మరింత చేరువలో ఆధార్ సేవలు

ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ మాట్లాడుతూ, తెలంగాణ రాష్ట్రంలోని 14 జిల్లాల్లో ఆధార్ సేవా కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో భాగంగా కామారెడ్డి జిల్లాలో కేంద్రాన్ని ప్రారంభించడం సంతోషకరమని పేర్కొన్నారు. రాష్ట్రంలో ఈ తరహా కేంద్రాలను ఏర్పాటు చేస్తున్న జిల్లాల్లో కామారెడ్డి 12వ స్థానంలో ఉందని వెల్లడించారు. సాధారణ ఆధార్ కేంద్రాల్లో లభించే సేవలతో పాటు, ఈ కేంద్రంలో మరికొన్ని ప్రత్యేక సేవలు అందుబాటులో ఉంటాయని కలెక్టర్ వివరించారు. ఆధార్‌కు సంబంధించిన ఫిర్యాదుల పరిష్కారం, నిలిపివేయబడిన ఆధార్ నంబర్లకు సంబంధించిన సమస్యల పరిష్కార ప్రక్రియ వంటి సేవలు ఇక్కడ అందుతాయని తెలిపారు.

హైదరాబాద్‌కు వెళ్లాల్సిన అవసరం తగ్గింపు

గతంలో ఆధార్‌కు సంబంధించిన కొన్ని ప్రత్యేక సమస్యలను పరిష్కరించుకోవడానికి ప్రజలు హైదరాబాద్‌కు వెళ్లాల్సి వచ్చేదని కలెక్టర్ పేర్కొన్నారు. ప్రస్తుతం జిల్లా కేంద్రంలోనే ఈ సేవలు అందుబాటులోకి రావడంతో ప్రజలకు సమయం, ప్రయాణ ఖర్చులు ఆదా అవుతాయని చెప్పారు. ఆధార్ సంబంధిత సమస్యల పరిష్కారం కోసం దూర ప్రాంతాలకు వెళ్లాల్సిన ఇబ్బందులు తగ్గుతాయని వివరించారు. ప్రజలు ఈ సదుపాయాన్ని సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ సూచించారు. ఆధార్ సేవల్లో ఎదురయ్యే సమస్యలను పరిష్కరించడంతో పాటు, ప్రజలకు మెరుగైన సేవలు అందించడమే ఈ కేంద్రం ప్రధాన ఉద్దేశమని పేర్కొన్నారు.

ప్రత్యేక అధికారి అందుబాటులో..

ప్రజలకు నిరంతరాయంగా ఆధార్ సేవలు అందించేందుకు భారత విశిష్ట గుర్తింపు ప్రాధికార సంస్థ (ఖ×ణూ×) తరఫున ప్రత్యేక అధికారి కూడా ఈ కేంద్రంలో అందుబాటులో ఉంటారని కలెక్టర్ తెలిపారు. ఆధార్ నమోదు, వివరాల సవరణలు, ఫిర్యాదుల పరిష్కారం తదితర అంశాల్లో ఈ కేంద్రం జిల్లా ప్రజలకు ఉపయోగకరంగా ఉంటుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మండల స్పెషల్ ఆఫీసర్ శ్రీధర్ రెడ్డి, ఎంపీడీవో హెబ్సీబా రాణి, ఈ-డీఎం ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

మార్కెట్ కమిటీ అభివృద్ధికి 3.94 కోట్లు మంజూరు

ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ చొరవతోనే నిధుల విడుదల

మర్రిపల్లి వద్ద 12 ఎకరాల్లో మోడల్ మార్కెట్ యార్డ్ నిర్మాణం



రాజన్న సిరిసిల్ల ప్రతినిధి అక్టోబర్ 29 (సింగిడి): వేములవాడ వ్యవసాయ మార్కెట్ కమిటీ నూతన అభివృద్ధి పనులకు రాష్ట్ర ప్రభుత్వం ?3.94 కోట్లు (?3,94,40,000) మంజూరు చేస్తూ ఉత్తర్వులు జారీ చేయడం పట్ల మార్కెట్ కమిటీ చైర్మన్ రొండి రాజు, వైస్ చైర్మన్ కనికరపు రాకేష్ హర్షం వ్యక్తం చేశారు. గురువారం మార్కెట్ కమిటీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ స్థానిక శాసనసభ్యులు, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ ప్రత్యేక చొరవ, కృషితోనే ఈ నిధులు మంజూరయ్యాయని తెలిపారు. వేములవాడ రూరల్ మండలం మర్రిపల్లి గ్రామంలో మార్కెట్ యార్డ్ ఏర్పాటుకు స్థలం అవసరమని తెలపగానే, ఎమ్మెల్యే సూచనతో జిల్లా కలెక్టర్ స్పందించి 12 ఎకరాల భూమిని కేటాయించారని చెప్పారు. ఆ స్థలంలో ఏఎంసీ భవనం, కార్యదర్శి భవనం, నూతన మార్కెట్ యార్డ్ నిర్మాణానికి దాదాపు రూ. 7 కోట్లతో ప్రతిపాదనలు రూపొందించి, ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ ద్వారా రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మరియు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి సమర్పించగా, ప్రభుత్వం రూ. 3.94 కోట్లను విడుదల చేసిందని వివరించారు. 11 రకాల అభివృద్ధి పనులు. మంజూరైన నిధులతో మర్రిపల్లి నూతన మార్కెట్ యార్డ్ తో పాటు వేములవాడ యార్డ్ లో మౌలిక సదుపాయాల కల్పనకు 11 రకాల అభివృద్ధి పనులకు ప్రభుత్వం పరిపాలనా అనుమతులు ఇచ్చిందని తెలిపారు. మర్రిపల్లి యార్డ్ లో జంగిల్ క్లియరెన్స్, మైదానం సమం చేయడం, మట్టా కాంపౌండ్ వాల్, ఆర్ఓ ప్లాంట్ ద్వారా తాగునీటి సరఫరా, మరుగుదొడ్లు, అప్రోచ్ రోడ్డు, విద్యుదీకరణ, హైమాస్ట్ లైట్లు, అలాగే వేములవాడ యార్డ్ లోని కవర్డ్ షెడ్ ను 20 నూతన వ్యాపార గదులుగా మార్చే పనులు చేపడుతున్నట్లు వెల్లడించారు. వేములవాడ నియోజకవర్గాన్ని మోడల్ గా తీర్చిదిద్దడమే ధ్యేయంగా ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ నాయకత్వంలో దాదాపు రూ. 1,000 కోట్ల నిధులతో అభివృద్ధి పనులు జరుగుతున్నాయని, వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి దేవస్థాన అభివృద్ధికి రూ. 250 కోట్లు, 80 ఫీట్ల రోడ్డు విస్తరణకు రూ. 46 కోట్లతో పనులు వేగవంతం చేస్తున్నామని తెలిపారు. నిధులు విడుదల చేసిన సీఎం రేవంత్ రెడ్డి, మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ లకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సమావేశంలో మార్కెట్ కమిటీ కార్యదర్శి సరోజ, డైరెక్టర్లు దైత కుమార్, ఖమ్మం గణేష్, గుర్రం విద్యాసాగర్, మ్యాక ప్రవంతి హరి నందన్ రెడ్డి, కత్తి కనకయ్య, వస్తాద్ కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

మహిళా సంఘాలకు భవనాలు.. పేదల సొంతింటి కల సాకారం!

మల్లూరు తాండ, బంజపల్లిలో మహిళా సంఘం భవనాలకు భూమిపూజ

బంజపల్లిలో ఇందిరమ్మ ఇంటి గృహప్రవేశ వేడుకలో పాల్గొన్న ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతరావు, డీసీసీ అధ్యక్షుడు ఏలే మల్లికార్జున్



కామారెడ్డి ప్రతినిధి అక్టోబర్ 29 (సింగిడి): గ్రామీణ ప్రాంతాల్లో మహిళా సంఘాలకు మెరుగైన మౌలిక సదుపాయాలు కల్పించడంతో పాటు, పేదకుటుంబాలకు సొంతింటి భరోసా కల్పించే దిశగా మరో ముందడుగు పడింది. కామారెడ్డి జిల్లా నిజాంసాగర్ మండలంలోని మల్లూరు తాండ, బంజపల్లి గ్రామాల్లో మహిళా సంఘం భవనాల నిర్మాణానికి గురువారం భూమిపూజ నిర్వహించారు. జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతరావు, కామారెడ్డి జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు ఏలే మల్లికార్జున్ ఈ కార్యక్రమాల్లో పాల్గొన్నారు.

మహిళా సంఘాలకు సొంత భవనాలు

గ్రామీణ మహిళలు సంఘటితంగా సమావేశాలు నిర్వహించుకోవడానికి, తమ సమస్యలను చర్చించుకోవడానికి, సంఘ కార్యకలాపాలను సమర్థవంతంగా కొనసాగించడానికి ప్రత్యేక భవనాలు ఎంతో అవసరం. ఈ నేపథ్యంలో మల్లూరు తాండ, బంజపల్లి గ్రామాల్లో మహిళా సంఘాల భవనాల నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. మహిళా సంఘాలకు అవసరమైన వసతులు అందుబాటులోకి వస్తే గ్రామీణ మహిళలు తమ కార్యక్రమాలను సులభంగా నిర్వహించుకునే అవకాశం కలుగుతుంది. మహిళల సామాజిక, ఆర్థిక అభివృద్ధికి ఇటువంటి వసతులు దోహదపడనున్నాయి. మహిళా సంఘాల కార్యకలాపాలకు అనువైన వేదికలు అందుబాటులోకి రావడం ద్వారా గ్రామస్థాయిలో మహిళల భాగస్వామ్యం మరింత పెరిగే అవకాశం ఉంది.

బంజపల్లిలో ఇందిరమ్మ ఇంటి గృహప్రవేశం

మల్లూరు తాండ, బంజపల్లిలో మహిళా సంఘం భవనాల నిర్మాణానికి భూమిపూజ చేసిన అనంతరం, బంజపల్లి గ్రామంలో నిర్వహించిన ఇందిరమ్మ ఇంటి గృహప్రవేశ కార్యక్రమంలో ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతరావు, డీసీసీ అధ్యక్షుడు ఏలే మల్లికార్జున్ పాల్గొన్నారు. లబ్ధిదారుల కుటుంబ సభ్యులతో కలిసి గృహప్రవేశ వేడుకలో భాగస్వాములయ్యారు. పేద కుటుంబాలకు సొంతిల్లు అనేది చిరకాల స్వప్నం. ప్రభుత్వ గృహ నిర్మాణ పథకాల ద్వారా అర్హులైన కుటుంబాలకు ఇళ్లు అందుబాటులోకి రావడం వారి జీవన ప్రమాణాలను మెరుగుపరచడంలో కీలకంగా నిలుస్తుంది. ఈ నేపథ్యంలో బంజపల్లిలో ఇందిరమ్మ ఇంటి గృహప్రవేశ కార్యక్రమం స్థానికంగా ప్రాధాన్యత సంతరించుకుంది. ఈ కార్యక్రమాల్లో పీఏసీఎస్ చైర్మన్ పట్లోళ్ల జనార్దన్ రెడ్డి, నిజాంసాగర్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ప్రజా పండరి, వివిధ గ్రామాల సర్పంచులు, ప్రజాప్రతినిధులు, స్థానిక కాంగ్రెస్ నాయకులు, మహిళా సంఘాల సభ్యులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు. గామీణ ప్రాంతాల్లో మహిళలకు మెరుగైన వసతులు కల్పించడం, అర్హులైన పేద కుటుంబాలకు గృహ సదుపాయాలు అందించడం వంటి కార్యక్రమాలు ప్రజల జీవన పరిస్థితులను మెరుగుపరిచేందుకు దోహదపడతాయని స్థానికులు అభిప్రాయపడుతున్నారు.

స్ట్రోక్ చికిత్సలో ప్రతి నిమిషం విలువైనది

- లక్షణాలు కనిపించగానే ఆసుపత్రికి తరలించాలి
- ప్రపంచ పక్షవాత దినోత్సవం సందర్భంగా మెడికవర్‌లో అవగాహన
- నాడీ వైద్య నిపుణుడు డాక్టర్ సంజయ్ కమిన్వర్



కరీంనగర్, అక్టోబర్29(సింగిడి): పక్షవాతం లక్షణాలు కనిపించిన వెంటనే బాధితులను ప్రత్యేక వైద్య సదుపాయాలున్న ఆసుపత్రికి తరలిస్తే మెరుగైన ఫలితాలు సాధించవచ్చని కరీంనగర్ మెడికవర్ వైద్యులు తెలిపారు. ప్రపంచ పక్షవాత దినోత్సవం సందర్భంగా గురువారం ఆసుపత్రిలో నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో వారు మాట్లాడారు. నాడీ వైద్య నిపుణుడు డాక్టర్ సంజయ్ కమిన్వర్, అత్యవసర వైద్య నిపుణుడు డాక్టర్ సత్యనారాయణ, అత్యవసర చికిత్సల వైద్యుడు డాక్టర్ ఉపేందర్‌రెడ్డి మాట్లాడుతూ, మెదడుకు రక్త సరఫరా నిలిచిపోవడం లేదా రక్తనాళం చిట్లి రక్తస్రావం జరగడం వల్ల పక్షవాతం వస్తుందని వివరించారు.

ముఖం ఒకవైపు వాలిపోవడం, చేయి లేదా కాలు కదలకపోవడం, మాట తడబడటం, చూపు మందగించడం, సమతుల్యత కోల్పోవడం వంటి లక్షణాలను గుర్తించిన వెంటనే వైద్య సహాయం పొందాలని సూచించారు. లక్షణాలు ప్రారంభమైన నాలుగున్నర గంటల్లోపు ఆసుపత్రికి చేరుకుంటే, అర్హులైన రోగులకు రక్తనాళాల్లోని గడ్డను కరిగించే చికిత్స అందించే అవకాశం ఉంటుందని తెలిపారు. ఆలస్యం ప్రాణాపాయానికి, శాశ్వత వైకల్యానికి దారితీయవచ్చని హెచ్చరించారు. అధిక రక్తపోటు, మధుమేహం, అధిక కొలెస్ట్రాల్, ధూమపానం, శారీరక శ్రమ లేకపోవడం పక్షవాతానికి ప్రమాద కారకాలన్నారు. ఆరోగ్య సమస్యలను నియంత్రించుకోవడం, క్రమం తప్పకుండా వ్యాయామం చేయడం ద్వారా ముప్పును తగ్గించుకోవచ్చని తెలిపారు. ఆసుపత్రి కేంద్ర అధిపతి గుర్రం కిరణ్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో సూపరింటెండెంట్ డాక్టర్ ప్రియాంక, మార్కెటింగ్ విభాగాధిపతి కోట కర్ణాకర్ తదితరులు పాల్గొన్నారు.

నిర్మాణ పనుల్లో వేగం పెంచాలి

జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్



రాజన్న సిరిసిల్ల ప్రతినిధి అక్టోబర్ 29 (సింగిడి): జిల్లాలో చందుర్తి మండలం మూడపెల్లి గ్రామంలో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ విద్యాలయం నిర్మాణ పనుల్లో వేగం పెంచాలని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆదేశించారు. చందుర్తి మండలం మూడపెల్లిలో టీ జీ ఈ డబ్ల్యూ ఐ డీ సీ ఆధ్వర్యంలో రూ. 200 కోట్లతో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ విద్యాలయం పనులు కొనసాగుతుండగా, జిల్లా కలెక్టర్ గురువారం పరిశీలించారు. ఆవరణలో నిర్మాణ పనులు కొనసాగుతుండగా, క్షేత్రస్థాయిలో పరిశీలించి.. అధికారులకు పలు సూచనలు చేశారు. జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ విద్యాలయాలు నిర్మాణానికి శ్రీకారం చుట్టిందని తెలిపారు. అధికారులు ప్రణాళిక ప్రకారం పనులు త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. ప్రభుత్వ లక్ష్యానికి అనుగుణంగా పనులు పూర్తి చేసి.. అందుబాటులోకి తీసుకురావాలని సూచించారు. పరిశీలనలో వేములవాడ ఆర్డీఓ కే ఎస్ బీ కుమారి, టీజీఈడబ్ల్యూఐడీసీ ఈఈ రామకృష్ణ, తహసీల్దార్ భూపతి, ఏఈ శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

పొట్యాల, ఎల్లంపల్లి గుంపు గ్రామాల నిర్వాసితుల సమస్యకు పరిష్కారం..!!



గోదావరిఖని అక్టోబర్ 29 (సింగిడి): ఎల్లంపల్లి--పోట్యాల గ్రామాల నిర్వాసితుల సమస్య పరిష్కారానికి కృషి చేసి, అర్హులైన కుటుంబాలకు ఆర్ అండ్ ఆర్ (పునరావాసం, పునరుద్ధరణ) ప్యాకేజీ అందేలా చొరవ చూపిన రామగుండం ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్ ఠాకూర్‌కు గ్రామ ప్రజల తరఫున ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. పెద్దపల్లి జిల్లా అంతర్గాం మండల పరిధిలోని ఎల్లంపల్లి--పోట్యాల గ్రామాలకు చెందిన ప్రజలు ఎదుర్కొంటున్న సమస్య పరిష్కారంలో ఎమ్మెల్యే చూపిన చొరవ పట్ల గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు. నిర్వాసిత కుటుంబాలకు న్యాయం జరగాలనే ఉద్దేశంతో ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీ మంజూరుకు ఆయన చేసిన కృషిని అభినందించారు. అర్హులైన లబ్ధిదారులకు ప్యాకేజీ అందే విషయంలో సహకారం అందించడం గ్రామ ప్రజలకు ఊరటనిచ్చిందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా మాజీ సర్పంచ్ ఎదులాపురం నీరజ--వెంకటేష్ గ్రామ ప్రజల తరఫున ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్‌కు కృతజ్ఞతలు తెలియజేశారు. నిర్వాసిత కుటుంబాల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని సమస్య పరిష్కారానికి కృషి చేసినందుకు ధన్యవాదాలు తెలిపారు. భవిష్యత్తులోనూ గ్రామ ప్రజలు ఎదుర్కొనే సమస్యల పరిష్కారానికి ఇదే విధంగా సహకారం అందించాలని కోరారు. నిర్వాసిత కుటుంబాలకు న్యాయం జరిగేలా ప్రజాప్రతినిధులు చొరవ చూపడం అభినందనీయమని గ్రామస్తులు పేర్కొంటూ, ఎమ్మెల్యేకు మరోసారి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

ఘనంగా ఐఎఫ్‌డబ్ల్యూజే వ్యవస్థాపక దినోత్సవ వేడుకలు

జర్నలిస్టుల హక్కుల పరిరక్షణకు నిరంతర పోరాటం.. దుబ్బాక ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు పండ్ల పంపిణీ



దుబ్బాక, (సింగిడి):ఇండియన్ ఫెడరేషన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ (ఐఎఫ్‌డబ్ల్యూజే) జాతీయ కమిటీ పిలుపు మేరకు 76వ వ్యవస్థాపక దినోత్సవ వేడుకలను బుధవారం సిద్దిపేట జిల్లా దుబ్బాక మున్సిపల్ పరిధిలోని రజనీకాంత్ రెడ్డి ఫంక్షన్ హాల్‌లో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సిద్దిపేట జిల్లా ఐఎఫ్‌డబ్ల్యూజే అధ్యక్షుడు సత్తు మహిపాల్ రెడ్డి, ఉపాధ్యక్షుడు ముస్త్యాల యాదగిరి, యూనియన్ కార్యవర్గ సభ్యులతో కలిసి కేక్ కట్ చేసి వేడుకలను జరుపుకున్నారు.ఈ సందర్భంగా యూనియన్ నాయకులు మాట్లాడుతూ, 1950 అక్టోబర్ 28న ఢిల్లీలో సీనియర్ పాత్రికేయుల ఆధ్వర్యంలో స్థాపించబడిన ఐఎఫ్‌డబ్ల్యూజే దేశంలోనే ప్రముఖ పాత్రికేయ సంఘాలలో ఒకటిగా ఎదిగిందని పేర్కొన్నారు. దేశవ్యాప్తంగా వివిధ రాష్ట్రాల్లో విస్తరించిన ఈ సంఘం జర్నలిస్టుల హక్కుల పరిరక్షణ, వృత్తిపరమైన స్వేచ్ఛ, సంక్షేమం కోసం నిరంతరం కృషి చేస్తోందని తెలిపారు.ప్రజాస్వామ్యంలో జర్నలిస్టుల పాత్ర ఎంతో కీలకమని, ప్రజా సమస్యలను వెలుగులోకి తీసుకురావడంలో పాత్రికేయులు ముఖ్యమైన బాధ్యత నిర్వహిస్తున్నారని అన్నారు. జర్నలిస్టులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి ఐక్యంగా కృషి చేయాలని, వారి హక్కుల సాధన కోసం సంఘటితంగా ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. ఐఎఫ్‌డబ్ల్యూజే స్థాపన దినోత్సవం జర్నలిస్టుల ఐక్యతను, హక్కుల సాధన కోసం సాగుతున్న పోరాటాన్ని గుర్తుచేసే సందర్భమని పేర్కొన్నారు.

ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు పండ్ల పంపిణీ

వ్యవస్థాపక దినోత్సవ వేడుకల్లో భాగంగా దుబ్బాక పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రిని సందర్శించిన ఐఎఫ్‌డబ్ల్యూజే నాయకులు, సభ్యులు అక్కడ చికిత్స పొందుతున్న రోగులకు పండ్ల పంపిణీ చేశారు. జర్నలిస్టులు వార్తల ప్రచురణకే పరిమితం కాకుండా సామాజిక సేవా కార్యక్రమాల్లోనూ భాగస్వాములు కావడం అభినందనీయమని పలువురు పేర్కొన్నారు. రోగులకు పండ్లు అందజేసి వారి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో అజరత్ హలీ, ఎం.డి. షాదుల్, ఉమ్మర్, కత్తెర నవీన్, బోండి స్వామి, గుండబోయిన నవీన్, ఆశరాజు, సిద్ధి రాములు, కుంభాల రవీందర్, పల్లె కృష్ణతో పాటు పలువురు జర్నలిస్టులు పాల్గొన్నారు.

నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు

జిల్లా విద్యాశాఖ అధికారి విజయలక్ష్మి
ప్రైవేట్ పాఠశాలల్లో డీఈఓ ఆకస్మిక తనిఖీలు



గద్వాల ప్రతినిధి (సింగిడి): ప్రైవేట్ పాఠశాలలు నిబంధనల ప్రకారం తమ విద్యాసంస్థలను నిర్వహించాలని, లేనిపక్షంలో తగు చర్యలు తీసుకుంటామని డిఇఓ విజయలక్ష్మి అన్నారు.బుధవారం అయిజ మండలంలోని శ్రీ చైతన్య ఇంగ్లీష్ మీడియం హైస్కూల్, న్యూ గీతాంజలి పాఠశాలలను డీఈవో ఆకస్మికంగా తనిఖీ చేశారు.శ్రీ చైతన్య పాఠశాలలో ఇరుకైన తరగతి గదులు, గాలి, వెలుతురు సరిగా లేకపోవడం, తగిన భద్రతా ఏర్పాట్లు, ఆటస్థలం లేకపోవడం గమనించారు. విద్యార్థులను తగిన రక్షణ లేకుండా ఇసుకలో కూర్చోబెట్టడాన్ని గుర్తించారు.న్యూ గీతాంజలి పాఠశాలలోనూ ఇరుకైన తరగతి గదులు, గాలి ప్రసరణ లేకపోవడం, భద్రతా లోపాలు, ఆటస్థలం లేకపోవడాన్ని గుర్తించారు. ఒక ఉపాధ్యాయుడు విద్యార్థులను కొడుతున్నట్లు, విద్యార్థులు ఇన్వర్టర్ బ్యాటరీల పక్కన ఎలాంటి జాగ్రత్తలు లేకుండా కూర్చుంటున్నట్లు గమనించారు. ఈ పరిస్థితులు విద్యార్థుల భద్రతకు ప్రమాదకరంగా ఉన్నాయని తెలిపారు. రెండు పాఠశాలల్లో ఫీజుల వివరాలను ప్రదర్శించినప్పటికీ, విద్యార్థులకు అవసరమైన కనీస మౌలిక వసతులు, భద్రతా సదుపాయాల నిర్వహణలో లోపాలు ఉన్నట్లు డీఈఓ గుర్తించారు. విద్యార్థుల భద్రత, సౌకర్యాల విషయంలో పాఠశాల యాజమాన్యాలు నిర్లక్ష్యం వహించరాదని, నిబంధనలకు అనుగుణంగా అవసరమైన వసతులు కల్పించాలని స్పష్టం చేశారు.

ఎస్ఐఆర్--2026 ప్రక్రియపై
రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమీక్ష సమావేశం



జడ్చర్ల, (సింగిడి): మహబూబ్‌నగర్ అదనపు కలెక్టర్ (రెవెన్యూ), 75-జడ్చర్ల అసెంబ్లీ నియోజకవర్గ ఎన్నికల నమోదు అధికారి (ఈ ఆర్ ఓ) గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించి ఎస్ఐఆర్-2026 ప్రక్రియ పురోగతిని సమీక్షించారు. ఈ సమావేశంలో జడ్చర్ల మండల డిప్యూటీ తహసీల్దార్, ఎన్నికల డిప్యూటీ తహసీల్దార్‌తో పాటు 75-జడ్చర్ల అసెంబ్లీ నియోజకవర్గ ఎన్నికల సిబ్బంది పాల్గొన్నారు. అక్టోబర్ 28, 2026 నాటికి నోటీసుల పంపిణీ, విచారణల పురోగతిపై ఈఆర్ఓ సమీక్షించారు. ఇప్పటివరకు లిలి99.74 శాతం నోటీసుల పంపిణీ, 98 శాతం విచారణలు పూర్తయ్యాయనిలిలి అధికారులు వెల్లడించారు. మిగిలిన కేసులపై ప్రత్యేక దృష్టి సారించి, నిర్ణీత గడువులోగా విచారణలను పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. అలాగే, ఏఈఆర్ఓ లాగిన్‌లలో పెండింగ్‌లో ఉన్నఫారం-6, ఫారం-7, ఫారం-8 దరఖాస్తుల స్థితిగతులను సమీక్షించారు. పెండింగ్ దరఖాస్తులను సకాలంలో పరిష్కరించాలని ఏఈఆర్ఓలను ఆదేశించారు. ఆమోదించిన, తిరస్కరించిన దరఖాస్తుల జాబితాలను సిద్ధం చేసి ప్రజల సమాచారార్థం నోటీసు బోర్డులపై ప్రదర్శించాలని, వాటి ప్రతులను గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులకు అందజేయాలని సూచించారు. ఎస్ఐఆర్-2026కు సంబంధించిన సమాచారం, కార్యకలాపాలపై తగిన రికార్డులను పకడ్బందీగా నిర్వహించాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. సమావేశంలో రాజకీయ పార్టీల ప్రతినిధులు లేవనెత్తిన అంశాలపై చర్చించి, వారి సందేహాలకు ఈఆర్ఓ సమాధానాలు ఇచ్చారు. నవంబర్ 5, 2026తో నోటీసుల పంపిణీ, విచారణల గడువు ముగియనుండగా, నవంబర్ 9, 2026న తుది ఓటరు జాబితాను ప్రచురించనున్నట్లు ఈఆర్ఓ వెల్లడించారు. ఎస్ఐఆర్-2026 ప్రక్రియను నిర్ణీత గడువులో సజావుగా పూర్తి చేసేందుకు రాజకీయ పార్టీల ప్రతినిధులు సహకరించాలని కోరారు. అర్హులైన ఓటర్లు విచారణలు, ఓటరు నమోదు ప్రక్రియలో పాల్గొనేలా ప్రోత్సహించాలని సూచించారు.

మరకత శ్రీ లక్ష్మీ గణపతికి ప్రత్యేకపూజలు



అల్వాల్, (సింగిడి):కామాజిగూడ డైరీ ఫార్మ్ రోడ్లో వెలసినమరకత శ్రీ లక్ష్మీ గణపతి బుధవారం స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించిన ఆలయ వ్యవస్థాపకులు కార్య నిర్వహకులు డాక్టర్ మోత్కూరు సత్యనారాయణ శాస్త్రి. 32 ఔషధీకృత ద్రవ్యాలతో విశేష పూజలు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఆలయ అభివృద్ధికి భక్తుల సహకారం ఎంతైనా ఉందని తమకు తోచిన విధంగా సహాయ సహకారాలు అందించాలని భక్తులను కోరారు. కార్యక్రమంలో ఆరంజ్యోతి, భక్తులు పాల్గొన్నారు.

మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలి..
ఆరోగ్యకర సమాజ నిర్మాణానికి కృషి చేయాలి



ఆత్మకూర్, (సింగిడి): వనపర్తి జిల్లా ఆత్మకూర్ పట్టణ కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో నషా ముక్త్ భారత్ అభియాన్ లో భాగంగా ప్రతిజ్ఞ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మాదకద్రవ్యాల వినియోగం వల్ల కలిగే అనర్థాలపై అవగాహన కల్పిస్తూ వాటికి దూరంగా ఉండాలని విద్యార్థులకు సూచించారు. మత్తు పదార్థాలకు బానిస కావడం వల్ల వ్యక్తిగత ఆరోగ్యంతో పాటు కుటుంబ, సామాజిక జీవనంపై తీవ్ర ప్రభావం పడుతుందని వివరించారు. మాదకద్రవ్యాల రహిత సమాజ నిర్మాణానికి యువత ముందుకు రావాలని, చెడు అలవాట్లకు దూరంగా ఉంటూ ఆరోగ్యకరమైన జీవితాన్ని అలవర్చుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఆత్మకూర్ సర్కిల్ ఇన్ స్పెక్టర్ శివకుమార్, ఎస్ఐ జయన్న, ఎక్సైజ్ శాఖ సీఐ, ఎస్సైలు, కళాశాల ప్రిన్సిపల్ సైదులు, సీనియర్ అధ్యాపకులు భాగ్యవర్ధన్ రెడ్డి, టీజేవిశ్వేశ్వర్, రాఘవేంద్రరావు, ఏ. కురుమూర్తి, విద్యార్థులు పాల్గొన్నారు.

పెబ్బేరు మండల పరిషత్ సమీక్షలో సమస్యల వెల్లువ!

సాగునీరు అందక రైతుల ఆందోళన.. అధికారుల గైర్హాజరుపై షోకాజ్ నోటీసులు
వీధి కుక్కల బెడద నివారించాలి.. ఇందిరమ్మ ఇళ్ల బిల్లులు చెల్లించాలి





పెబ్బేరు, (సింగిడి):పెబ్బేరు మండల పరిషత్ సమీక్ష సమావేశంలో గ్రామాల సమస్యలు వెల్లువెత్తాయి. మండల పరిధిలోని పలు గ్రామాల సర్పంచులు ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. ముఖ్యంగా వ్యవసాయ భూములకు సాగునీరు సక్రమంగా అందక రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వీధి కుక్కల బెడద, ఇందిరమ్మ ఇళ్ల బిల్లుల పెండింగ్, భూసర్వే, విద్య, నీటి సంరక్షణ తదితర అంశాలపై చర్చించారు. మండలంలోని వ్యవసాయ భూములకు పూర్తిస్థాయిలో సాగునీరు అందడం లేదని సర్పంచులు సమావేశంలో ప్రధానంగా ప్రస్తావించారు. నీటి సరఫరా సక్రమంగా లేకపోవడంతో పంటల సాగు ప్రశ్నార్థకంగా మారుతోందని, రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. వ్యవసాయానికి అవసరమైన నీటిని అందించేలా సంబంధిత శాఖల అధికారులు తక్షణ చర్యలు చేపట్టాలని కోరారు. రైతుల సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు. సమీక్ష సమావేశానికి సంబంధిత శాఖల అధికారులు కొందరు హాజరుకాకపోవడంపై ఎంపీడీవో స్పందించారు. విధులకు సంబంధించి కీలకమైన సమీక్షకు గైర్హాజరైన అధికారులకు షోకాజ్ నోటీసులు జారీ చేసినట్లు తెలిపారు. ప్రజా సమస్యల పరిష్కారంలో అధికారులు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సూచించారు.మండల విద్యాశాఖ అధికారి మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లోవిద్యార్థులకు నాణ్యమైన విద్య అందించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ప్రభుత్వం అందించాల్సిన రెండు జతల దుస్తులు, షూస్ పంపిణీ పూర్తయిందని వెల్లడించారు. ప్రభుత్వ పాఠశాలల్లో అర్హత కలిగిన ఉపాధ్యాయులతో బోధన అందించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు వివరించారు. ఉపాధ్యాయుల అర్హత, నైపుణ్యాల పెంపునకు ప్రభుత్వం ఉపాధ్యాయ అర్హత పరీక్ష నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఎల్‌నినో ప్రభావం నేపథ్యంలో నీటి వనరులను కాపాడుకోవడంపై అధికారులు దృష్టి సారించారు. గ్రామాల్లో ఇంకుడు గుంతల నిర్మాణాన్ని ప్రోత్సహించాలని, వర్షపు నీటిని ఒడిసిపట్టి భూగర్భ జలాలను పెంపొందించాలని సూచించారు. చెరువులు, కుంటల్లో నీటిని సంరక్షించుకోవాలని, నీటి పొదుపుపై సర్పంచులు గ్రామస్థులకు అవగాహన కల్పించాలని కోరారు. ఉపాధి హామీ పథకం కింద కోళ్ల పెంపకానికి షెడ్డు నిర్మించుకునే వారికి రూ. 2 లక్షల వరకు ఆర్థిక సాయం అందించే అవకాశం ఉందని సంబంధిత అధికారి తెలిపారు. గొర్రెల పెంపకానికి అవసరమైన షెడ్ల నిర్మాణానికి కూడా ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఆర్థిక సహాయం అందించనున్నట్లు వివరించారు.మండల తహసీల్దార్ మాట్లాడుతూ భూముల పునఃసర్వే కార్యక్రమం కొనసాగుతోందని తెలిపారు.

గ్రామాల వారీగా భూముల వివరాలను సర్వే చేసి నమోదు చేస్తామని పేర్కొన్నారు. బూదిదిపాడు, వీర్లదిన్నె తదితర గ్రామాల్లో సర్వే ప్రక్రియ ముగింపు దశకు చేరుకుందని వెల్లడించారు.ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలకు సంబంధించి తుది బిల్లులు అందక లబ్ధిదారులు ఎదుర్కొంటున్న సమస్యలను సర్పంచులు సమావేశంలో ప్రస్తావించారు. ఇటీవల బాధ్యతలు స్వీకరించిన గృహ నిర్మాణ శాఖ ఏఈ సమస్య మార్చి నెలలోపు ఫొటో నమోదు పూర్తయిన లబ్ధిదారులకు తుది బిల్లులు అందగా, ఆ తర్వాత ఫొటో నమోదు పూర్తిచేసిన కొందరికి చెల్లింపులు పెండింగ్‌లో ఉన్నట్లు వివరించారు. కేంద్ర ప్రభుత్వ నిధులకు సంబంధించిన అంశాలు కూడా ఉండటంతో బిల్లుల చెల్లింపులో జాప్యం జరుగుతోందని, సమస్యను పరిష్కరించేం దుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. మండలంలోని పలు గ్రామాల్లో వీధి కుక్కల బెడద పెరుగుతోందని సర్పంచులు అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. ప్రజలకు, ముఖ్యంగా చిన్నారులకు ఇబ్బందులు కలగకుండా సంబంధిత శాఖలు తగిన చర్యలు చేపట్టాలని కోరారు. సమావేశంలో ప్రజాప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు. గ్రామాల్లో నెలకొన్న సమస్యలను గుర్తించి వాటి పరిష్కారానికి సమన్వయంతో పనిచేయాలని, ప్రజలకు ఇబ్బందులు కలిగించే అంశాలపై సంబంధిత శాఖలు ప్రత్యేక దృష్టి సారించాలని సమావేశంలో సూచించారు.

కరువు మండలాల జాబితాలో తోగుట మండలం లేకపోవడం బాధాకరం
పిట్ల సత్తయ్య, పన్యాల ప్రవీణ్ కుమార్ రెడ్డి, బక్క కనకయ్య..



తొగుట (సింగిడి):
తొగుట మండలంలో మండల సర్పంచులు మీడియా సమావేశంలో. మాట్లాడుతూ మండలంలో ఉన్న మల్లన్న సాగర్, కూడవెల్లి పరివాహ ప్రాంతం వాగు లో సాధారణ వర్షపాతంతో ఎక్కడ నీళ్ల లేకుండా పోయాయన్నారు. వానాకాల పంటలను రైతులు వేసిన సమయంలో ఎల్ ని నో ప్రభావంతో వర్షాలు తక్కువగా నమోదయ్యాయని దీనికి తోడు ప్రభుత్వం కరెంటు సరిపడా అందించకపోవడంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.ఎలినినో ప్రభావంతో పత్తి పంటలు ఎకరాకు మూడు నాలుగు క్వింటల్ కూడా రాని పరిస్థితిలో రైతాంగం పూర్తిగా అప్పుల ఊబిలో కూరుకుపోతుందని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం జిల్లా యంత్రాంగం తోగుట మండలాని కరువు మండలాశీగా ప్రకటించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచులు చందా లావణ్య స్వామి,గోపాలురెడ్డి వెంకటస్వామిగౌడ్, రవి, నర్సిములు,రమేష్ పాల్గొన్నారు.

ఆలూరులో 1,248 ఎకరాల భూసేకరణను విరమించుకోవాలి
రైతులకు ఓఆర్‌సీ పట్టాలు ఇవ్వాలి: బ్యాగరి సుదర్శన్



చేవెళ్ల, (సింగిడి):రంగారెడ్డి జిల్లా చేవెళ్ల మండలం ఆలూరు గ్రామ పరిధిలో డేటా సెంటర్, పారిశ్రామిక పార్కు కోసం చేపట్టిన 1,248 ఎకరాల 22 గుంటల భూసేకరణను తక్షణమే విరమించుకోవాలని తలారం గ్రామానికి చెందిన బ్యాగరి సుదర్శన్ డిమాండ్ చేశారు.బుధవారం ఆయన విడుదల చేసిన ప్రకటనలో.. ఆలూరులోని పచ్చని సాగు భూములను TGIIC ద్వారా సెక్షన్ 19(1) కింద గెజిట్ నోటిఫికేషన్ ఇవ్వడం బాధాకరమన్నారు. తరతరాలుగా సాగు చేసుకుంటున్న సుమారు 600 రైతు కుటుంబాలను రోడ్డున పడేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సాగులో ఉన్న భూములను హజ్రత్ మగ్దూమ్ షా బీయాబాని దర్గాకు చెందిన వక్ఫ్ ఆస్తులుగా పేర్కొంటూ ఐటీ సంస్థలకు కట్టబెట్టే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు.రైతులకు ఆక్యుపెన్సీ రైట్స్ సర్టిఫికెట్లు (ఓఆర్‌సీ) ఇవ్వాల్సింది పోయి భూములు లాక్కోవడం వల్ల అన్నదాతల భవిష్యత్తు అగమ్యగోచరంగా మారుతుందని విమర్శించారు.

డేటా సెంటర్లతో పర్యావరణానికి ముప్పు

డేటా సెంటర్ల వల్ల స్థానికులకు ప్రయోజనం లేకపోగా పర్యావరణానికి తీవ్ర నష్టం వాటిల్లుతుందని ఆయన హెచ్చరించారు. సర్వర్లను చల్లబరచడానికి రోజూ లక్షల లీటర్ల నీరు అవసరమవుతుందని, దీంతో ఆలూరు చుట్టుపక్కల భూగర్భ జలాలు అడుగంటి తాగు, సాగునీటికి ఎద్దడిఏర్పడుతుందన్నారు. 24 గంటలు పనిచేసే ఈ కేంద్రాల వల్ల విద్యుత్ వినియోగం, కార్బన్ ఉద్గారాలు, ఇ-వేస్ట్, జనరేటర్లు, కూలింగ్ ఫ్యాన్ల వల్ల శబ్ద కాలుష్యం పెరిగి ప్రజల ఆరోగ్యం దెబ్బతింటుందని ఆందోళన వ్యక్తం చేశారు. ఆటోమేటెడ్ సిస్టమ్స్ తో నడిచే ఈ కేంద్రాల్లో భూములు కోల్పోయే స్థానిక రైతులకు, యువతకు శాశ్వత ఉద్యోగాలు రావని స్పష్టం చేశారు. ప్రభుత్వం వెంటనే స్పందించి నోటిఫికేషన్ రద్దు చేసి, రైతులకు ఓఆర్‌సీ పట్టాలు జారీ చేయాలని, ఇలాంటి ప్రాజెక్టు లను జనావాసాలకు దూరంగా బంజరు భూముల్లో ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు.

మృతురాలి కుటుంబానికి
అంబేద్కర్ చేయూత సైన్యం ఆర్థిక చేయూత
రూ.5 వేల ఆర్థిక సాయం అందజేత
దొంగ తిరుపతమ్మ కుటుంబానికి అండగా నిలిచిన సంఘం సభ్యులు



రేవల్లి, (సింగిడి): అనారోగ్యంతో మృతి చెందిన దొంగ తిరుపతమ్మ కుటుంబానికి డా. బి.ఆర్. అంబేద్కర్ చేయూత సైన్యం సభ్యులు ఆర్థిక సాయం అందించి మానవత్వాన్ని చాటుకున్నారు. అక్టోబర్ 27న దొంగ తిరుపతమ్మ (భర్త దొంగ రాంచంద్రయ్య) అనారోగ్య కారణాలతో మృతి చెందగా, విషయం తెలుసుకున్న సంఘం సభ్యులు బాధిత కుటుంబాన్ని పరామర్శించి ఆర్థికంగా అండగా నిలిచారు. ఇందులో భాగంగా రూ. 5,000 నగదును ఆమె పెద్ద కుమారుడు కేతేపల్లి మద్దిలేటికి సంఘం ప్రధాన కార్యదర్శి బూడిద దేవేందర్ చేతుల మీదుగా అందజేశారు.ఈ కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు గురగాళ్ల కుర్మయ్య, ఉపాధ్యక్షుడు బోడ శ్రీను, సలహాదారు కుంటి మధు, గ్రామ పెద్దలు దొబ్బలి నిరంజన్, బోడ కృష్ణయ్య, వడ్డెమాన్ బాలకిష్టయ్య, కేతేపల్లి తిరుపతయ్య (మాజీ డిప్యూటీ), కలుమూరి కుర్మయ్య, కుంటి నరసింహ, తప్పెట కుర్మయ్య, గురగాళ్ల రాములు, పెద్దగాళ్ల కుర్మయ్య, కేతేపల్లి రాములు (వార్డు సభ్యుడు), తప్పెట గోవర్ధన్, బైని చందు, వడ్డెమాన్ సుల్తాన్, గౌండ్ల లక్ష్మణ్, వడ్డెమాన్ చిన్న బుడ్డయ్య, కుంటి చంద్రశేఖర్, గురగాళ్ల అంజి, వడ్డెమాన్ భాస్కర్, గురగాళ్ల చెన్నరాయుడు, వడ్డెమాన్ చిన్న తదితరులు పాల్గొన్నారు.

సొంత నిధులతో తాగునీటి
సమస్య పరిష్కారానికి కృషి



అల్వాల్, (సింగిడి): అల్వాల్ సర్కిల్ పరిధిలోని ఎం హెచ్ ఆర్ కాలనీలో తాగునీటి సమస్య పరిష్కారం కోసం కాలనీవా సులు ముందుకు వచ్చారు. ప్రతి ఇంటి నుండి నిధులు సేకరించి. వాటర్‌బోర్డుకు రూ 5 లక్షలు చెల్లించి నూతన పైపులైను ఏర్పాటుకు బుధవారం శంకుస్థాపన చేశారు.కార్యక్రమంలో కృష్ణ, సంతోష్ గౌడ్, ప్రశాంత్‌రెడ్డి, శేఖర్, ప్రనితి,పద్మ,అరుణ,కాలనీవాసులు పాల్గొన్నారు.

శేరుపల్లి కబడ్డీ క్రీడాకారుడు
జాతీయ స్థాయికి ఎంపిక



శ్రీరంగాపూర్, (సింగిడి): రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీల్లో వనపర్తి జిల్లా జట్టు ద్వితీయ స్థానం సాధించగా, జిల్లాకు చెందిన ఇద్దరు క్రీడాకారులు జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. అక్టోబర్ 2 నుంచి 5 వరకు రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడలో జరిగిన రాష్ట్రస్థాయి కబడ్డీ టోర్నమెంట్‌లో భాస్కర్ (శేరుపల్లి), ఆంజనేయులు (మూలమల్ల) ప్రతిభ కనబరిచి జాతీయ స్థాయికి ఎంపికయ్యారు. వీరు నవంబర్ 1 నుంచి 4 వరకు బీహార్‌లో జరిగే జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొననున్నట్లుజిల్లా కబడ్డీ అసోసియేషన్ జనరల్ సెక్రటరీ ఎం. కురుమయ్య తెలిపారు.జిల్లా నుంచి ఇద్దరు క్రీడాకారులు జాతీయ స్థాయికి ఎంపిక కావడంపై అసోసియేషన్ చైర్మన్ పద్మజా రెడ్డి, అధ్యక్షుడు వెంకటేశ్వర రెడ్డి, ఉపాధ్యక్షులు దామోదర్, తిరుపతయ్య, కోశాధికారి గోపాల్‌తో పాటు వెంకట రాములు, చందు, సురేష్, వెంకటేష్, నాగరాజు హర్షం వ్యక్తం చేసి క్రీడాకారులను అభినందించారు.క్రీడాకారులకు మెరుగైన సౌకర్యాలు కల్పిస్తూ శిక్షణ శిబిరాలు నిర్వహించడం వల్లే వనపర్తి జిల్లా రాష్ట్రస్థాయిలో తరచూ మొదటి రెండు స్థానాల్లో నిలుస్తోందని అసోసియేషన్ ఆర్గనైజింగ్ సెక్రటరీ మధు తెలిపారు.

పెబ్బేరు మండలం కరువు మండలంగా ప్రకటన

వర్షాభావంతో వ్యవసాయ రంగంపై ప్రభావం.. రైతుల్లో ఆందోళన
అర్హులైన రైతులకు పరిహారం, సహాయక చర్యలు అందించాలని విజ్ఞప్తి

పెబ్బేరు (సింగిడి):
వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో పెబ్బేరు మండలాన్ని కరువు మండలంగా ప్రకటించినట్లు వ్యవసాయ అధికారి షేక్ మున్నా తెలిపారు. సకాలంలో వర్షాలు కురవక వ్యవసాయ రంగంపై ప్రభావం పడుతున్న నేపథ్యంలో మండలాన్ని కరువు మండలంగా గుర్తించినట్లు వెల్లడించారు. వ్యవసాయంపైనే ఆధారపడి జీవనం సాగిస్తున్న రైతులు కరువు పరిస్థితులతో ఆందోళన చెందుతున్నారు. పంటల సాగు, దిగుబడులు, పెట్టుబడుల విషయంలో రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వర్షాభావం కారణంగా వ్యవసాయంపై పడుతున్న ప్రభావంతో రైతులు ఆర్థికంగా నష్టపోయే పరిస్థితులు నెలకొంటున్నాయి. ఈ నేపథ్యంలో ప్రభుత్వం స్పందించి, కరువు పరిస్థితుల వల్ల నష్టపోయిన రైతులను ఆదుకునేందుకు అవస రమైన చర్యలు చేపట్టాలని రైతులు కోరుతున్నారు. కరువు మండల ప్రకటనకు అనుగుణంగా ప్రభుత్వ నిబంధనల ప్రకారం అర్హులైన రైతులకు పరిహారం అందించడంతో పాటు, అవసరమైన ఇతర సహాయక చర్యలు చేపట్టి తమను ఆదుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

గోసన్‌పల్లిలో ఉపాధి కూలీలకు గ్లూకోజ్, వాటర్ బాటిళ్ల పంపిణీ

కూలీలకు అండగా అఖిలరాజు ఫౌండేషన్ సేవా కార్యక్రమం



దుబ్బాక, (సింగిడి): సేవా కార్యక్రమాల్లో భాగంగా దుబ్బాక మండలం గోసన్‌పల్లి గ్రామంలో ఉపాధి హామీ పనులు చేస్తున్న కూలీలకు బుధవారం గ్లూకోజ్ ప్యాకెట్లు, వాటర్ బాటిళ్లను పంపిణీ చేశారు. అఖిలరాజు ఫౌండేషన్ వ్యవస్థాపకులు, కూకట్‌పల్లి ఎస్ఐ తౌడా సత్యనారాయణ ఆదేశాల మేరకు ఫౌండేషన్ మండల అధ్యక్షుడు పాకనాటి సునీల్ కుమార్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పాకనాటి సునీల్ కుమార్ మాట్లాడుతూ.. ఉపాధి హామీ పనుల్లో భాగంగా కూలీలు ప్రతిరోజూ శ్రమిస్తూ గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి తమ వంతు కృషి చేస్తున్నారని అన్నారు. కష్టపడి పనిచేసే కూలీలకు తాగునీరు, గ్లూకోజ్ అందించడం ద్వారా కొంత ఉపశమనం కల్పించాలనే ఉద్దేశంతో ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్లు తెలిపారు. కూలీల ఆరోగ్యం, సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకొని వారికి అవసరమైన సహాయం అందించడం అభినందనీయమని పేర్కొన్నారు. అఖిల రాజు ఫౌండేషన్ ఆధ్వర్యంలో గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలకు ఉపయోగపడే సేవా కార్యక్రమాలను నిరంతరం నిర్వహిస్తామని తెలిపారు. సమాజంలోని అవసరమైన వర్గాలకు అండగా నిలవడం, సామాజిక బాధ్యతతో సేవలందించడం ఫౌండేషన్ ప్రధాన లక్ష్యమని వివరించారు. ఈ కార్యక్రమంలో ఇనుప రవి, ఉప సర్పంచ్ సుమన్ రెడ్డి, ఫౌండేషన్ మండల ఉపాధ్యక్షుడు గుంటి రాహుల్, గ్రామాధ్యక్షుడు అంబటి రఘువరణ్, నాయకులు జగన్, సత్యనారాయణ, నర్సింలు, ఫీల్డ్ అసిస్టెంట్ అరుణ, కళ్యాణ్, లింగం తదితరులు పాల్గొన్నారు.

మున్సిపాలిటీలో వంద శాతం పూర్తయిన ఏకరూప దుస్తుల పంపిణీ

ఆమనగల్లు జిల్లాలోనే ప్రథమం:మున్సిపల్ కమిషనర్ రాఘువేందర్





ఆమనగల్లు, (సింగిడి):: ఆమనగల్లు పురపాలక సంఘం పరిధిలోని ప్రభుత్వజూనియర్ కళాశాలలో మెప్మాఆధ్వర్యంలో విద్యార్థులకు ఏకరూప దుస్తుల (యూనిఫాం) పంపిణీ కార్యక్రమం ఘనంగా జరిగింది. బుధవారం కళాశాల ప్రాంగణంలో జరిగిన ఈ కార్యక్రమానికి మున్సిపల్ చైర్మన్ ఎన్. పత్య నాయక్, మున్సిపల్ కమిషనర్ ఎస్. రాఘవేందర్ రెడ్డి ముఖ్య అతిథులుగా హాజరై విద్యార్థులకు దుస్తులను అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రభుత్వ విద్యార్థులందరికీ సకాలంలో నాణ్యమైన యూనిఫాంలు అందించాలనే సంకల్పంతో ఈ కార్యక్రమం చేపట్టామని, మున్సిపాలిటీ పరిధిలో పంపిణీ ప్రక్రియను జిల్లాలోనే అందరికంటే ముందుగా పూర్తి చేయడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. ఈ పంపిణీతో జిల్లాలోనే అత్యంత వేగంగా ఏకరూప దుస్తుల పంపిణీని వంద శాతం పూర్తి చేసిన మొదటి పురపాలక సంఘంగా ఆమనగల్లు నిలిచిందన్నారు. ఆమనగల్లు మున్సిపాలిటీలోని బాలికల ఆశ్రమ పాఠశాలలో స్థానిక కౌన్సిలర్ సునీత ప్రశాంత్, మున్సిపల్ కో-ఆప్షన్ సభ్యులు హాలిమ బేగంతో కలిసి విద్యార్థులకు యూనిఫాంలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పేద విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు అన్ని వసతులు కల్పించాలనే సంకల్పంతో ప్రభుత్వం ఉచితంగా ఏకరూప దుస్తులను అందజేస్తోందని పేర్కొన్నారు. విద్యార్థులందరూ క్రమం తప్పకుండా పాఠశాలలకు హాజరవుతూ, ప్రభుత్వం కల్పిస్తున్న ఈ సదుపాయాలను సద్వినియోగం చేసుకొని ఉన్నత చదువులు చదవాలని వారు ఆకాంక్షించారు. కార్యక్రమం లో కళాశాల ప్రిన్సిపాల్ మాధవరావ్, కౌన్సిలర్ నాగిల్ల జగన్, ఇన్-చార్జ్ మేనేజర్ ఆంజనేయులు, మెప్మా ఆర్పీలు పద్మ, విజయలక్ష్మి, చంద్రకళ, వార్డెన్‌గోపాల్, ఉపాధ్యాయులు కళాశాలసిబ్బంది పాల్గొన్నారు.

మచ్చ బొల్లారం డివిజన్‌లో సీసీ రోడ్లు

భూగర్భ డ్రైనేజీ పనులకు శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి



అల్వాల్, (సింగిడి): అభివృద్ధిలో భాగంగా మచ్చ బొల్లారం డివిజన్‌లో సీసీ రోడ్లు, భూగర్భ డ్రైనేజీ పనులకు మల్కాజ్‌గిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి బుధవారం ఇంజనీరింగ్ అధికారులతో కలిసి భూమి పూజ చేసి శంకుస్థాపన చేశా రు. స్థానిక నాయకులు, కాలనీవాసుల సమక్షంలో వివిధ అభివృద్ధి పనులను ప్రారంభించారు. ప్రెసిడెన్సీ అవెన్యూలో రూ. 16 లక్షలతో సీసీ రోడ్డు పనులు ప్రారం భంమచ్చ బొల్లారం డివిజన్‌లోని ప్రెసిడెన్సీ అవెన్యూ లో రూ. 16 లక్షల వ్యయంతో చేపడుతున్న సీసీ రోడ్డు నిర్మాణ పనులను ఎమ్మెల్యే గారు ప్రారంభించారు. ఈ సందర్భంగా భారతి ఆవాస్ అపార్ట్ మెంట్ వాసులు తమ కాలనీలో నెలకొన్న డ్రైనేజీ, వీధి దీపాల సమస్యలను ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి దృష్టికి తీసు కువ చ్చారు. స్పందించిన ఎమ్మెల్యే వెంటనే సం బంధిత అధికారులకు సమస్య లను తెలి యజేసి, వాటి పరిష్కారా నికి అవస రమైన చర్యలు తీసుకోవాలని సూచించారు. భూపతిరావు నగర్ కాలనీ లో సుమారు రూ. 16 లక్షల వ్యయంతో చేపడుతున్న భూగర్భ డ్రైనేజీ నిర్మాణ పనులకు ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. ఈ పనులు పూర్త యితే కాలనీవా సులకు డ్రైనేజీ సమస్యల నుంచి ఉపశ మనం లభించడంతో పాటు పరిసరాల పరిశుభ్రత మెరుగుపడనుంది. వజ్ర ఎన్‌క్లే వ్‌లో రూ. 22 లక్షలతో నిర్మించనున్న సీసీ రోడ్డు పనులను ఎమ్మెల్యే ప్రారంభించారు. రహదారుల అభివృద్ధి, మెరుగైన మౌలిక సదుపాయాల కల్పనతో స్థానిక ప్రజలకు రాకపోకలు మరింత సౌక ర్యవంతంగా మారనున్నాయి. ఎమ్మె ల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి మాట్లాడుతూ, నియో జకవర్గంలోని ప్రతి డివిజన్‌లో ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయా లను మెరుగుపరిచేం దుకు కృషి చేస్తున్నట్లు తెలి పారు. ప్రజలు ఎదుర్కొంటున్న రోడ్లు, డ్రైనేజీ, వీధి దీపాల వంటి సమస్యలను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి, వాటి పరిష్కారానికి చర్యలు చేపడుతున్నట్లు పేర్కొన్నారు. అభివృద్ధి పనులను నాణ్యతా ప్రమాణా లతో, నిర్దిష్ట సమయంలో పూర్తి చేయాలని అధికారులకు సూచించారు.

కార్యక్రమంలో జలమండలి డీజీఎం వెంకటేశ్వర్‌రెడ్డి, అల్వాల్ సర్కిల్ అసిస్టెంట్ ఇంజనీర్ రవళి, జలమండలి సూపర్‌వైజర్ కృష్ణ, వర్క్ ఇన్‌స్పెక్టర్లు అప్రోజ్, విష్ణేష్, మాజీ కార్పొరేటర్ శ్రీమతి చింతల శాంతి శ్రీనివాస్ రెడ్డి, బీఆర్ఎస్ నాయకులు డోలి రమేష్, ఢిల్లీ పరమేష్, శోభన్ బాబు, శ్రీధర్ గౌడ్,సురేష్,నర్సింగ్‌రావు, సతీష్, భాస్కర్, రాజు, ప్రశాంత్, ఆరిఫ్, వీరేశం, రెహమత్ ఖాన్, రమేష్ కాలనీవాసులు రాజు, పెంటయ్య, దేవేందర్ రెడ్డి, ఠాకూర్ సింగ్, బాల్రాజు, శ్రీనివాస్ పాల్గొన్నారు.

రైతుల భూముల రీ సర్వే.. సమస్యలకు పరిష్కారం

రేకులపల్లి శివారులో నాలుగు రోజులుగా కొనసాగుతున్న సర్వే

రైతులు తప్పనిసరిగా పాల్గొనాలి: బీకేయూ జిల్లా అధ్యక్షుడు సుబ్బయ్య యాదవ్





రేవల్లి, ఏదుల, (సింగిడి): వనపర్తి జిల్లా ఏదుల మండలం రేకులపల్లి గ్రామ రెవెన్యూ శివారులోని శాఖాపూర్ గ్రామ రైతుల భూములకు సంబంధించి తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన భూముల రీ సర్వే బుధవారం నిర్వహించారు. గత నాలుగు రోజులుగా కొనసాగుతున్న ఈ సర్వేను ఏదుల మండల సర్వేయర్ సత్యనారాయణ, మండల అధికారి గిరిధర్ యాదయ్య ఆధ్వర్యంలో రెవెన్యూ సిబ్బంది చేపట్టారు. ఈ కార్యక్రమంలో భారతీయ కిసాన్ యూనియన్ వనపర్తి జిల్లా అధ్యక్షుడు వి. సుబ్బయ్య యాదవ్ పాల్గొని రైతులకు సర్వేకు సంబంధించిన వివరాలను ఎప్పటికప్పుడు తెలియజేశారు. ప్రభుత్వం చేపడుతున్న భూముల రీ సర్వే ద్వారా భూ హద్దులకు సంబంధించిన వివాదాలు తగ్గే అవకాశం ఉందని, సర్వే పూర్తయిన అనంతరం అధికారులు పూర్తిస్థాయిలో భూ నక్షాలను రూపొందిస్తారని తెలిపారు. భవిష్యత్తులో రైతులకు భూ సమస్యలు తలెత్తకుండా ఈ ప్రక్రియ ఉపయోగపడుతుందని, భూ ఆధార్ కార్డుల ద్వారా రైతులు తమ భూముల వివరాలను ఆన్‌లైన్‌లో పరిశీలించుకునే అవకాశం ఉంటుందని వివరించారు.

సర్వే సమయంలో రైతులందరూ విధిగా పాల్గొని అధికారులకు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో జీపీఓలు కుమారస్వామి, నిరంజన్, బాబు, లైసెన్స్ సర్వేయర్ శివ, గ్రామ జీపీ వర్కర్ రాము, రైతులు రాము యాదవ్, మంగధుడి బాలస్వామి, ముంత రాముడు, ముంత బాలస్వామి, కురుమయ్య, ఆడే మధుసూదన్, ఆడం వెంకటేష్, ఆడే మన్నెంకొండ, మేడం రాముడు, మేడం లక్ష్మయ్య, మేడం తిరుపతయ్య తదితరులు పాల్గొన్నారు.

మిషన్ భగీరథ నీటి లీకేజీలపై అధికారుల నిర్లక్ష్యం!

నీటి పొదుపుపై సూచనలు.. వృథాను అరికట్టడంలో అలసత్వం



తెలకపల్లి (సింగిడి): మండల కేంద్రంలో మిషన్ భగీరథ పైపుల లీకేజీలతో తాగునీరు వృథాగా పోతోంది. తహసీల్దార్ కార్యాలయం సమీపంలో, బస్టాండ్ వద్ద పైపుల నుంచి నీరు లీకవుతున్నా సంబంధిత అధికారులు పట్టించు కోవడం లేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎల్‌నినో ప్రభావంతో భవిష్యత్తులో నీటి కొరత ఏర్పడే అవకాశం ఉందని, ప్రజలు నీటిని పొదుపుగా వినియోగించుకోవాలని అధికారులు సూచిస్తున్నప్పటికీ, మరోవైపు పైపుల లీకేజీలతో తాగునీరు వృథా కావడంపై స్థానికులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. లీకేజీల కారణంగా రోడ్లపై నీరు చేరి పాదచారులు, వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. అంతేకాకుండా పైపుల లీకేజీల ద్వారా కలుషితాలు నీటి సరఫరాలోకి చేరే ప్రమాదం ఉందని ప్రజలు ఆందోళన చెందుతున్నారు. సమస్య సృష్టంగా కనిపిస్తున్నప్పటికీ అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించడం లేదని స్థానికులు విమర్శిస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు వెంటనే స్పందించి లీకేజీలను అరికట్టి, తాగునీటి వృథాను నివారించాలని, ప్రజలకు సురక్షితమైన నీటి సరఫరా అందేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

పెబ్బేరులో విద్యుత్ వైర్లకు తగిలి వరిగడ్డికి మంటలు!

భగీరథ విగ్రహం వద్ద ఘటన అప్రమత్తమైన అగ్నిమాపక సిబ్బంది

గడ్డిని కింద పడవేసిన డ్రైవర్ తప్పిన పెను ప్రమాదం

ఎత్తుగా సామగ్రి తరలించే వాహనాలపై నిఘా పెట్టాలని స్థానికుల విజ్ఞప్తి





పెబ్బేరు, (సింగిడి): పెబ్బేరు మున్సిపాలిటీ పరిధిలో వరిగడ్డి తరలిస్తున్న వాహనానికి విద్యుత్ వైర్లు తగలడంతో గడ్డికి మంటలు అంటుకున్న ఘటన కలకలం రేపింది. పట్టణంలోని భగీరథ విగ్రహం సమీపంలో ఈ ప్రమాదం చోటుచేసుకుంది. గుర్రంగడ్డ నుంచి పెబ్బేరుకు వరిగడ్డిని తరలిస్తున్న వాహనం విద్యుత్ వైర్ల కిందుగా వెళ్తుండగా గడ్డి వైర్లకు తగలడంతో మంటలు చెలరేగినట్లు తెలిసింది. మంటలు వ్యాపించడాన్ని గమనించిన డ్రైవర్ వెంటనే అప్రమత్తమయ్యాడు. వాహనంలోని జాక్ సాయంతో గడ్డిని పైకి లేపి, మంటలు మరింత వ్యాపించకుండా వరిగడ్డిని కొంతకొంతగా రహదారిపైకిందకు పడవేసినట్లు సమాచారం. ఈ క్రమంలో ఎంఆర్డీఓ కార్యాలయానికి వెళ్లే రహదారిపై కూడా వరిగడ్డి పడిపోవడంతో స్థానికులు, కాలనీవాసులు భయాందోళనకు గురయ్యారు. ఘటనపై సమాచారం అందుకున్న అగ్నిమాపక శాఖ సిబ్బంది వెంటనే సంఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపులోకి తీసుకొచ్చారు. సకాలంలో స్పందించడంతో మంటలు మరింత వ్యాపించకుండా అడ్డుకట్ట పడింది. దీంతో పెను ప్రమాదం తప్పినట్లయింది. పట్టణ రహదారులపై ఎత్తుగా వరిగడ్డి, ఇతర సామగ్రిని తరలించే వాహనాల విషయంలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు. ముఖ్యంగా విద్యుత్ వైర్లు ఉన్న ప్రాంతాల్లో వాహనాల ఎత్తును దృష్టిలో ఉంచుకుని అప్రమత్తంగా వ్యవహరించాలని సూచిస్తున్నారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా సంబంధిత అధికారులు తనిఖీలు నిర్వహించి, నిబంధనలు ఉల్లంఘించే వారిపై చర్యలు తీసుకోవాలని కాలనీవాసులు విజ్ఞప్తి చేస్తున్నారు.

పట్టభద్రుల ఓటర్ల నమోదు, సర్ ప్రక్రియపై ఆర్డీఓ సమీక్ష



చేవెళ్ల, (సింగిడి): చేవెళ్ల అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలో కొనసాగుతున్న స్పెషల్ ఇంటెన్సివ్ రెవిజన్ (సర్ ప్రక్రియ మరియు పట్టభద్రుల ఓటర్ల నమోదుపై చేవెళ్ల ఆర్డీఓ ఈరోజు ఈఆర్ఓ కార్యాలయంలో మంగళవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. చేవెళ్ల ఆర్డీఓ , ఏఈఆర్ఓ కె. పార్థసింహారెడ్డి అధ్య క్షతన జరిగిన ఈ సమావేశంలో చేవెళ్ల తహసీల్దార్ బి. కృష్ణయ్య, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మండలాల వారీగా సర్ పురోగతి, నోటీసుల జారీ, హియరింగ్స్ నిర్వహణ, ఓటర్ల వివరాల ధృవీకరణపై ఆర్డీఓ సమీక్షించారు. కొత్తగా అందిన ఫామ్ -6, ఫామ్ 7, ఫామ్ 8 దరఖాస్తులను ఏరోప్లేన్ ఏఈఆర్ఓ లాగిన్ లో వెంటనే పరిశీలించి సంబంధిత బీఎల్ ఓ లకు అసైన్ చేసి, పెండింగ్ పనులను గడువులోగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. -గ్రాడ్యుయేట్ ఓటరు నమోదుకు తుది గడువు 05-11-2026, గ్రాడ్యుయేట్ నియోజకవర్గ ఓటర్ల జాబితా డి -నోవో తయారీ ప్రక్రియపై రాజకీయ పార్టీల ప్రతినిధులకు వివరించారు. అర్హులైన పట్టభద్రులు ఓటరుగా నమోదు చేసుకునే విధానం, దరఖాస్తు ప్రక్రియ, అవసరమైన పత్రాలపై విస్తృత అవగాహన కల్పించాలని సూచించారు. ఓటరు నమోదుకు చివరి తేదీ 05 అని తెలిపారు.గ్రామ పంచాయతీలు, మున్సిపల్ వార్డుల్లో టాంటాం ద్వారా విస్తృత ప్రచారం నిర్వహించి పట్టభద్రుల్లో చైతన్యం తీసుకురావాలని ఎంపీడీఓ లు, మున్సిపల్ కమిషనర్లకు సూచించారు. అర్హులైన ప్రతి పట్టభద్రుడు ఓటరుగా నమోదు చేసుకునేలా రాజకీయ పార్టీలు, అధికారులు సహకరించాలని కోరారు.సర్ ప్రక్రియతో పాటు గ్రాడ్యుయేట్ ఓటర్ల నమోదు కార్యక్రమాన్ని పారదర్శకంగా, ఎన్నికల నిబంధనల ప్రకారం నిర్దిష్ట గడువులోగా పూర్తి చేయాలని ఆర్డీఓ స్పష్టం చేశారు.

పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓటరు నమోదు ప్రక్రియను వేగవంతం చేయాలి

ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి



అల్వాల్, (సింగిడి): మహబూబ్‌నగర్-రంగారెడ్డి-హైదరాబాద్ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో అర్హులైన పట్టభద్రులందరూ ఓటరుగా నమోదు చేసుకునేలా విస్తృత అవగాహన కల్పించి, నమోదు ప్రక్రియను వేగవంతం చేయాలని మల్కాజ్‌గిరి ఎమ్మెల్యే శ్రీ మర్రి రాజశేఖర్‌రెడ్డి సూచించారు. బుధవారం అల్వాల్ డివిజన్ పరిధిలోని లయోలా కళాశాలలో నిర్వహిస్తున్న పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓటరు నమోదు కార్యక్రమాన్ని ఎమ్మెల్యే పరిశీలించారు. కళాశాల యాజమా న్యంతో మాట్లాడి, ఓటరు నమోదు ప్రక్రియ కొనసాగుతున్న తీరును తెలుసుకు న్నారు. అర్హులైన పట్టభద్రులు తమ పేర్లను ఓటరు జాబితాలో నమోదు చేసుకునేలా కళాశాల యాజమాన్యం చొరవ తీసుకోవా లని కోరారు. నవంబర్ 1, 2023 నాటికి డిగ్రీ పూర్తి చేసిన అర్హులైన పట్టభద్రులు ఎన్నికల నిబంధనల ప్రకారం అవసరమైన పత్రాలను సమర్పించి తమ పేర్లను పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓటరు జాబితాలో నమోదు చేసుకోవాలని ఎమ్మెల్యే సూచించారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ఓటరు నమోదు ప్రాముఖ్య తను వివరించి, ఎవరూ అవకాశాన్ని కోల్పోకుండా చర్యలు తీస కోవాలని తెలిపారు. ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు ఎంతో కీలక మని, పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో అర్హులైన ప్రతి ఒక్కరూ తమ ఓటు హక్కును వినియోగించుకునేలా నమోదు ప్రక్రియను మరిం త వేగవంతం చేయాలని ఎమ్మెల్యే పిలుపు నిచ్చారు. కార్యక్రమంలో లయోలా కళాశాల కరస్పాండెంట్ రెక్స్ అంజిలో, ప్రిన్సిపల్ బుజ్జి బాబు, మాజీ కార్పొరేటర్ శ్రీమతి చింతల శాంతి శ్రీనివాస్ రెడ్డి, లియోనార్డ్ మీగర్, నాయకులు తోట నరేందర్ రెడ్డి, జె.ఎ.సి. సురేందర్ రెడ్డి, డోలి రమేష్, ఢిల్లీ పరమేష్, అరుణ్ రావు, శరణ్ గిరి,సురేష్,సందీప్,ఆరిఫ్,రెహమత్‌ఖాన్ పాల్గొన్నారు.

బాలల రక్షణపై మూడు పాఠశాలల్లో అవగాహన కార్యక్రమాలు



గద్వాల్ బ్యూరో (సింగిడి): జోగులాంబ గద్వాల్ జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో 'సురక్షిత్ బచ్పన్ అభియాన్' కార్యక్రమంలో భాగంగా గద్వాల్ పట్టణంలోని మూడు పాఠశాలల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. విశ్వభారతి హైస్కూల్, లోపాముద్ర అగస్త్య హైస్కూల్, ఎస్.ఆర్. విద్యానికేతన్ పాఠశాలల్లో విద్యార్థులకు అవగాహన కల్పించారు. బాలల లైంగిక నేరాల నుంచి రక్షణ చట్టం (పోక్సో--2012), బాలల హక్కులు, చట్టపరమైన రక్షణ పై వివరించారు. జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి జి. నిష్కాపాత్రుడు ముఖ్య అతిథిగా పాల్గొని బాలల రక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని తెలిపారు. వేధింపులు లేదా అనుచిత ప్రవర్తన ఎదురైతే భయపడకుండా తల్లిదండ్రులు, ఉపాధ్యాయులకు తెలియజేయాలని సూచించారు. న్యాయ సహాయ రక్షణ న్యాయవాది బి. శ్రీనివాసులు ఉచిత న్యాయ సహాయంపై వివరించారు. డీసీపీఓ నరసింహులు బాలల రక్షణకు సంబంధించిన అంశాలను తెలియజేశారు. సైబర్ వారియర్స్ రమేష్ ఆచారి, రియాజ్ విద్యార్థులకు ఇంటర్నెట్ వినియోగం, ఆన్‌లైన్ వేధింపులు, సైబర్ భద్రతపై అవగాహన కల్పించారు. చైల్డ్‌లైన్ సభ్యురాలు పద్మ, బరోసా బృందం సభ్యురాలు శిరీష బాలలకు అందుబాటులో ఉన్న సహాయ సేవలను వివరించారు. మూడు పాఠశాలల ప్రిన్సిపాళ్లు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పసుపులలో వి బిజీ రాంజీ పథకం పనుల తనిఖీ



కోడేరు (సింగిడి): కోడేరు మండల పరిధిలోని పసుపుల గ్రామపంచాయతీలో వివిజి రామ్‌జి పథకము కింద చేపడుతున్న ఫారం పాండు పనులను ఎంపీవో బలరాం నాయక్, సర్పంచ్ సుల్తానమ్మ రాములు, కార్యదర్శి మల్లేశ్ బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా వారు క్షేత్రస్థాయిలో కూలీలతో సమావేశం ఏర్పాటు చేశారు. పనుల్లో నాణ్యత పాటించడంతో పాటు, కొలతల ప్రకారం పనులు జరిగేలా చూసుకోవాలని కూలీలకు తగు సూచనలు, అవగాహన కల్పించారు.

సైబర్ మోసాలపై అప్రమత్తంగా ఉండాలి..

విద్యార్థులకు అవగాహన కల్పించిన ఇన్‌స్పెక్టర్ శంకర్



నాగర్‌కర్నూల్ రూరల్, (సింగిడి): సైబర్ నేరాల పట్ల విద్యార్థులు, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఇన్‌స్పెక్టర్ శంకర్ సూచించారు. తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో సూచనల మేరకు సైబర్ క్రైమ్ అవేర్‌నెస్ మాసంలో భాగంగా నాగర్‌కర్నూల్ మండలం తూడుకుర్తి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డిజిటల్ సాంకేతికత వినియోగం పెరుగుతున్న నేపథ్యంలో ఆన్‌లైన్ మోసాల పట్ల జాగ్రత్తగా ఉండాలని తెలిపారు. పాఠశాల స్థాయి నుంచే సైబర్ నేరాలపై అవగాహన కల్పిస్తే భవిష్యత్తులో మోసాల బారిన పడకుండా నివారించవచ్చు న్నారు. గుర్తుతెలియని వ్యక్తుల ఫోన్ కాల్స్, సందేశాలు, అనుమానాస్పద లింకులు, నకిలీ బహుమతి ప్రకటనలు, ఆన్‌లైన్ ఉద్యోగాల పేరుతో జరిగే మోసాల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. బ్యాంకు ఖాతా వివరాలు, ఏటీఎం పిన్, ఓటీపీ, పాస్‌వర్డ్‌లను ఇతరులతో పంచుకోవద్దని, సోషల్ మీడియాలో వ్యక్తిగత వివరాలు, ఫొటోలు, ఫోన్ నంబర్లను విచక్షణారహితంగా షేర్ చేయకూడదని హెచ్చరించారు. ఆన్‌లైన్ గేమ్స్, నకిలీ సోషల్ మీడియా ఖాతాలు, ఫిషింగ్ సందేశాలు, డిజిటల్ చెల్లింపుల మోసాలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. అపరిచితులకు డబ్బులు పంపడం, తెలియని లింకులను క్లిక్ చేయడం వంటి చర్యలకు దూరంగా ఉండాలని తెలిపారు. సైబర్ మోసానికి గురైతే భయపడకుండా వెంటనే 1930 హెల్ప్‌లైన్‌కు ఫోన్ చేసి ఫిర్యాదు చేయాలని సూచించారు. సాంకేతికతను సద్వినియోగం చేసుకుంటూ వ్యక్తిగత సమాచారాన్ని భద్రంగా ఉంచుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యతని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎస్ఐలు వెంకటరెడ్డిగిరి, గిరి, మనోహర్‌రెడ్డి, వేణు, షీ టీం సిబ్బంది పాల్గొన్నారు.

మాలల రోస్టర్ పాయింట్ సవరించే వరకు ఉద్యమిస్తాం

మాలల జేఏసీ చైర్మన్ ఆస లక్ష్మణ్



తోగుట (సింగిడి): మాల విద్యార్థులకు, నిరుద్యోగులకు, ఉద్యోగులకు అన్యాయం చేస్తున్న రోస్టర్ పాయింట్ ను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే సవరించి మాలలకు న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ నవంబర్ 5న భూంపల్లి -అక్బర్ పేట మండల కేంద్రంలో దుబ్బాక నియోజకవర్గ మాలల సదస్సు నిర్వహిస్తున్నట్లు సిద్దిపేట జిల్లా మాల జేఏసీ చైర్మన్ ఆస లక్ష్మణ్ తెలిపారు. బుధవారం నాడు మాల జేఏసీ ఆధ్వర్యంలో మాలలకు జరుగుతున్న అన్యాయంపై తొగుట, వెంకట్రావు పేట అంబేద్కర్ విగ్రహాల ముందు మాల జేఏసీ ఆధ్వర్యంలో పోస్టర్ ఆవిష్కరణ చేశారు. ఈ సందర్భంగా డిబిఎఫ్ జాతీయ కార్యదర్శి పి.శంకర్ మాట్లాడుతూ రోస్టర్ పాయింట్ వల్ల జరుగుతున్న అన్యాయంపై మాలలకు అవగాహన కల్పించారు. రాష్ట్ర ప్రభుత్వం సుప్రీంకోర్టు తీర్పుకు భిన్నంగా ఎస్సీ వర్గీకరణతో మాలలకు అన్యాయం జరుగుతుందన్నారు. సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం ఎస్సీల జనాభా లెక్కల సామాజిక స్థితిగతులపై అధ్యయనం చేసి వర్గీకరణ చేయాలని కోర్టు ఆదేశించినప్పటికీ రాష్ట్ర ప్రభుత్వం సుప్రీంకోర్టు ఆదేశానికి భిన్నంగా వ్యవహరించిందన్నారు. 2011 జనాభా లెక్కల ప్రకారం మాలలు 17 లక్షలు ఉంటే 2026 లో 14 లక్షలకు మాలల జనాభాను తగ్గించి చూపడం రాజ్యాంగ వ్యతిరేకమన్నారు. దళితుల స్థితిగతులపై అధ్యయనం చేయకుండానే హడావిడిగా ఎస్సీలను మూడు గ్రూపులుగా వర్గీకరణ చేసి మాలలకు ఐదు శాతం రిజర్వేషన్లు కేటాయించినప్పటికీ రోస్టర్ పాయింట్ లో 22 పాయింటు కేటాయించడం వల్ల మాలలకు ఉన్నత విద్య ఉద్యోగాలలో అవకాశాలు లేకుండా అసలు రిజర్వేషన్లు లేకుండా కాంగ్రెస్ ప్రభుత్వం కుట్ర చేసిందని ఆరోపించారు. గత సంవత్సర కాలంగా ఇచ్చిన ప్రభుత్వ ఉద్యోగ నియామకాల లో రోస్టర్ పాయింట్ వల్ల ఉద్యోగ అవకాశాలు కోల్పోయామని ఆవేదన వ్యక్తం చేశారు. రోస్టర్ పాయింట్ 22 నుండి 10 లోపు కేటాయించాలని మాలలు ఆందోళన చేస్తున్నప్పటికీ రాష్ట్రప్రభుత్వం పట్టించుకోకపోవడం సిగ్గుచేటన్నారు. మాలలు ఉద్యమ బాట పట్టక తప్పదం లేదని ఆందోళన వ్యక్తం చేశారు. రోస్టర్ పాయింట్ సవరించే వరకు ఉద్యమిస్తామని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జేఏసీ నాయకులు ఆస బాబు,జక్కుల రాజు, పల్లెటూరు ప్రసాద్,మదాసు అరుణ్, చందాపూర్ స్వామి ,లింగంపేట మాజీ సర్పంచ్ బాల్ నర్సయ్య,రవి, కిష్టయ్య, స్వామి, తదితరులున్నారు.

భూగర్భ జలాల వినియోగంపై రైతులకు అవగాహన



అమరచింత, (సింగిడి): భూగర్భ జలాల వినియోగం, రోజురోజుకూ పడిపోతున్న నీటిమట్టాలపై రైతులకు అవగాహన కల్పించేందుకు అమరచింత పీజో మీటర్ వద్ద బుధవారం వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్య క్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి, భూగర్భ జల శాఖ ఏడీ ఉమేష్, మండల వ్యవసాయ అధికారి అరవింద్, ఉద్యానవన శాఖ అధికారి సురేష్ తో పాటు అమరచింత మండలంలోని అన్ని గ్రామాల సర్పంచులు, రైతులు, ఇతర అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ భూగర్భ జలాలను అవసరానికి మించి వినియోగించడం వల్ల నీటిమట్టాలు తగ్గిపోతున్నాయని తెలిపారు. రైతులు నీటిని పొదుపుగా వినియోగిస్తూ తక్కువ నీటితో పండే పంటలకు ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. డ్రిప్, స్ప్రింక్లర్ వంటి సూక్ష్మ సేద్య పద్ధతులను అవలంబించాలని, వర్షపు నీటిని ఒడిసిపట్టి భూగర్భ జలాల పెంపునకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. భూగర్భ జలాల పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని, నీటిని వృథా చేయకుండా భవిష్యత్ తరాలకు నీటి వనరులను అందించాలని కోరారు.

విద్యానగర్ కాలనీలో
మౌలిక వసతులు కల్పించాలి
తాగునీటి ఎద్దడి తీర్చండి..
మున్సిపల్ కమిషనర్‌కు వినతిపత్రం సమర్పణ



ఆమనగల్లు, (సింగిడి): ఆమనగల్లు మున్సిపా లిటీలోని 9వ వార్డు పరిధిలో గల విద్యానగర్ కాలనీలో తీవ్రంగా ఉన్న తాగునీటి ఎద్దడిని వెంటనే పరిష్కరించి, కాలనీలో కనీస మౌలిక వసతులు కల్పించాలని కోరుతూ కాలనీ అధ్యక్షుడు ఎంఏ పాషా ఆధ్వర్యంలో బుధవారం ఆమనగల్లు మున్సిపాలిటీ కమిషనర్ రాఘవేందర్ రెడ్డికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎంఏ పాషా మాట్లాడుతూ.. త్వరలో వేసవికాలం ప్రారంభం కానుండటం తో, మునుముందు తాగునీటి ఎద్దడి మరింత తీవ్రతరం కాకముందే మున్సిపల్ కమిషనర్ స్పందించి ఈ వార్డులో నెలకొన్న నీటి సమస్యను శాశ్వతంగా తీర్చాలని కోరారు. ప్రస్తుతం విద్యానగర్ కాలనీలో కేవలం ఒకే ఒక్క బోరు ఉండటంతో తాగునీటి కోసం కాలనీవాసులు తీవ్ర అల్లాడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కావున తక్షణమే మిషన్ భగీరథ, నల్లా పథకం కింద ప్రతి ఇంటింటికీ నల్లా కనెక్షన్లు ఇచ్చి తాగునీటి వసతి కల్పించాలని వారు వినతిపత్రంలో పేర్కొన్నారు. తాగునీటితో పాటు కాలనీలో సీసీ రోడ్లు, భూగర్భ డ్రైనేజీల (అండర్ గ్రౌండ్ డ్రైనేజీ) లాంటి అత్యవసర మౌలిక వసతులను యుద్ధప్రతిపాదికన కల్పించాలని డిమాండ్ చేశారు. మున్సిపల్ కమిషనర్‌కు వినతిపత్రం అందజేసిన వారిలో కో-ఆప్షన్ సభ్యులు చుక్క అల్లాజీ గౌడ్, కాలనీ ఉపాధ్యక్షుడు వర్కాల శేఖర్, కోశాధికారి సుదర్శన్‌రెడ్డి, కాలనీ వాసులు అంకయ్య, రాములు తదితరులు పాల్గొన్నారు.

తిమ్మాజిపేట అక్రమంగా చెరువు నీటి తోడివేత



తిమ్మాజిపేట,(సింగిడి): తిమ్మాజిపేట మం డలం పోతిరెడ్డిపల్లి చెరువు నుంచి కొందరు రైతులు మోటార్లతో నీటిని తోడేస్తుండటంతో చేపలతో పాటు పశువుల తాగునీటికి ఇబ్బందిగా మారిందని మత్స్యకారులు ఆవేదన వ్యక్తం చేశారు. స్థానిక ఏఈ స్పందించకపోవడంతో నాగర్‌కర్నూల్ ఇరిగేషన్ డీఈ, ఈఈలకు వినతిపత్రం అందజేసి, అక్రమ పంపింగ్‌ను నిలిపివేసి న్యాయం చేయాలని కోరారు. కార్యక్రమంలో ణఖీజూ చైర్మన్ వాకిటి ఆంజనేయులు, పలువురు మత్స్యకారులు పాల్గొన్నారు.

రాయడమే కాదు సమాజ సేవ కూడా చేస్తాం!
ప్రజా సమస్యల పరిష్కారానికి జర్నలిస్టులు కృషి చేయాలి
అవసరమైతే ప్రజా సమస్యలపై ఆందోళనలకూ సిద్ధం కావాలి
తెలంగాణ జర్నలిస్టుల సామాజిక వేదిక



పెబ్బేరు (సింగిడి): వనపర్తి జిల్లా పెబ్బేరు మండల కేంద్రంలో జిల్లా మండల విలేకరుల ముఖ్య సమా వేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా ఎం.డి. నిరంజన్ హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడు తూ జర్నలిస్టుల బాధ్యత కేవలం వార్తలు రాయడం, ప్రచురిం చడం లేదా ప్రసారం చేయడంతోనే ముగియదని స్పష్టం చేశారు. సమాజంలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను వెలుగులోకి తీసుకురావడంతో పాటు, వాటి పరిష్కారానికి కృషి చేయడం కూడా జర్నలిస్టుల సామాజిక బాధ్యత అని పేర్కొన్నారు. ప్రజల సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లి, వాటి పరిష్కారానికి నిరంతరం కృషి చేయాలని పిలుపునిచ్చారు. ప్రజా సమస్యల పరిష్కారంలో సంబంధిత అధికారులు నిర్లక్ష్యం వహించినప్పుడు, అవసరమైతే ప్రజాస్వామ్య పద్ధతుల్లో ఆందోళనలు చేపట్టేందుకు కూడా జర్నలిస్టులు సిద్ధంగా ఉండాలని సూచించారు. ప్రజలకు, ప్రభుత్వ యం త్రాంగానికి మధ్య వారధిగా నిలుస్తూ బాధితుల గొంతుకగా మారి, సమాజ అభివృద్ధికి తోడ్పడటమే జర్నలిజం ప్రధాన లక్ష్యమని వారు పేర్కొన్నారు. ప్రజా ప్రయోజనాలకు ప్రాధాన్య మిస్తూ, సామాజిక బాధ్యతతో విధులు నిర్వహించాలని జర్నలిస్టులకు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఎం.గోపా లకృష్ణ, జి. విష్ణు, రామకృష్ణ, శ్రీనివాసులు, శివశంకర్, వెంకటేష్ గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ ఆసుపత్రి సిబ్బందిపై లక్ష్మారెడ్డి సవాల్..
అనిరుధ్ రెడ్డికి నెల రోజుల గడువు!.
"రెండు ఎకరాల స్థలం ఇస్తే నా సొంత ఖర్చులతో ఆసుపత్రి నిర్మిస్తా"
మాజీ మంత్రి లక్ష్మారెడ్డి.

జడ్చర్ల, (సింగిడి): జడ్చర్ల ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్యులు, సిబ్బంది కొరతతో పాటు పాత ఆసుపత్రిలో ఓపీ సేవలకు సంబంధించిన సమస్యలపై మాజీ మంత్రి, బీఆర్ఎస్ నాయకుడు డాక్టర్ సి. లక్ష్మారెడ్డి స్పందించారు. ఈ సమస్యల పరిష్కారానికి జడ్చర్ల ఎమ్మెల్యే జనంపల్లి అనిరుధ్ రెడ్డికి నెల రోజుల గడువు విధిస్తూ సవాల్ విసిరినట్లు ఆయన పేర్కొన్నారు. ప్రభుత్వ ఆసుపత్రిలో అవసరమైన వైద్యులు, సిబ్బందిని నియమించడంపై ప్రభుత్వం దృష్టి సారించాలని లక్ష్మారెడ్డి కోరారు. ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాల్సిన బాధ్యత ప్రజాప్రతినిధులు, సంబంధిత అధికారులపై ఉందన్నారు. ఆసుపత్రిలో నెలకొన్న సమస్యలను పరిష్కరించేందుకు తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు.

రెండు ఎకరాల స్థలం ఇస్తే సొంత ఖర్చులతో ఆసుపత్రి నిర్మిస్తా

జడ్చర్లలో ప్రజలకు మెరుగైన వైద్య సదుపాయాలు అందించేందుకు రెండు ఎకరాల స్థలం కేటాయిస్తే, తన సొంత ఖర్చులతో ఆసుపత్రి నిర్మించేందుకు సిద్ధంగా ఉన్నట్లు లక్ష్మారెడ్డి ప్రకటించారు. ఈ ప్రతిపాదనపై సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు స్పష్టత ఇవ్వాలని ఆయన కోరినట్లు సమాచారం. అలాగే ప్రభుత్వ కార్యాలయాల కోసం కేటాయించిన భూములు, వాటి వినియోగంపై కూడా స్పష్టమైన వివరాలు వెల్లడించాలని ప్రశ్నించినట్లు తెలిసింది. అభివృద్ధి పనులకు సంబంధించిన కాంట్రాక్టర్ల పెండింగ్ బిల్లులు, ఎమ్మెల్యే ప్రకటించిన నిరాహార దీక్ష అంశాలపైనా ఆయన ప్రశ్నలు లేవనెత్తినట్లు కథనంలో పేర్కొనబడింది.

ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలన్నదే ప్రధాన డిమాండ్

జడ్చర్ల ప్రభుత్వ ఆసుపత్రిలో సిబ్బంది కొరత, వైద్య సేవలకు సంబంధించిన సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని



లక్ష్మారెడ్డి డిమాండ్ చేసినట్లు సమాచారం. ఈ అంశంపై ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి, సంబంధిత ప్రభుత్వ అధికారులు స్పందించి స్పష్టమైన కార్యాచరణ ప్రకటించాల్సిన అవసరం ఉందని స్థానికంగా చర్చ జరుగుతోంది. ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్య సేవల మెరుగుదల, సిబ్బంది నియామకాలు, కొత్త ఆసుపత్రి నిర్మాణ ప్రతిపాదనలపై అధికారికంగా వెల్లడయ్యే వివరాలు కీలకంగా మారనున్నాయి.

ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగుల న్యాయమైన
డిమాండ్లను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలి....
ఉద్యోగుల దీక్షకు సంఘీభావం తెలిపిన మాజీ మంత్రులు డా. సి. లక్ష్మారెడ్డి, శ్రీనివాస్ గౌడ్.

జడ్చర్ల, (సింగిడి): మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలో తమ న్యాయమైన డిమాండ్ల సాధన కోసం దీక్ష చేస్తున్న జాతీయ ఆరోగ్య మిషన్ (ఎన్‌హెచ్‌ఎం) ఉద్యోగులకు మాజీ మంత్రులు డా. సి. లక్ష్మారెడ్డి, శ్రీనివాస్ గౌడ్ సంఘీ భావం ప్రకటించారు. ఉద్యోగుల సమస్యలను ప్రభుత్వం వెం టనే పరిష్కరించి, వారి డిమాండ్లను నెరవేర్చాలని వారు డిమాం డ్ చేశారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి డా. సి. లక్ష్మారెడ్డి మాట్లాడుతూ.. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం మాయమాటలు చెప్పి అధికారంలోకి వచ్చిందని, ఇప్పుడు అన్ని వర్గాల ప్రజలను మోసం చేస్తోందని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికా



రంలోకి వచ్చి మూడేళ్లు గడిచిపోయాయని, ఇక మిగిలింది రెండేళ్లేనని పేర్కొన్నారు. రాబోయే రోజుల్లో బీఆర్ఎస్ మళ్లీ అధికారంలోకి వస్తుందని ధీమా వ్యక్తం చేశారు. తాను ఆరోగ్యశాఖ మంత్రిగా పనిచేసిన సమయంలో ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగులు అందించిన సహకారాన్ని ఎప్పటికీ మరువలేనని లక్ష్మారెడ్డి అన్నారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో ప్రసవాల సంఖ్యను పెంచడంతో పాటు వైద్య సేవలను ప్రజలకు చేరువ చేయడంలో ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగుల కృషి అభినందనీయమని కొనియాడారు. ప్రస్తుతం ప్రభుత్వ ఆసుప త్రుల్లో ప్రజలకు సరైన వైద్య సేవలు అందడం లేదని విమర్శించారు. ప్రజారోగ్య పరిరక్షణలో కీలక పాత్ర పోషిస్తున్న ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగుల సమస్యలను ప్రభుత్వం నిర్లక్ష్యం చేయకూడదని అన్నారు. ఉద్యోగుల న్యాయమైన డిమాండ్లను వెంటనే నెరవేర్చి, వారికి న్యాయం చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగుల దీక్షకు సంఘీభావం తెలిపిన మాజీ మంత్రులు, వారి సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం తక్షణమే చర్యలు తీసుకోవాలని కోరారు.

జడ్చర్లలో కాంగ్రెస్ ఆధ్వర్యంలో గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఓటరు నమోదు కార్యక్రమం
అర్హులైన పట్టభద్రులు ఓటర్లుగా నమోదు చేసుకోవాలి: కాంగ్రెస్ నాయకులు

జడ్చర్ల, (సింగిడి): గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో జడ్చర్లలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో పట్టభద్రుల ఓటరు నమోదు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జడ్చర్ల పోలీసు అధికారులను కలిసి, అర్హులైన పట్టభద్రులు ఓటర్లుగా నమోదు చేసుకునేందుకు అవసరమైన ఎన్‌రోల్‌మెంట్ ఫారాలను అందజేశారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో ఓటు హక్కు కీలకమని, అర్హత కలిగిన ప్రతి పట్టభద్రుడు గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఓటరుగా నమోదు చేసుకుని ఎన్నికల ప్రక్రియలో భాగస్వామి కావాలని ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకులు కోరారు. పట్టభద్రులకు తమ ఓటు హక్కుపై అవగాహన కల్పించడంతో పాటు, అర్హులైన వారందరూ నమోదు ప్రక్రియను పూర్తి చేసేలా కృషి చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో జడ్చర్ల టౌన్ కాంగ్రెస్ అధ్యక్షుడు వంశీ చారీ, కాంగ్రెస్ సీనియర్ నాయకుడు, మాజీ సర్పంచ్ నిత్యానందం,



పీసీసీ సభ్యుడు అశోక్ యాదవ్, డీసీసీ ఉపాధ్యక్షుడు మీనాజోద్దీన్, తుంగ రఘు, శాగంటి రఘు, బత్తుల బాలు, మల్లికార్జున్, జావీద్ తదితర నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. పట్టభద్రుల హక్కు – ఓటు హక్కు! అర్హులైన ప్రతి పట్టభద్రుడు ఓటరుగా నమోదు కావాలి అనే సందేశాన్ని నాయకులు ఈ సందర్భంగా తెలియజేశారు.

రక్తదానం ఆపదలో ప్రాణాలు కాపాడుతుంది
ఆమనగల్లు పోలీస్‌స్టేషన్‌లో ఘనంగా రక్తదాన శిబిరం.. హాజరైన డీసీపీ నారాయణరెడ్డి







ఆమనగల్లు,(సింగిడి): పోలీస్ అమరవీరుల సంస్మరణ దినోత్సవం సందర్భంగా ఆమనగల్లు పోలీస్‌స్టేషన్ ఆవరణలో మంగళవారం ఆమనగల్లు పోలీస్ శాఖ, లయన్స్ క్లబ్ ఆఫ్ ఆమనగల్లు సంయుక్త ఆధ్వర్యంలో భారీ రక్తదాన శిబిరం నిర్వహించారు. స్థానిక సీఐ వెంకటేశ్వర్లు ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమానికి మహేశ్వరం డీసీపీ నారాయణరెడ్డి, ఏసీపీ జానకిరెడ్డి,జాతీయ ఓబీసీ మాజీ కమిషన్ సభ్యులు తల్లోజు ఆచారి ముఖ్య అతిథులుగా హాజరై శిబిరాన్ని ప్రారం భించారు. ఈ సందర్భంగా డీసీపీ నారాయణరెడ్డి, ఏసీపీ జానకిరెడ్డి మాట్లాడుతూ.. దేశ రక్షణ, శాంతిభద్రతల కోసం విధి నిర్వహణలో ప్రాణాలు అర్పించిన పోలీస్ అమరవీరుల త్యాగాలు వెలకట్టలేనివని కొనియాడారు. వారిని స్మరించుకుంటూ సమాజ శ్రేయస్సు కోసం రక్తదాన శిబిరం నిర్వహించడం ఎంతో అభినందనీయమని ప్రశంసించారు. ప్రజల భద్రత కోసం, దేశ శాంతిభద్రతల రక్షణ కోసం తమ ప్రాణాలను పణంగా పెట్టిన పోలీస్ అమరవీరుల త్యాగాలు ఎప్పటికీ స్మరణీయమని అన్నారు. అమరవీరుల సేవలను స్మరిస్తూ, సమాజంలో ప్రాణాపాయంలో ఉన్న వారిని ఆదుకునేందుకు రక్తదానం వంటి గొప్ప కార్యక్రమాన్ని చేపట్టడం సంతోషకరమని హర్షం వ్యక్తం చేశారు. రక్తం లభించక ఎంతో మంది ప్రాణాలు కోల్పోతున్నారని, మనం ఇచ్చే ప్రతి రక్తం బొట్టు మరొకరి జీవితంలో వెలుగులు నింపుతుందని వారు తెలిపారు. అత్యవసర సమయాల్లో ప్రాణాలు కాపాడేందుకు రక్తదానం ఒక సంజీవనిలా పనిచేస్తుందని పేర్కొన్నారు. రక్తదానం అనేది మరొకరికి ప్రాణదానంతో సమానమని, ఆపదలో ఉన్నవారి ప్రాణాలను కాపాడేందుకు ఇది ఎంతగానో దోహదపడుతుందని వారు పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ సామాజిక బాధ్యతగా రక్తదానం చేయడానికి ముందుకు రావాలని పిలుపునిచ్చారు. ఈ శిబిరంలో పలువురు యువకులు, పోలీస్ సిబ్బంది స్వచ్ఛందంగా పాల్గొని రక్తదానం చేశారు,. రక్తదాతలకు అధికారులు ఈ సందర్భంగా ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో , మున్సిపల్ చైర్మన్ పత్య నాయక్, కౌన్సిలర్లు వెంకటయ్య,కో అప్షన్ సభ్యులు అల్లాజీ,మాజీ జెడ్పీటిసి కండె హరిప్రసాద్, సర్పంచ్ శ్రీనివాస్, లయన్స్ క్లబ్ కోశాధికారి గంప శ్రీను, క్యాంపు చైర్మన్ జూలూరి రమేష్, చంద్రశేఖర్, పిఆర్ఓ పాషా, నాయకులు గుర్రం కేశవులు,నర్సింహా, లక్ష్మణ్,కండె భాస్కర్, ప్రశాంత్, చెన్నకేశవులు, చేగూరి వెంకటేష్,జహంగీర్ అలీ, విక్రమ్, ఫరీద్,శ్రీకాంత్, చెన్నకేశవులు, రవి రాథోడ్, తదితరులు ఉన్నారు.

గిరిజన రైతులను మోసం చేస్తే పోరాటం తప్పదు
ఒకే బేస్ విలువ.. వేర్వేరు పరిహారాలా? ప్రభుత్వ తీరుపై తల్లోజు ఆచారి మండిపాటు
పరిహారం పెంచకుంటే రహదారి పనులను అడ్డుకుంటాం: :తల్లోజు ఆచారి

ఆమనగల్లు, (సింగిడి): రంగారెడ్డి జిల్లా ఆమన గల్లు ప్రాంతంలో చేపట్టిన గ్రీన్‌ఫీల్డ్ రేడియల్ రోడ్డు నిర్మాణంలో భూములు కోల్పోతున్న గిరిజన రైతులకు నష్టపరిహారం చెల్లింపుల్లో తీవ్రమైన వివక్ష చూపుతున్నారని మాజీ జాతీయ బీసీ కమిషన్ సభ్యులు తల్లోజు ఆచారి తీవ్రస్థాయిలో మండిపడ్డారు. బుధవారం ఆమనగల్లు బీజేపీ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, ప్రభుత్వ అధికారులు ఒకే తరహా బేస్ విలువ ఉన్న భూములకు ప్రాంతాల వారీగా వేర్వేరు పరిహారాలు కేటాయించి గిరిజనులను నిలువునా మోసం చేస్తున్నారని ఆరోపించారు. కడ్తాల్ మండలంలో ఎకరాకు ప్రభుత్వ బేస్ విలువ రూ. 13,12,500 ఉండగా నష్టపరిహారంగా రూ. 55,56,400 చెల్లించారని, అదే ఆమనగల్లు శివారులోని సాకిబండ తండాలో మాత్రం కేవలం రూ. 37,04,255 మాత్రమే నిర్ణయించారని ఆచారి గణాంకాలతో సహా వివరించారు. ఒకే ప్రభుత్వ బేస్ విలువ ఉన్నప్పటికీ నష్టపరిహారంలో ఇంత భారీ వ్యత్యాసం ఎందుకు చూపిస్తున్నారని ఆయన ప్రభుత్వాన్ని నిలదీశారు. సాకిబండ తండా గిరిజనరైతులకుకూడా అదేస్థాయిలో ఎకరాకు రూ. 55 లక్షల పైచిలుకు పరిహారం అందించాలని డిమాండ్ చేశారు. ఈ ఆరోపణలపై అధికారిక వర్గాలు మరియు పాలకపక్షనేతలు స్పందిస్తూ నిబంధనల ప్రకారమే భూ సేకరణ నష్టపరిహార నిర్ణయం జరుగుతోందని స్పష్టం చేశారు. భూము ల మార్కెట్ విలువ, జియోట్యాగింగ్ మరియు నిపుణుల కమిటీనివేదికల ఆధారంగానే పరిహారాల చెల్లింపులు ఉంటాయని,ఇందులో ఎలాంటి రాజకీయ కక్షసాధింపులు లేవని వారు తెలిపారు. అభివృద్ధి ప్రాజెక్టులను అడ్డుకోవడమే ప్రతిపక్షాల ప్రధాన



ఉద్దేశమని అధికార పార్టీ నేతలు తిప్పికొట్టారు. గిరిజన రైతులకు తగిన న్యాయం జరిగే వరకు వెనక్కి తగ్గేది లేదని, అవసరమైతే పెద్దఎత్తున ధర్నాలు చేపట్టి రహదారి పనులను అడ్డుకుంటామని తల్లోజు ఆచారి హెచ్చరించారు. పోలీసు బలగాలను మోహరించినా రైతుల హక్కుల కోసం పోరాటం ఆగదని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో రైతులు బోడ్యా నాయక్, రవి రాథోడ్, శివరాం, మణిపాల్, రాజేందర్, ప్రశాంత్ నాయక్, ఆమనగల్ మున్సిపాలిటీ బీజేపీ అధ్యక్షుడు కర్నాటి విక్రమ్ రెడ్డి, మాజీ జెడ్పీటీసీ కండేరు ప్రసాద్, మాజీ కౌన్సిలర్లు, కౌన్సిలర్లు సునీత, ప్రశాంత్ నాయక్, ఎర్రవోలు మహేష్, చెన్నకేశవులు, కృష్ణ యాదవ్, శ్రీకాంత్ సింగ్, నరసింహ, లక్ష్మణ్, జయరాం, బాలు, పద్మ ప్రశాంత్ తదితర బీజేపీ నాయకులు, కార్యకర్తలు, రైతులు పాల్గొన్నారు.

గ్రామీణ యువతకు ఆసరాగా ఐక్యత ఫౌండేషన్.. మాడుగులలో జాబ్ డ్రైవ్ సక్సెస్



ఆమనగల్లు , (సింగిడి): గ్రామీణ ప్రాంత నిరుద్యోగ యువతకు ఉద్యోగ అవకాశాలను చేరువ చేసే లక్ష్యంతో మాడుగుల మండల కేంద్రంలోని శ్రీ వాసవి ఫంక్షన్ హాల్లో ఐక్యత ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన 26వ మెగా జాబ్ డ్రైవ్ విజయవంతమైంది. కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు, ఐక్యత ఫౌండేషన్ చైర్మన్ సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి సహకారంతో చేపట్టిన ఈ శిబిరానికి మండల వ్యాప్తంగా ఉన్న యువతీ యువకులు వందలాదిగా పోటెత్తారు.
ఈ జాబ్ మేళాకు సుమారు 400 మందికి పైగా నిరుద్యోగ యువత హాజరుకాగా, వివిధ ప్రముఖ కంపెనీల ప్రతినిధులు అభ్యర్థుల అర్హతలను పరిశీలించి 217 మందిని ప్రాథమికంగా ఎంపిక చేశారు. ప్రముఖ ఎలక్ట్రానిక్ సంస్థ ప్రతినిధి ఎల్.ఎన్. కౌశిక్ మరియు వారి హెచ్ఆర్ బృందం



నిరుద్యోగుల చెంతకే కొలువులు
మెగా జాబ్ మేళా.. వందలాదిగా తరలివచ్చిన యువత
మాడుగుల జాబ్ మేళాలో 217 మంది ఎంపిక

ఇంటర్వ్యూల ప్రక్రియను క్షుణ్ణంగా పర్యవేక్షించారు. ఎంపికైన అభ్యర్థులకు విడతల వారీగా నియామక పత్రాలను అందజేయనున్నట్లు నిర్వాహకులు వెల్లడించారు. ఈ సందర్భంగా ఐక్యత ఫౌండేషన్ చైర్మన్ సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి మాట్లాడుతూ.. గ్రామీణ యువతలో అద్భుతమైన నైపుణ్యాలు ఉన్నప్పటికీ, సరైన సమాచారం మరియు వేదిక లేకపోవడం వల్లే ఉపాధి అవకాశాలను కోల్పోతున్నారని



ఆవేదన వ్యక్తం చేశారు. అలాంటి యువతకు నేరుగా కంపెనీలను ముంగిటకే తెచ్చి ఉపాధి కల్పించడమే ఐక్యత ఫౌండేషన్ ప్రధాన ఉద్దేశమని స్పష్టం చేశారు. యువత ఆర్థికంగా స్థిరపడినప్పుడే కుటుంబాలు, గ్రామాలు బలోపేతం అవుతాయని ఆయన అభిప్రాయపడ్డారు. సొంత మండలంలోనే ఇంత పెద్ద ఎత్తున జాబ్ డ్రైవ్ నిర్వహించి ఉద్యోగ అవకాశాలు కల్పించడం పట్ల స్థానిక యువత హర్షం వ్యక్తం చేస్తూ సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. భవిష్యత్తులోనూ మరిన్ని ప్రాంతాల్లో ఇలాంటి ఉపాధి శిబిరాలు నిర్వహించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఐక్యత ఫౌండేషన్ మండల ఇంచార్జి సూదిని జైపాల్ రెడ్డి, స్థానిక సర్పంచ్లు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పట్టభద్రుల ఎమ్మెల్సీ బరిలో గూడూరుపేరును తెరపైకి తెచ్చిన బీఆర్ఎస్ నేతలు



ఆమనగల్లు, (సింగిడి): హైదరాబాద్ రంగారెడ్డి మహబూబ్ నగర్ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల రాజకీయాలు వేడెక్కుతున్నాయి. ఈ క్రమంలో బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యం లో నిర్వహించిన నియోజకవ ర్గస్థా యి ఎమ్మెల్సీ సన్నాహక సమా వేశంలో కీలక పరిణామం చోటుచేసు కుంది. రాష్ట్ర సర్పంచుల సంఘం మాజీ అధ్యక్షుడు గూడూరు లక్ష్మీనర సింహారెడ్డి (ఎల్ఎన్ రెడ్డి) పేరును ఎమ్మెల్సీ అభ్యర్థిగా మాజీ ఎమ్మెల్యే జైపాల్ యాదవ్ ప్రతిపాదించారు. ఈ ప్రతిపాదనకు గిడ్డంగుల సంస్థ మాజీ చైర్మన్ రజని సాయిచంద్, మిషన్ భగీరథ వైస్ చైర్మన్ ఉప్పల వెంకటేష్ తోపాటు పలువురు ప్రముఖ నాయకులు మద్దతు తెలిపారు. రాబోయేఎన్నిక లను పార్టీ పరంగా ప్రతిష్టాత్మకంగా తీసుకోవాలని నాయకులు పిలుపునిచ్చారు. అర్హులైన ప్రతి ఒక్క పట్టభద్రుడిని ఓటర్లుగా నమోదు చేయించే బాధ్యతను కార్యకర్తలు భుజానకెత్తుకోవాలని సూచించారు. ఓటరు నమోదు ప్రక్రియలో ఎటువంటి అలసత్వం ప్రదర్శించకుండా క్షేత్రస్థాయిలో సమన్వయంతో పనిచేయాలని నేతలు దిశానిర్దేశం చేశారు. పట్టభద్రుల సమస్యలపై నిరంతరం పోరాడే నాయకుడిని బరిలో నిలపడం ద్వారా విజయం సాధించవచ్చని అభిప్రాయపడ్డారు. ఈ ఎమ్మెల్సీ స్థానానికి సంబంధించి పార్టీ అధిష్టానం నుంచి అధికారిక ప్రకటన వెలువడాల్సి ఉంది. పట్టబ ద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థిగా బీఆర్ఎస్ పార్టీ తరఫున ఎల్ఎన్ రెడ్డి కి రోజురోజుకూ మద్దతు పెరుగుతోంది. పట్టభద్రుల సమస్యల పరిష్కారం, నిరుద్యోగ యువతకు అండగా నిలవడం, విద్యావంతుల గొంతుకగా శాసనమండలిలో తమ వాణిని వినిపించాలనే ఆకాంక్షతో ఆయన అభ్యర్థిత్వానికి బీఆర్ఎస్ శ్రేణుల నుంచి సానుకూల స్పందన లభిస్తోంది. ఈ క్రమంలో కల్వకుర్తి నియోజకవర్గం తలకొండపల్లి మండలంలో జరిగిన పట్టభద్రుల ఓటరు నమోదు సన్నాహక సమావేశంలో బీఆర్ఎస్ పార్టీ ఇన్చార్జి జైపాల్ యాదవ్, బీఆర్ఎస్ పార్టీ కల్వకుర్తి ఎమ్మెల్సీ ఎన్నికల ఇన్చార్జి రజనీ సాయి చంద్, మిషన్ భగీరథ మాజీ వైస్ చైర్మన్ ఉప్పల వెంకటేష్ మరియు నియోజకవర్గానికి చెందిన బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు ఎల్ఎన్ రెడ్డికి మద్దతుగా ఏకగ్రీవ తీర్మానం చేసినట్లు ప్రకటించారు. పార్టీ శ్రేణుల ఈ నిర్ణయం ఆయన అభ్యర్థిత్వానికి మరింత బలాన్ని చేకూర్చునుందని రాజకీయ వర్గాల్లో చర్చ జరుగుతోంది. ఈ సమావేశంలో వివిధ మండలాల పార్టీ అధ్యక్షులు, ప్రజాప్రతినిధులు, స్థానిక నాయకులు పెద్ద సంఖ్యలోకార్యకర్తలు పాల్గొన్నారు. ఎన్నికల సన్నాహాలపై సుదీర్ఘంగా చర్చించిన నేతలు, త్వరలో అనుసరించాల్సిన వ్యూహాలపై దిశానిర్దేశం చేశారు.

గడువులోగా ఎమ్మెల్సీ ఓటు నమోదు చేసుకోవాలి
తల్లోజు ఆచారి



ఆమనగల్లు, (సింగిడి): మహబూబ్‌నగర్, రంగారెడ్డి మరియు హైదరాబాద్ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో ఓటరు నమోదు ప్రక్రియ ముమ్మరంగా సాగుతోంది. అర్హులైన ప్రతి పట్టభద్రుడు తమ ఓటు హక్కును సద్విని యోగం చేసుకోవాలని బీజేపీ నాయకులు, జాతీయ బీసీ కమిషన్ మాజీ సభ్యులు తల్లోజు ఆచారి స్పష్టం చేశారు.

singidinews@gmail.com



ఆ సమయంలో అండగా నిలిచింది అతనే..

జాన్వీ కపూర్

బాలీవుడ్ స్టార్ హీరోయిన్ జాన్వీ కపూర్ తన వ్యక్తిగత జీవితం గురించి, ముఖ్యంగా శిఖర్ పహారియాతో ఉన్న అనుబంధం గురించి 'కాఫీ విత్ కరణ్' టాక్ షోలో ఆసక్తికర వ్యాఖ్యలు చేసింది. తన జీవితంలో ఎదురైన అత్యంత కష్టసమయంలో శిఖర్ తనను ఏ విధంగా సపోర్ట్ చేశాడో గుర్తు చేసుకుంటూ ఎమోషనల్ అయింది. 2018లో తల్లి, అతిలోక సుందరి శ్రీదేవి హఠాన్మరణం చెందినప్పుడు తాము ఎదుర్కొన్న దారుణమైన పరిస్థితులను ఈ వేదికపై పంచుకుంది. లండన్‌లో చదువుకుంటున్న శిఖర్ పహారియా తన చదువును అర్ధాంతరంగా ఆపేసి ముంబైకి వచ్చేశాడని వెల్లడించింది. తనకు ఎప్పుడు ఏ అవసరం వస్తుందో, తాను ఎక్కడ ఒంటరైపోతానో అని భయపడి జుహూలోని తన స్నేహితుడి ఇంట్లోనే నెల రోజుల పాటు రహస్యంగా ఉన్నాడనే విషయం తనకు చాలా కాలం తర్వాత తెలిసిందని చెబుతూ ఎమోషనల్ అయ్యింది. తల్లిని కోల్పోయిన ఆ ఘోరమైన సమయంలో చెల్లెలు ఖుషీ కపూర్ తన ఏడుపును ఆపేసి తనకు ధైర్యం చెప్పిన తీరును కూడా జాన్వీ 'కాఫీ విత్ కరణ్' షోలో గుర్తు చేసుకుంది. శిఖర్ పహారియా, జాన్వీ కపూర్ గత కొన్నేళ్లుగా ప్రేమలో ఉన్నప్పటికీ తమ బంధాన్ని అధికారికంగా ప్రకటించలేదు. అయితే చాలా ఇంటర్వ్యూలలో తన జీవితంలో శిఖర్ పాత్ర ఎంత ముఖ్యమైందో ఆమె చెబుతూనే వస్తోంది. ఇక సినిమాల విషయానికి వస్తే, జాన్వీ ఇటీవల రామ్ చరణ్ సరసన 'పెద్ది' సినిమాలో నటించి అలరించగా, తదుపరి టైగర్ ష్రాఫ్, లక్ష్యలతో కలిసి 'లగ్ జా గలే' సినిమాలో నటిస్తోంది. ఈ సినిమా 2027 మే 14న ప్రేక్షకుల ముందుకు రానుంది.

కొత్త సినిమా ప్రకటించిన నిహారిక కొణిదెల..

బ్లాక్‌బస్టర్ మాత్రమే కాదు భారీ జాక్‌పాట్ అంటూ పోస్ట్



నిహారిక కొణిదెల నిర్మాణంలో తెరకెక్కుతున్న సినిమా టైటిల్‌ను తాజాగా ప్రకటించారు మేకర్స్. ఈ మేరకు ఓ డిఫరెంట్ పోస్టర్‌ను షేర్ చేస్తూ.. 'లైట్స్, కెమెరా, యాక్షన్.. కోసం అధికారిక పేరు (పాకెట్ రాకెట్) ని పరిచయం చేస్తున్నాం. సీట్ బెల్టులు బిగించుకోండి, ఎందుకంటే ఈ ప్రయాణం అద్భుతంగా, అత్యంత ఉత్సాహభరితంగా ఉండబోతోంది.. ఇది కేవలం బ్లాక్‌బస్టర్ మాత్రమే కాదు, ఒక భారీ జాక్‌పాట్!' అంటూ ఈ సినిమాకు 'పాకెట్ రాకెట్' అనే టైటిల్‌ను ఫిక్స్ చేసినట్లు తెలిపారు. కాగా.. పింక్ ఎలిఫెంట్ పిక్చర్స్, మ్యాక్సిమమ్ సిటీ స్టూడియోస్ సంయుక్తంగా ఈ చిత్రాన్ని రూపొందిస్తున్నాయి. ఇందులో నటించే నటీనటులు, టెక్నీషియన్స్, ఇతర వివరాలు త్వరలో ప్రకటించనున్నారు చిత్ర బృందం.

యంగ్ టీమ్‌ను బ్లెస్ చేయండి..

'సమ్మర్ హాలిడేస్' సినిమాపై ట్రైలర్‌పై శ్రీవిష్ణు కామెంట్స్



సక్సెస్ ఫుల్ ప్రొడ్యూసర్ ధీరజ్ మొగిలినేని తన ధీరజ్ మొగిలినేని ఎంటర్‌టైన్మెంట్స్ బ్యానర్‌పై రూపొందిస్తున్న మూవీ 'సమ్మర్ హాలిడేస్'. దర్శకుడు శ్రీకర్ రూపొందిస్తున్న ఈ చిత్రంలో మాస్టర్ రోహన్, మాస్టర్ అరుణ్, బేబి ఖుషి కీలక పాత్రల్లో నటిస్తున్నారు. నవంబర్ 6న గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్‌కు రాబోతుండగా.. తాజాగా కింగ్ ఆఫ్ ఎంటర్‌టైన్మెంట్ హీరో శ్రీవిష్ణు అతిథిగా ఈ చిత్ర ట్రైలర్ లాంచ్ చేశారు. ఈ ఈవెంట్‌లో హీరో శ్రీవిష్ణు మాట్లాడుతూ.. 'సమ్మర్ హాలిడేస్ సినిమా ట్రైలర్ నాకు బాగా నచ్చింది. ఈ ట్రైలర్ చూస్తున్నప్పుడు నేను చిన్నప్పుడు సెలవుల్లో ఊరెళ్లిన మెమొరీస్ గుర్తుకువచ్చాయి. ఈ సినిమాను నేను తప్పకుండా చూస్తాను. ఈ దీపావళి పండక్కి నవంబర్ 6న మీరంతా ఫ్యామిలీతో కలిసి "సమ్మర్ హాలిడేస్" సినిమాను థియేటర్స్‌లో చూడాలని కోరుతున్నా. పిల్లలంతా బాగా నటించారు. ఈ యంగ్ టీమ్‌ను మీరంతా బ్లెస్ చేయండి. రోహన్ నాతో కలిసి నటించాడు. సినిమా మీద బాగా ఇష్టం ఉన్న యాక్టర్ తను. సమ్మర్ వస్తే అమ్మమ్మ, తాతయ్య ఊరికి వెళ్లడం అనేది మనం మర్చిపోయాం. కానీ ఈ సినిమా చూస్తే ఒకప్పుడు మనం సమ్మర్ ఎలా ఉండేది అని గుర్తుచేసుకుంటారు. వాసుకి గారిని చూస్తుంటే తొలి ప్రేమ సినిమానే గుర్తుకొస్తుంది. నవంబర్ 6న ఈ చిన్న పిల్లల సినిమాను పెద్ద మనసుతో పెద్ద హిట్ చేస్తారని కోరుకుంటున్నా' అని తెలిపాడు.

నా ఎదుగుదలను తట్టుకోలేకే నాపై లేనిపోని పుకార్లు

తాప్సీ పన్ను

స్టార్ హీరోయిన్ తాప్సీ పన్ను లేడీ ఓరియంటెడ్ సినిమాలు, సస్పెన్స్ థ్రిల్లర్లతో పాటు కమర్షియల్ చిత్రాల్లో నటిస్తూ తనదైన మార్క్ చూపించారు. ఎలాంటి సినీ బ్యాక్‌గ్రౌండ్ లేకుండా సొంత కష్టంతోనే స్టార్ పొజిషన్‌కు చేరుకున్నారు. వరుస సినిమాలతో దూసుకుపోతున్న ఈ భామ.. తాజాగా, ఇండస్ట్రీలో తాను ఎదుర్కొన్న వివక్షపై సంచలన వ్యాఖ్యలు చేసింది. తన వెనుక ఏ బ్యాక్‌గ్రౌండ్ లేకపోవడం వల్లే తన ఎదుగుదలను ఇండస్ట్రీలోని కొంతమంది అస్సలు తట్టుకోలేకపోతున్నారని ఫైర్ అయింది. ముఖ్యంగా బాలీవుడ్ బాద్‌షా షారూఖ్ ఖాన్ సరసన 'డంకీ' సినిమాలో లీడ్ రోల్ ఆఫర్ వచ్చినప్పుడు ఇండస్ట్రీ వర్గాలు షాక్ అయ్యాయని తాప్సీ గుర్తుచేసుకుంది. తన వెనుక ఫలానా స్టార్ ఫ్యామిలీ ఉందనో, గాడ్‌ఫాదర్ ఉన్నాడనో, ఒక పెద్ద స్టూడియో సపోర్ట్ ఉందనో చెప్పుకోవడానికి ఏమీ లేదని స్పష్టం చేసింది. అందుకే 'డంకీ' ఆఫర్ రాగానే అసలు ఈమెకి ఛాన్స్ ఎలా వచ్చిందంటూ అందరూ వింతగా చూశారని చెప్పింది. తనకు షారూఖ్ సోషల్ సర్కిల్‌తో పరిచయాలు లేవని, డైరెక్టర్ రాజ్‌కుమార్ హిరానీతో అంతకుముందు పనిచేయలేదని వెల్లడించింది.

ఒక సినిమాలో తన పెర్ఫార్మెన్స్ నచ్చి హిరానీ ఆఫీస్‌కు పిలిపించారని, ఆ తర్వాత 'డంకీ' కథ వినిపిస్తా అని అడగ్గానే తాను నమ్మలేకపోయానని తెలిపింది. 'డంకీ'లో నటించే అవకాశం తనకు వచ్చినప్పుడు అందరూ షాక్ అయ్యారని వెల్లడించింది. పరిచయాలు లేని తాను ఆ ప్రాజెక్ట్‌లోకి రావడాన్ని చాలామంది తట్టుకోలేకపోయారని ఆవేదన వ్యక్తం చేసింది. "నన్ను ఎవరూ ఒక మూస పద్ధతిలో ఇరికించలేరు. ఎవరికీ పెద్దగా నా వ్యక్తిగత విషయాలు తెలియకపోవడం వల్లే నా గురించి ఇష్టం వచ్చినట్లు తప్పుడు ప్రచారాలు చేశారు. 'ఈమెతో పనిచేయడం చాలా కష్టం, ఆమెతో ఎవరూ పని చేయాలనుకోరు, రకరకాల సమస్యలు ఉన్నాయి' అంటూ కావాలనే నాపై అసత్య కథలు అల్లారు" అని మండిపడింది. ఎలాంటి అండదండలు లేకుండా కేవలం తన టాలెంట్‌ను నమ్ముకుని ఇండస్ట్రీలో నిలబడినందుకు తనకు ఎంతో గర్వంగా ఉందని తాప్సీ తేల్చిచెప్పింది.



సినిమా సింగిడి
Cinma Singidi

శుక్రవారం
30-10-2026

Printed and Published by Mohan Pusala on behalf of Flamingo Media Networks, Printed at Sree Seshasai Enterprises Plot no.98/1, Co-operative Industrial Estate, Gandhi Nagar, Near Balanagar, Medchel Malkajgiri Dist.Hyderabad Telangana 500037.and Published from PLOT NO 74 A/D, KAMAKSHI NILAYAM, ESHWARIPURI COLONY, SAINIKPURI, MEDCHAL MALKAJGIRI, TELANGANA - 500094.
Editor : Pusala mohan, PRGI.REGN.NO. TGTEL/26/A4370. Cell 91 89199 18737